ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 05.12.2025 | సంపుటి :12 సంచిక : 136 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో

## జోక్యం చేసుకోం

పిటిషన్లపై విచారణలో హైకోర్టు స్పష్టీకరణ



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌ల వ్యవహారంలో దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు ఇవాళ తీర్పు వెలువరించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. చట్టప్రకారం ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం తెలిపింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని చోట కూడా ఆయా కులాలకు వార్డుమెంబర్లు, సర్పంచి రిజర్వేషన్లు కేటాయించారన్న పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచి రిజర్వేషన్లు కేటాయించడం వల్ల తప్పులు దొర్లాయని తెలిపారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులానికి చెందిన వ్యక్తులు లేకపోతే ఎన్నికల నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ఎస్‌ఈసీ వాదనను రికార్డు చేసుకున్న హైకోర్టు.. పిటిషన్లపై విచారణ ముగించింది.

త్వరలో

# ప్రాణహిత ప్రారంభిస్తాం



## విమానాశ్రయం పూర్తిచేస్తాం

## ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేస్తాం

"దేశం నలుమూలల నుంచి అదిలాబాద్‌కు వస్తున్నారు. వాళ్లు రావాలంటే కష్టంగా ఉంది. అందుకే మనకు ఎయిర్ పోర్టు ఉండాలని ఆలోచన చేశాం. ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి పరిశ్రమలు తీసుకొచ్చేలా చేస్తాం. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తాం."
- సీఎం రేవంత్ రెడ్డి

ఆదిలాబాద్‌ప్రతినిధి(జనంసాక్షి): ఆదిలాబాద్‌జిల్లాకు సిఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు ప్రకటించారు. ఎయిర్ పోర్టు, యూనివర్సిటీ, తుమ్మడిహట్టి ద్వారా నీళ్లు తీసుకొచ్చే బాధ్యత తనలదని ప్రకటించారు. ఈ క్రమంలో ఎయి ర్‌పోర్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఏడాదిలోపు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభిస్తామని వ్యాఖ్యానించారు. వరంగల్‌తో పాటు ఆదిలాబాద్‌కు అన్ని రకాల వసతులతో కూడిన ఎయిర్‌పోర్టు ఉండాల్సిందేనని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఎయిర్ పోర్టు వస్తే ఆదిలాబాద్‌కు పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు సీఎం మిగతా 2లో..

- ఎర్రబస్సు రావడమే కష్టమన్నారు ఇప్పుడు ఏకంగా ఎయిర్‌బస్ తీసుకొస్తున్నాం
- ఎయిర్‌పోర్టు నిర్మించి..పరిశ్రమలు రప్పిస్తాం
- ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసేందుకు సిద్ధం
- ఇంద్రవెల్లిలో నిర్మించి కుమురంభీం వర్సిటీ అని పెట్టాలని సూచించా
- ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టి ఆదిలాబాద్ జిల్లాకు నీరందిస్తాం
- జిల్లాలో మూతపడిన సిమెంట్ పరిశ్రమను పునరుద్ధరిస్తాం
- ఆదిలాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- రూ.18.70 కోట్ల విలువైన అభివృద్ధి పనులకుశంకుస్థాపన
- ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో ప్రసంగం





ప్రొటోకాల్ పక్కన పెట్టి..

- భారత్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్
- ఘనంగా స్వాగతం పలికిన ప్రధాని మోడీ
- ఇరువురు నేతలు కలిసి ప్రధాని నివాసానికి చేరిక
- నేడు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు

విమానాశ్రయానికి వెళ్లి

# పుతిన్‌కు స్వాగతం పలికిన మోదీ



న్యూఢిల్లీ(జనంసాక్షి): రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. దిల్లీ సమీపంలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగిన ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ఇద్దరు నేతలు ఒకే కారులో ప్రధాని అధికారిక నివాసానికి ప్రయాణమయ్యారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా రెండు రోజుల పాటు ఇండియా పర్యటనకు వచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ ఆయనను స్వయంగా ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతించారు. పుతిన్ 23వ ఇండియా-రష్యా శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. రెండు దేశాల మధ్య రక్షణ, వాణిజ్య రంగాలలో పలు కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభానికి కొన్ని నెలల ముందు 2021 డిసెంబరులో పుతిన్ చివరిసారి దిల్లీలో పర్యటించారు. ఆ తర్వాత ఆయన మన దేశానికి మిగతా 2లో..

# చత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్

బీజాపూర్‌లో మరోసారి ఎదురుకాల్పులు • ఐదుగురు మావోయిస్టులు మృతి

బుధ,గురువారాల్లో కలిపి మొత్తం 19 మంది మృతి


చర్ల(జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్-దంతెవాడ సరిహద్దు అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య మరోసారి ఎదురుకాల్పులు జరిగాయి. బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు, ముగ్గురు డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) జవాన్లు మృతి చెందారు. గురువారం నాటికి మృతుల సంఖ్య మరింత పెరిగింది. మొత్తంగా బుధ, గురువారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 19 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలి నుంచి మావోయిస్టుల మృతదేహాలతో పాటు పెద్దఎత్తున ఆయుధ, పేలుడు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్ సరిహద్దుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన డీఆర్‌జీ జవాన్లు మోను వడాడి, దుకారు గోండె, రమేశ్ సోడి మృతదేహాలను బీజాపూర్‌లోని పోలీసు లైన్‌కు గురువారం తీసుకువచ్చారు. అక్కడ వారికి పోలీసు, జిల్లా ఉన్నతాధికారులు నివాళి అర్పించారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరోవైపు, ఈ సంవత్సరంలోనే కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, బాలకృష్ణ, గణేశ్, కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డి, హిడ్మా లాంటివారు మృతి చెందడం అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న లొంగిపోవడం మిగతా 2లో..



అధ:పాతాళానికి

## రూపాయి

- రూ.90.36 వద్ద ప్రారంభమై, రూ. 90.43కు చేరిక
- ఆందోళన బాటలో కాంగ్రెస్



ముంబై,డిసెంబర్ 4(జనంసాక్షి): భారతదేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో రూపాయి మరింతగా పతనం అయ్యింది. తాజాగా గురువారం ఉదయం డాలర్‌తో పోలిస్తే 28 పైసలు తగ్గి, ఆల్ టైమ్ కనిష్ట స్థాయి 90.43కి చేరింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో రూ.90.36 వద్ద ప్రారంభమై, కనిష్ట స్థాయి 90.43ని తాకింది. రూపాయి పడిపోవడం దిగుమతులను మరింత ఖరీదైనదిగా మారనున్నది. ఇది దేశంలో ధరల పెరుగుదలకు దారి తీస్తుందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. రూపాయి విలువ మిగతా 2లో..




# 2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకనామీయే లక్ష్యం

రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని శాసించనున్న ఏఐ

- వేయికోట్ల రూపాయలతో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తాం
- 'క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దుతాం
- నీతి ఆయోగ్ క్వాంటం సదస్సులో డిప్యూటీసీఎం భట్టి, శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి): రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రపంచాన్ని శాసిస్తుందని డిప్యూటీ సీఎం విక్రమార్క పేర్కొన్నారు. అయితే, తెలంగాణ 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి చేరుకోవాలని ప్లాన్ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన క్వాంటం పవర్డ్ ఎకానమీ స్ట్రాటజీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాటాడుతూ.. క్వాంటం టెక్నాలజీ గురించి దేశం చర్చిస్తుంది.. దాని ఆవిష్కరణకి తెలంగాణను ఎంచుకున్నందుకు నీతి ఆయోగ్ కి ధన్యవాదాలు చెప్పుకొచ్చారు. డిజిటల్, టాలెంట్ కి హైదరాబాద్ కి కేంద్రంగా మారింది అన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా టెక్నాలజీని ప్రమోట్ చేసే పనిలో ఉన్నారు.. నీతి ఆయోగ్ కూడా గ్లోబల్ సమ్మిట్‌లో భాగస్వామ్యం కావాలని కోరుతున్నాం.. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అన్ని రంగాల పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం.. యంగ్ ఇండియా స్టార్టప్ కోసం ఫండింగ్ చేయాలని నిర్ణయించాం.. 1000 కోట్ల మిగతా 2లో..

హిడ్మా హత్యలో

## ఆ ముగ్గురే ద్రోహులు

- విజయవాడకు చెందిన సివిల్ కాంట్రాక్టర్, బిల్డర్, ఫర్నీచర్ వ్యాపారులే ఇన్ఫార్మర్లు
- దేవ్ జీ హస్తం ఆరోపణలు కుట్రపూరితం
- ప్రకటన విడుదల చేసిన మావోయిస్టు పార్టీ



2లో..

# బీఆర్‌ఎస్ పోరుబాట

- హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ భారీ భూ కుంభకోణం
- పారిశ్రామికవేత్తలకు భూములుకట్టబెట్టే కుట్రలు
- బీఆర్‌ఎస్ రాగానే ఈ పాలసీని రద్దు చేస్తాం
- ఎవరైనా పెట్టుబడి పెడితే నష్టపోక తప్పదు
- జీడిమెట్ల పారిశ్రామిక వాడను సందర్శించిన కేటీఆర్

హైదరాబాద్,డిసెంబర్ 3(జనంసాక్షి): హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్‌ఎస్ వర్కింగ్ కేటీఆర్‌ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీని రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు మిగతా 2లో..




## ఆదాయానికి మించిన ఆస్తులు

- మూడు రాష్ట్రాల్లో వందల కోట్ల రూపాయలు..
- రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డు ఏడి శ్రీనివాస్ అరెస్ట్
- కలెక్టరేట్ సహా ఆరు ప్రాంతాల్లో ఏసీబీ దాడులు



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డ్ ఏడి శ్రీనివాస్ అరెస్ట్ అయ్యారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గురువారం ఆయనను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఏడి శ్రీనివాస్ ఇల్లు బంధువుల ఇళ్లలో తనిఖీలు చేశారు. మొత్తం ఆరు ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఏడి శ్రీనివాస్‌కు రాయదుర్గం మై హెూమ్ భుజలో ప్లాట్, కర్ణాటకలో 11 ఎకరాల వ్యవసాయ భూమి, ఏపీలోని అనంతపురంలో మరో పదకొండు ఎకరాల వ్యవసాయ భూమి, మహబూబ్‌నగర్‌లో 4 ఎకరాలు, నారాయణపేటలో మూడెకరాలు ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా ఇంట్లో రూ 5 లక్షల మిగతా 2లో..

# కాలుష్య కోరలకు పిల్లలు బలవుతున్నారు

ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకి క్షీణిస్తోంది • సోనియా ఆందోళన



న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ రాజధాని దిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకి క్షీణిస్తుంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు. వాయు కాలుష్యం అరికట్టేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దిల్లీలో వాయు కాలుష్యంపై గురువారం ప్రతిపక్షాలు పార్లమెంటు ఆవరణలో నిరసనలు తెలిపాయి. మాస్కులు ధరించి ప్రధాని ప్రకటనలు చేయడం ఆపి.. చర్యలు చేపట్టడంపై దృష్టిపెట్టాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సమస్యపై పార్లమెంటులో చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ.. నినాదాలు చేశారు. ఇందులో సోనియాగాంధీతో మిగతా 2లో..

పాక్‌కు సైనిక సమాచారం

## చేరవేత

ఇద్దరిని అరెస్ట్ చేసిన గుజరాత్ ఏటీఎస్

2 లో..

పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లు

## హ్యాక్

మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసుల అనుమానాలు

## 2047 నాటికి 3 ట్రిలియన్ల
# ఎకనామీయే లక్ష్యం

రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. 'క్వాంటం సిటీ'గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీని రూపొందించా మన్నారు. గచ్చిబౌలిలోని 'ఐఐటీ హైదరాబాద్'లో 'నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీలో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్టక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్‌లో ఆర్అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశర చేసే 'డైరెక్షన్' అని అన్నారు. ఈ టెక్నాలజీ లో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. 'ఇండస్ట్రీ డే' పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు..

## అవసరమైతే అదనపు సిబ్బందిని తీసుకోండి'

**బీఎల్‌వోల ఆత్మహత్యల వేళ 'సుప్రీం' సూచన**

**న్యూఢిల్లీ:**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారులు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పలువురు బీఎల్‌వోలు అనారోగ్యానికి గురి కావడం, రాజీనామాలు చేస్తుండటం, పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు కీలక సూచనలు చేసింది. బీఎల్‌వోల పని గంటలను తగ్గించేందుకు అదనపు సిబ్బందిని నియమించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. నిర్ణీత సమయంలో విధులు నిర్వర్తించనందుకుగానూ బీఎల్‌వోలపై బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ నటుడు విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. తీవ్ర పని ఒత్తిడి కారణంగా అనేక మంది బీఎల్‌వోలు మరణించారని, విధులు నిర్వర్తించడంలో విఫలమైతే వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారని టీవీకే తరఫు న్యాయవాది వాదించారు. ఈ నేపథ్యంలో కొన్ని సూచనలు జారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఎల్‌వోలపై పని ఒత్తిడిని తగ్గించేందుకు అదనపు సిబ్బందిని నియమించడాన్ని రాష్ట్రాలు పరిగణించొచ్చని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

# త్వరలో ప్రాణహిత ప్రారంభిస్తాం




రేవంత్‌రెడ్డి. ఎర్రబస్సే కాదని.. ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం ప్రసంగించారు. ఆదిలాబాద్ అభివృద్ధి బాధ్యత నేనే తీసుకుంటానని చెప్పుకొచ్చారు. ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి.. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. రెండేళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. చిన్న వయసులోనే నాకు గొప్ప అవకాశం దక్కడం.. ప్రజల దీవెన, దేవుడి సంకల్పం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాల కతీతంగా కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అనుమతించలేదు. ఎమ్మెల్యే లను కూడా సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేళ్లలో చూశాం. ఏ ఆశయంతో సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారో.. గత పదేళ్లలో అది నెరవేరలేదు. రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంటరీ రూపొందించాం. పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం అని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి స్ఫూర్తిగానే గత ప్రభుత్వంపై నేను పోరాటం ప్రారంభించానని అన్నారు. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపం పర్యాటకంగా అభివృద్ధి చేసే దస్త్రంపై సంతకం పెట్టాను. ఆదిలాబాద్‌కు సాగునీరు అందేలా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వైఎస్ఆర్ చేపట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మూడేళ్లకే కాళేశ్వరం కూలింది. ప్రజల సొమ్ము దోచుకుని అక్రమ సొమ్ము కోసం ఇవాళ ఆ కుటుంబంలో గొడవలు పడుతున్నారు. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తాం. ఎన్నికల ఉత్సవం పూర్తి కాగానే మరో 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని సీఎం హామీ ఇచ్చారు. తమ్మిడిహట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కట్టితీరుతామని స్పష్టం చేశారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తానే వస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయని వివరించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు మళ్లీ వస్తానని.... రోజంతా సమస్యలపై సమీక్షిస్తానని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్‌లో ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఆదిలాబాద్‌లో తప్పకుండా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ ఎక్కడ కట్టాలో స్థానిక నేతలంతా కలిసి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిలో యూనివర్సిటీ కడితే బాగుంటుందని తన భావన అని తెలిపారు. అనుమతి మాత్రమే తనదని.. ఎక్కడ కట్టాలో నిర్ణయం మీదేనని చెప్పుకొచ్చారు. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. రాబోయే రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. మన యువత ఐఏఎస్, ఐపీఎస్‌లు అయినప్పుడే తనకు సంతోషమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాగా చదువుకుని తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటాలన్నారు. సర్పంచ్‌లను చూసి ఎన్నుకోవాలని, పనిచేసే వారికే అవకాశం ఇవ్వాలన్నారు. రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, తదితరులు సభలో పాల్గొన్నారు.

## అధ:పాతాళానికి రూపాయి

మరింతగా పతనం చెంది 91కి చేరుకుంటుందని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ప్యానెల్ వడ్డీ రేటుపై నిర్ణయాన్ని శుక్రవారం ప్రకటించనున్నారు. అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి పతనం కొనసాగుతూనే ఉంది. భారత్-అమెరికా డీల్‌పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో రూపాయి మారకం విలువ నానాటికీ క్షీణిస్తోంది. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ విలువ ఏకంగా 28 పైసలు పడిపోయి 90.43 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. క్రితం సెషన్‌లో రూపాయి విలువ 90.15 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఈ క్షీణత మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని, రూపాయి విలువ 90.70-91 మార్క్‌ను తాకనుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొన్ని నెలలుగా భారత ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండ టంతో, డాలర్లకు గిరాకీ పెరిగి రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతోంది. వస్తువులకు చెల్లింపులు చేసేందుకు దిగుమతిదారులు భారీగా డాలర్లను కొనుగోలు చేస్తుండటమూ రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. మరోవైపు, నేటి ట్రేడింగ్‌లో స్టాక్‌మార్కెట్ సూచీలు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. దీంతో సూచీలు స్తబ్దుగా కదలాడుతున్నాయి. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో సెన్సెక్స్ స్వల్పంగా 33 పాయింట్ల లాభంతో 85,140 వద్ద, నిఫ్టీ 6 పాయింట్ల లాభంతో 25,992 వద్ద ట్రేడ్ అవుతున్నాయి.

## పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లు హ్యాక్

**మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానాలు**

హైదరాబాద్,డిసెంబర్ 3(జనంసాక్షి):తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఇటీవలే హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ క్రిమినల్స్.. తాజాగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లను పనిచేయకుండా చేశారు. దీంతో గద పది రోజులుగా రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లు పూర్తిగా నిలిచిపోయాయి. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే అధికారిక సమాచారానికి బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో సర్వర్లను డౌన్ చేసి వాటిని నిర్వహిస్తున్న ఎన్ఐసీకి సమాచారం అందించారు. సమస్యను పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పోలీస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన ÷ర్‌వాల్స్ ఆడిట్ చేస్తున్నారు. ఆడిహ్యాకింగ్‌కు కారణమైన ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేస్తూ సర్వర్‌ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, ఇదే తరహాలో పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయినట్లు సమాచారం. ఇప్పటికే డార్క్ వెబ్‌లో 22 వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉందని సైబర్ నిపులు చెబుతున్నారు.

## హిడ్మా హత్యలో ఆ ముగ్గురే ద్రోహులు

- **విజయవాడకు చెందిన సివిల్ కాంట్రాక్టర్, బిల్డర్, ఫర్నీచర్ వ్యాపారులే ఇన్ఫార్మర్లు**
- **దేవ్ జీ హస్తం ఆరోపణలు కుట్రపూరితం**
- **ప్రకటన విడుదల చేసిన మావోయిస్టు పార్టీ**



**విశాఖపట్టణం,డిసెంబరు4(జనంసాక్షి):** మావోయిస్టు కీలక నేత హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ మరో సంచలన లేఖను విడుదల చేసింది. హిడ్మాది పూర్తిగా బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ పేరుతో లేఖ విడుదలైంది. హిడ్మాతో పాటు శంకర్లను పట్టుకుని చిత్రహింసలు పెట్టి చంపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి చెందిన కొందరు కలప వ్యాపారుల ద్రోహం వల్లనే వీళ్ళు దొరికిపోయారని మండిపడ్డారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా, శంకర్లు చికిత్స కోసం విజయవాడకు వెళ్లినట్లు చెప్పారు. కలప వ్యాపారులతో కలిసి విజయవాడకు వెళితే వాళ్ళని పట్టుకున్నారన్నారు. వారం రోజుల పాటు చిత్రహింసలకు గురిచేసి ఆంధ్రా పోలీసులు చంపేశారని ఆరోపించారు. హిడ్మా, శంకర్ల ఎన్‌కౌంటర్లపై సమగ్ర దర్యాప్తు చేయాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ లేఖలో స్పష్టం చేశారు. కాగా.. గత నెలలో (నవంబర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో రెండు భారీ ఎన్‌కౌంటర్లు జరిగిన విషయం తెలిసిందే. నవంబర్ 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావో కీలక నేత హిడ్మాతో పాటు ఆయన భార్య, పలువురు అనుచరులు హతమవ్వగా, నవంబర్ 19న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ శంకర్ సహా ఆరుగురు మృతి చెందారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోయిస్టులు హతమయ్యారు. అలాగే ఘటనా స్థలంలో దొరికిన డైరీలోని సమాచారం ఆధారంగా ఏపీలోని పలు జిల్లాల్లో పోలీసులు తనిఖీలు చేసి దాదాపు 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.


తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
యూనిట్-I, నాగర్‌కర్నూల్ జిల్లా

గెజిట్ నెం.155/2025
సంఖ్య.బి2/719/25 తేది: 12-11-2025

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

ఫారం -VII
(Declaration) రూఢీ ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా **తాడూర్** మండలములోని **అంతారం** గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన **ఎ.1.10** గుంటలు భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా **డిస్ట్రిబ్యూటరి కెనాల్-28 (MJR-2/MINOR-5L)** నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ॥లు **1.10** గు॥ భూమి **డిస్ట్రిబ్యూటరి కెనాల్-28 (MJR-2/MINOR-5L)** నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము:అంతారం | మండలం:తాడూర్ | జిల్లా:నాగర్‌కర్నూల్

| క్ర స. | సర్వే నెం. / ఎస్‌డి నెం. | పట్టా/ ఇనాం etc., | భూ వర్గీ కరణ మెట్ట/ ఆరు తడి/ తరి | భూ సేకరణకు ప్రతి పాదించిన విస్తీర్ణం ఎ. గుంటలు | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 109 | పట్టా | మెట్ట | 0.23 | వడ్ల ప్రణీత భర్త రమేష్ (0.02) కొమ్ము కిష్టమ్మ భర్త బస్వయ్య (0.03) జి.మమత భర్త మధు సూదన్‌రెడ్డి (0.03) [illegible] | 118 | 108 | 112 | 102 | [illegible] | [illegible] | [illegible] (10) | 0.07 |
| 2 | 102 | పట్టా | మెట్ట | 0.10 | [illegible] తండ్రి చిన్న హన్మంతు అడవి బాల్‌రాం తండ్రి కాశన్న బలమోని బాబు తండ్రి వెంకటయ్య బతమోని శంకర్ తండ్రి వెంకటయ్య అడవి వెంకటయ్య తండ్రి పెద్ద హన్మంతు అడవి చిట్టమ్మ భర్త కిరణ్ స్వామి | 119 | 103 | 109 | 101 | [illegible] | [illegible] | [illegible] | 0.10 |
| 3 | 101 | పట్టా | మెట్ట | 0.17 | అడవి వెంకటయ్య తండ్రి హన్మంతు(0.10) అడవి కృష్ణయ్య తండ్రి చిన్న హన్మంతు (0.07) గువ్వల రాములు తండ్రి నర్సింహ్మా అడవి రుకుణమ్మ భర్త నర్సింహ్మా | 11 | 43 | 102 | 100 | [illegible] | [illegible] | [illegible] | 0.07 |
| | మొత్తము | ఎ.1.10గుం. | | | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల సుండి ఎటువంటి అభ్యంతరములు / ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢీ ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పనివేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియ నందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/- స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (భూ.సే) యూనిట్-I,యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టరు, నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR RO.No.906/LA/PP/Advt/Pub/2025-26


## కాలుష్య కోరలకు పిల్లలు బలవుతున్నారు

పాటు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. అనంతరం సోనియా విలేకరులతో మాట్లాడుతూ.. వాయు కాలుష్యంతో పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వృద్ధులు అవస్థలు పడుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరగాలని.. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. 'ఎలాంటి వాతావరణాన్ని ఆస్వాదించాలి. బయట కాలుష్య పరిస్థితులు చూడండి. సోనియాగాంధీ చెప్పినట్లు పిల్లలు ఊపిరి పీల్చుకోలేకపోతున్నారు. అనేకమంది వృద్ధులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడుతున్నారు. ఏటా ఈ పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఈ ప్రభుత్వం ప్రకటనలు చేయడం తప్ప, చర్యలు తీసుకోదు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలి. ఇది రాజకీయ సమస్య కాదు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు' అని అన్నారు. పార్లమెంటులో శీతాకాల సమావేశాలు జరుగుతున్న తరుణంలో.. వాయుకాలుష్యంపై చర్చ జరపాలంటూ కాంగ్రెస్ ఎంపీలు కొందరు నోటీసులు జారీ చేశారు. ఇందులో పార్టీ ఎంపీ మాణికం ఠాగూర్ మాట్లాడుతూ.. వాయు కాలుష్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా సలహాలు ఇస్తోందని మండిపడ్డారు. కాలుష్యం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విమర్శలు గుప్పించారు.

## ఆదాయానికి మించిన ఆస్తులు

రూపాయల నగదు, ఆరు కిలోల బంగారం, 770 గ్రాముల వెండి రెండు విలువైన కార్లు పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

**కలెక్టరేట్‌లో కలకలం**

రంగారెడ్డి జిల్లా ఏడి సర్వేయర్ శ్రీనివాస్ పై అవినీతి ఆరోపణలు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు ఫిర్యాదులో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. అదేవిధంగా హైదరాబాదు, రంగారెడ్డి, బాలానగర్ ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు చేపట్టాయి. రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏసీబీ అధికారుల దాడుల నేపథ్యంలో ఇటీవలే అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి సైతం 8 లక్షల రూపాయల లంచం తీసుకుంటూ పట్టుబడిన ఘటన మరువకముందే రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏడి సర్వేయార్ శ్రీనివాస్‌పై దాడులు చేయడం కలకలం రేపింది.

## పాక్‌కు సైనిక సమాచారం చేరవేత

**ఇద్దరిని అరెస్ట్ చేసిన గుజరాత్ ఎటిఎస్**

**న్యూఢిల్లీ,డిసెంబరు4(జనంసాక్షి):**సైనిక వ్యవహారాలకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఓ ఆర్మీ విశ్రాంత ఉద్యోగి, మరో మహిళను గుజరాత్ ఏటీఎస్ అరెస్టు చేసింది. ఈ ఇద్దరూ పాకిస్థానీ ఏజెంట్లతో సమాచారాన్ని పంచుకుంటున్నట్లు గుర్తించింది. సైన్యం కదలికలు, కీలక అధికారుల బదిలీల గురించి సమాచారం అందించమని అతన్ని పాక్ నిఘా సిబ్బంది ప్రలోభపెట్టినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. కొంతమంది సైనిక సిబ్బందిని హనీట్రాప్ చేయమని ఆ మహిళకు చెప్పారన్నారు. ఈ గూఢచర్య నెట్‌వర్క్‌కు సంబంధించిన ఆధారాలను నిందితుల ఫోన్ల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుజరాత్ ఏటీఎస్ ఎస్పీ సిద్దార్థ్ కోరుకొండ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన అజయ్‌కుమార్ సింగ్ (47) సైన్యంలో పనిచేసి 2022లో రిటైరయ్యాడు. ప్రస్తుతం గోవాలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతడు సైన్యంలో సుబేదార్‌గా ఉన్నప్పుడే.. 'అంకిత శర్మ' పేరుతో ఓ పాకిస్థానీ నిఘా అధికారి అతన్ని సంప్రదించాడు. పరిచయం పెంచుకుని.. భారత ఆర్మీ రెజిమెంట్ల కదలికలు, కీలక ఆర్మీ అధికారుల బదిలీల వంటి సున్నితమైన సమాచారాన్ని టెక్ట్స్, ఫొటోలు, వీడియోల రూపంలో పంపించాడు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రష్మణి పాల్ (35).. 'ప్రియా ఠాకుర్' అనే నకిలీ గుర్తింపుతో పనిచేస్తోంది. డబ్బుకు ఆశపడి పాక్ ఏజెంట్లు చెప్పినట్లు.. సైనిక సిబ్బందితో స్నేహం చేయడం ద్వారా వారి నుంచి సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం.

# ప్రొటోకాల్ పక్కన పెట్టి.. విమానాశ్రయానికి వెళ్లి పుతిన్‌కు స్వాగతం పలికిన మోదీ

రావడం ఇదే తొలి సారి. రష్యా చమురు కొనుగోలు చేస్తోం దన్న కారణంతో భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు అమలు చేస్తున్న వేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించు కుంది. పుతిన్ కు ప్రధాని మోదీ ప్రైవే టు విందు ఇవ్వనున్నట్లు సమాచారం. శుక్రవారం ఇరునేతలు ఇండియా-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పలు రక్షణ, వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. భారత్‌తో సంబంధాలు, సహకారాన్ని మరింత పెంపొందించుకోవడానికి రష్యా ఎదురు చూస్తోందని పుతిన్ ఇప్పటికే తెలిపారు. ఇంధనం, పరిశ్రమలు, అంతరిక్షం తదితర రంగాల్లో అనేక ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసుకోవడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భారత్ నుంచి దిగుమతులు మరింత పెంచుకునే అంశంపైనా చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. గురువారం వ్లాదిమిర్ పుతిన్ పాలం వైమానిక దళ స్టేషన్‌లో దిగగా ప్రధాని మోదీ ఆయనకు స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 11.00: పుతిన్ రాష్ట్రపతిని కలిసేందుకు రాష్ట్రపతి భవన్‌కు వెళతారు. ఉదయం 11.30కు రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పిస్తారు. ఉదయం 11.50: నరేంద్ర మోదీతో సమావేశం. మధ్యాహ్నం 1.50: హైదరాబాద్ హౌస్‌లో సంయుక్త విలేకరుల సమావేశం ఉంటుంది. సాయంత్రం 7.00 గంటలు: పుతిన్ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం అవుతారు. రాత్రి 9.00 గంటలకుఆయన తన పర్యటనను ముగించుకుని భారతదేశం నుండి బయలుదేరుతారు. పుతిన పర్యటన సందర్భంగా ఢిల్లీలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పుతిన్ ఇష్టపడే ఆహారం ఇదే..!

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గురువారం భారత పర్యటనకు విచ్చేయనున్నారు. నాలుగేళ్ల తర్వాత మన దేశానికి వస్తున్న పుతిన్.. పర్యటనలో భాగంగా పలు ఒప్పందాలు చేసుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో కలిసి ప్రైవేట్ డిన్నర్ చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో రష్యా అధ్యక్షుడు ఇష్టంగా ఏం తింటారు..? ఆయన డెయిలీ ఫుడ్ రొటీన్ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలోనే పుతిన్ ఆహారపు అలవాట్లపై పలు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వచ్చాయి. మరి ఆయన ఫేవరెట్స్ ఏంటో చూద్దాం..! పుతిన్ ఎక్కువగా తేలికగా జీర్ణమయ్యే, సంప్రదాయ వంటకాలను ఇష్టపడతారట. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో రష్యాలో పాపులర్ అయిన టోవోరాగ్ (కాటన్ చీజ్, తేనె కలిపి చేసే వంటకం)ను తింటారు. దీంతోపాటు కౌజుపిట్ట గుడ్లు, తాజా పళ్లతో చేసే జ్యూస్ తీసుకుంటారు. ప్రొటీన్ కోసం చేపలను ఎక్కువగా తింటారని ఆ కథనాలు పేర్కొన్నాయి. స్టర్‌జియన్ చేప, గొర్రె పిల్ల మాంసం అంటే పుతిన్‌కు చాలా ఇష్టమట. చక్కెరతో చేసే పదార్థాలకు ఆయన దూరంగా ఉంటారు. డెజర్ట్‌లపై ఆసక్తి చూపించరని తెలుస్తోంది. వాటికి బదులుగా టమోటాలు, దోసకాయలు వంటి కూరగాయలతో చేసే సలాడ్‌లను తీసుకుంటారు. చాలా అరుదుగా ఐస్‌క్రీమ్, పేస్ట్రీలు వంటివి తింటారట. అధికారిక డిన్నర్లలో ఎక్కువగా చేపలతో చేసే సూప్, మాంసాహారానికి ప్రాధాన్యమిస్తారని ఆ కథనాలు తెలిపాయి. 2014లో పుతిన్ భారత్‌కు వచ్చినప్పుడు నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కశ్మీరీ సంప్రదాయ వంటకాలతో రష్యా అధ్యక్షుడికి విందు ఏర్పాటు చేశారు. కుంకుమపువ్వుతో చేసే పానీయం, పాలకూరతో తయారుచేసిన హాక్ కా సాగ్‌తో పాటు గులాటీ కబాబ్, ముర్గ్ ధనివాల్ కుర్మా, బాదాం షోర్బా, గులాబ్ ఖీర్, చీజ్ కేక్ వంటివి అందులో వడ్డించారు. ఇక, 2018 నాటి పర్యటనలోనూ పుతిన్ కోసం ప్రత్యేకంగా వెజిటేరియన్, నాన్ వెజ్ వంటకాలను తయారుచేశారు. అందులో సాల్మాన్ ఫిల్లెట్, మొఘలాయ్ స్టైల్‌లో చేసిన గొర్రె మాంసం, చికెన్ వెరైటీలు, వాటర్‌మిలన్ క్రీమ్ సూప్, మొలకెత్తిన గింజలతో చేసిన పఫ్, కబాబ్, రికోటా సిల్వర్ పెరల్స్ వంటి డిషెస్ ఉన్నాయి. అయితే, వీటిని పుతిన్ తిన్నారా? లేదా అన్నదానిపై స్పష్టత లేదు. సాధారణంగా విదేశీ పర్యటనల్లో పుతిన్ చుట్టూ కఠినమైన భద్రతా ప్రొటోకాల్ ఉంటుంది. పుతిన్ తీసుకునే ఆహారంలో విష పదార్థాలేమైనా కలిశాయా అని గుర్తించేందుకు విదేశాల్లో ఆయన వెంట వ్యక్తిగత ప్రయోగశాల ఎప్పుడూ ఉంటుంది. విదేశాల్లో హోటల్ స్టాఫ్ సేవలను ఆయన వాడుకోరు. ఆయన కోసం రష్యా నుంచే చెఫ్‌లు, హౌస్‌కీపింగ్ సిబ్బంది వస్తారు.

**2 బిలియన్ డాలర్ల సబ్‌మెరైన్ డీల్?**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన వేళ ఇరుదేశాల మధ్య పలు రక్షణ, వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఓ జలాంతర్గామి లీజుకు సంబంధించిన డీల్ కూడా ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీని విలువ దాదాపు రెండు బిలియన్ డాలర్లని తెలుస్తోంది. ఈ జలాంతర్గామి కోసం దాదాపు పదేళ్లుగా చర్చలు జరుగుతున్నాయి. కానీ, ధర విషయంలో ఇన్నాళ్లు సయోధ్య కుదరలేదు. పుతిన్ పర్యటన వేళ ఈ చర్చలు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. రెండేళ్లలో రష్యా దాన్ని భారత్‌కు అందించనున్నట్లు సమాచారం. ఇటీవల భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి మాట్లాడుతూ.. త్వరలో ఓ అటాక్ సబ్‌మెరైన్ సేవల్లోకి రానున్నట్లు తెలిపారు. నావికాదళంలో ఇప్పటికే ఉన్న రెండింటి కంటే అది పెద్దదని తెలిపారు. అంతకు మించి వివరాలేమీ వెల్లడించలేదు.

## బీఆర్ఎస్ పోరుబాట

పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. అనుముల రేవంత్ రెడ్డి కాదని, అవినీతి అనకొండ అని విమర్శించారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటం కొనసాగుతుం దన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతున్నదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీడిమెట్ల ప్రాంతంలో గజానికి మార్కెట్ ధర లక్ష రూపాయలుగా ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కే భూమిని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతున్నదని విమర్శించారు.

# సీఎం నోట టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ మాట

- త్వరలో ఎయిర్పోర్ట్ నిర్మాణ పనులు ప్రారంభం
- ఇంద్రవెల్లిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం
- బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- 18.70 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** సీఎం నోట టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ అనే మాట వచ్చింది. ఎందుకంటే జిల్లా కేంద్రానికి కొద్ది కిలో మీటర్ల దూరంలో ఉన్న మహారాష్ట్ర టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఉన్న నేపథ్యంలో దేశం నలు మూలల నుంచి ఎందరో మంది పర్యాటకులు ప్రతి నిత్యం జిల్లా మీదుగా వాహనాల్లో వస్తూ పోతుంటారని, అదే విధంగా వ్యాపార నిమిత్తం వ్యాపారులు కూడ ఈ జిల్లా నుంచే వెళ్తారని కావున జిల్లా కేంద్రంలో ఎయిర్పోర్ట్ నిర్మాణం చేసి విమాన సర్వీసులు నడిపిస్తే ఇక్కడి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దొరకడమే కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని అందుకే త్వరలో జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని పనులు కూడ త్వరలో ప్రారంభిస్తామని సభలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల పేరుతో భారీ కార్యక్రమం నిర్వహించి గడిచిన రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను సభకు వచ్చిన ప్రజలకు వివరించారు. అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమం సాయంత్రం 3 -30 గంటలకు ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం కు అదికారులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. సీఎం చేతుల మీదుగా 18,70 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన గావించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం గంట కూడ సెలవు లేకుండా ప్రతీరోజూ శ్రమిస్తూన్నానన్నారు ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత నాది అని అందుకోసం ఎన్ని నిధులైన మంజూరు చేసి జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తానని అన్నారు. అదే విధంగా ఇంద్రవెల్లిని పర్యాటక రంగంగా మార్చి అభివృద్ధి చేస్తానని అన్నారు. అదే విధంగా జిల్లాలో యూనివర్శిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మూత పడిన సిమెంట్ పరిశ్రమను తిరిగి ప్రారంభించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. గడిచిన రెండేళ్ల కాలంలో బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. త్వరలో జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో మంచి పనులు చేసే అభ్యర్థులకే ఎన్నుకోవాలని పదిమందిలో పాకులాటలు పెట్టి పనిచేయని వారిని ఎన్నికోవద్దని ప్రజలకు సూచించారు. జిల్లాకు త్వరలోనే మళ్లీ వచ్చి జిల్లా అదికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి అభివృద్ధిపై సమీక్ష సమావేశాలు నిర్వహించి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్ఏ లు వెడమ బొజ్జు, వివేక్, పాయల శంకర్, ఎంపి నగేష్, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పోలీస్ సంక్షేమానికి మరో అడుగు

- జిల్లాలో నూతన పోలీసు భవనాల ప్రారంభం
- ఆధునిక వసతులతో కూడిన నూతన పోలీసు భవనాలను ప్రారంభించిన డీజీపీ శివధర్ రెడ్డి

**నిర్మల్ (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తన పర్యటనలో భాగంగా ఎల్లపల్లి వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందికి నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించారు.పోలీసు సిబ్బందికి మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ నిర్మాణాలు, భవిష్యత్‌లో నిర్మల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయనున్నాయి. అనంతరం, నూతన జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన ఈ ఆధునిక భవనాలు పోలీసు సిబ్బందికి మెరుగైన పనిస్థలం, నివాస వాతావరణం అందించడమే కాకుండా, జిల్లాలో సేవల నాణ్యతను పెంచేందుకు దోహదపడతాయని అన్నారు. నిర్మల్ పోలీసింగ్ రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని, ప్రజా సేవలో మరింత నిబద్ధతతో పనిచేయాలని అన్ని స్థాయి అధికారులను డీజీపీ సూచించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్ గారితో పాటు, ఎం.ఎల్.ఏ మహేశ్వర్ రెడ్డి, ఐ.జి.పి(పి అండ్ ఎల్)ఎండీ.టి.జి.పి.హెచ్.సి రమేష్, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,పోలీస్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకాంతా చారి ఆశయ సాధన కృషి చేయాలి

**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉద్యమకారుడు శ్రీకాంత చారి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. తుదిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతచారి వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాము అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకుడు శల్వ చారి కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యాటక కేంద్రంగా ఉమ్మడి జిల్లా అభివృద్ధి

- తద్వారా స్థానికుకలు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు
- ప్రజల కష్టాలు తెలిసన వ్యక్తి సిఎం రేవంత్
- ఆదిలాబాద్ పర్యనటనలో మంత్రి జూపల్లి కృష్ణారావు

**ఆదిలాబాద్, డిసెంబరు4 (జనంసాక్షి) :** మినీ కాశ్మీర్ గా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. తద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.పేదలు కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. గతంలో పాలించిన కేసీఆర్ పుణ్యమా అని ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా తయారైందన్నారు. రూ. 8 లక్షల కోట్ల రూపాయల అప్పుల చేస్తే.. దానికి ప్రతీ నెల ప్రజా ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తుంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ రెండేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు.. ఇవాళ ఆదిలాబాద్ లో రూ. 260.45 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఆదిలాబాద్ లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కు పునాదిరాయి వేసుకున్నాం అని జూపల్లి వివరించారు. ఆదిలాబాద్ లో ఏయిర్ పోర్టు ఏర్పాటుకు 700 ఎకరాల భూసేకరణ కోసం సీయం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా 61 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. రానున్న రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. చనాక- కొరాట బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పదేండ్లలో ఒక ఎకరానికి కూడా సాగునీరు ఇవ్వలేకపోయింది. చనాక -కొరాట బ్యారేజ్ పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేయోచ్చో.. రెండేళ్లలో చేసి చూపించాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, సబ్సిడీ గ్యాస్, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు రూ.21 వేల కోట్లకు పైగా రుణమాఫీ, సన్నాలకు రూ. 500 బోనస్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. బలమైన ఆర్థిక రాష్ట్రంగా నిలదొక్కుకోవడానికి, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి తెలంగాణ రైజింగ్ ? 2047 విజన్ డాక్యుమెంట్ ను ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రపంచ స్థాయిలో రాష్ట్రం అగ్రగామిగా ఉండేందుకు లక్ష్యాలను నిర్దేశిరచనున్నాం. క్రీడలు, పర్యాటకం, వాణిజ్యం, పరిశ్రమలు, ప్రకృతి వ్యవసాయం ఇవన్నీ కూడా రాష్ట్ర పాలసీలో భాగంగా ముందుకెళ్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

# సర్పంచ్ పదవి కోసం కుటుంబ పోటీ

- ఒకే కుటంబం నుంచి బరిలో ముగ్గురు

**జగిత్యాల, డిసెంబరు4 (జనంసాక్షి) :** తెలంగాణలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చిత్ర, విచిత్ర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఓ గ్రామంలో సర్పంచ్ బరిలో తల్లి, కూతుర్లు పోటీ చేస్తుండగా మరో చోట అన్నా, చెల్లెలు పోటీ చేస్తుండడంతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు మరింత రసవత్తరంగా మారుతున్నాయి. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయపల్లిలో తల్లి, కూతురు పోటీ చేస్తుండగా గుమ్లాపూర్ లో సొంత అన్నా, చె÷-లలెలు సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచారు. అయితే, సర్పంచ్ ఎస్సీ జనరల్ కు ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బరిలో నిలబడ్డారు. తెడ్డు శివకుమార్ తో పాటు సొంత చెల్లెలు రౌట్ల స్రవంతి, స్రవంతి పెద్ద నాన్న కుమారుడు తెడ్డు రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఇక, సర్పంచ్ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పోటీ చేస్తుండగా సర్పంచ్ పదవి ఎవరిని వరించబోతుందని జిల్లా ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కాగా, రౌట్ల స్రవంతికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు పలుకుతుండగా ఆమె అన్న తెడ్డు శివకుమార్ స్వతంత్ర అభ్యర్థిగా, పెద్ద నాన్న కుమారుడు తెడ్డు రమేష్ కు కాంగ్రెస్ పార్టీ మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు.


# కారు టైరు పేలి వ్యక్తి మృతి

**మృతుడు హైదరాబాద్ వాసిగా గుర్తింపు**

**చీరాల, డిసెంబరు4 (జనంసాక్షి):** బంధువుల తరపు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాద సంఘటన బాపట్ల జిల్లా కారంచేడు, చీరాల నూతన జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మనోహర్ రాజు తన సోదరుడు నిరీక్షణ రాజు, మిత్రుడు జాన్ సన్ తో కలిసి చీరాల మండలం వాడరేవులో మృతి చెందిన బంధువును పరామర్శించేందుకు కారులో బయలుదేరారు. కారంచేడు సమీపానికి చేరుకోవడంతో వారి ప్రయాణిస్తున్న కారుకు రన్నింగ్‌లో టైరు పేలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి గాల్లో పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో సీట్‌బెల్ట్ పెట్టుకున్నప్పటికీ మనోహర్ రాజు (45) తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన సోదరుడు నిరీక్షణ రాజు, జాన్ సన్‌కి గాయాలయ్యాయి. విషయం గమనించిన స్థానికులు అంబులెన్స్‌కి, పోలీసులకి సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మఅతదేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యాశాలకు తరలించారు. ఈ మేరకు కారంచేడు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు హైదరాబాదులో టీవీ 9 విలేకరి అని తెలిసింది. కాగా గాయపడిన ఇద్దరిని చీరాల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరామర్శకు బయలుదేరిన కుటుంబంపై మృత్యువు మరోసారి విరచుకుపడడంతో బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# తెలంగాణ విద్యాపాలసీలో టీ-సాట్‌ను భాగస్వామిని చేయాలి

**కేశవరావు ను కోరిన టి-సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు నూతనంగా ఏర్పాటు చేయబోయే తెలంగాణ నూతన విద్యా పాలసీలో టి-సాట్ ను భాగస్వామిని చేయాలని విద్యాపాలసీ కమిటీ ఛైర్మన్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావును టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి కోరారు. హైదరాబాద్ లోని కేశవరావు నివాసంలో గురువారం కలిసిన సీఈవో వేణుగోపాల్ రెడ్డి టి-సాట్ రూపొందించిన పాలసీ డాక్యుమెంట్ అందచేశారు. ప్రాథమిక విద్య నుండి యూనివర్సిటీ స్థాయితో పాటు పోటీ పరీక్షల కంటెంట్ అందించి దేశంలోనే డిజిటల్ విద్యా ఛానళ్ల లో మొదటి స్థానంలో టి-సాట్ ఉందని సీఈవో గుర్తుచేశారు. ఐదు సంవత్సరాల విద్యార్థి నుండి 60 సంవత్సరాల వ్యక్తులకు అవసరమయ్యే విద్యకు సంబంధించిన కంటెంట్ వివిధ డిజిటల్ ప్రసార మాద్యమాల్లో టి-సాట్ శాటి లైట్, యాప్, ఓ.టి.టి, సోషల్ మీడియా ప్లాట్ ఫాంలో అందుబాటులో ఉందని వివరించారు. 4.8 మిలియన్ల పైగా యూజర్లతో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటూ దేశంలోనే మొదటి స్థానాన్ని రెండు సంవత్సరాల్లో టి-సాట్ అధిరోహించిందని, తెలంగాణ ప్రభుత్వం రూపొందించబోయే నూతన ఎడ్యుకేషన్ పాలసీ ద్వార సైతం తెలంగాణ సమాజానికి డిజిటల్ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఈవో వివరించారు. సీఈవో అందచేసిన డాక్యుమెంట్ ను పరిశీలించిన కేశవ రావు సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ స్థాయిల్లోని విద్యార్థులు, యువత, వయోజనులు, మహిళలతో పాటు ఇతర రంగాలకు అందిస్తున్న డిజిటల్ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. తెలంగాణ నూతన విద్యావిధానంలో టి-సాట్ సేవలు తప్పనిసరిగా వినియోగించుకునే విధంగా పాలసీని రూపొందిస్తామని హామీ ఇచ్చారు.

# ఉపాధ్యాయురాలిపై ఉపాధ్యాయుడి అనుచిత వ్యాఖ్యలు

- ఉపాధ్యాయుడి పై షీ టీంకు ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయురాలు...

**చెన్నారావుపేట, డిసెంబర్ 4 (జనం సాక్షి):** ఓ మహిళ ఉపాధ్యాయురాలి పై ఉపాధ్యాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడంతో మహిళా ఉపాధ్యాయురాలు షీ టీంకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మండలంలోని అమీనాబాద్ గ్రామంలో మాడల్ స్కూల్లో పనిచేస్తున్న ఓ మహిళా ఉపాధ్యాయురాలి పై పదే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తుంది. ఈ విషయంలో మహిళా ఉపాధ్యాయురాలు గురువారం ఉపాధ్యాయుడి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ షీ టీంకు గురువారం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.

# ఎంఎల్ఏ కడియం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



**స్టేషన్ ఘన్ పూర్, డిసెంబర్ 04 ( జనం సాక్షి ) :** మండలంలోని నమిలిగొండ గ్రామం నుండి ,బీఆర్ఎస్ పార్టీకి చెందిన గ్రామ శాఖ అధ్యక్షుడు కోల హరికృష్ణ, లద్దునూరి రాజు, గాదె ప్రభాకర్, గాదె అఖిల్, లద్దనూ రి సునీలు, జినుక ప్రదీప్, లదునూరు శివ, బిజేపి పార్టీకిచెందిన అరిశల తిరుపతి,పులి భాస్కర్, బిఎస్పీ పార్టీకి చెందిన గాదె ప్రేమకుమార్, కోటే రమేష్, రుద్ర య్య గురువారం మాజీ ఉపముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో వివిధపార్టీలకు చెందిన 25 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ లో చేరా రు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ వారికి కాంగ్రెస్ కండువా లు కప్పి పార్టీలోకిఆహ్వానించడం జరిగింది.వీరందరూ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన పురుమాని కొమల - ఐలోని ని అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని హామీ ఇవ్వ టం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశా ఖ అధ్యక్షుడు అశోక్ రెడ్డి , మాజీ ఎంపీటీసీ రజాక్ యాదవ్, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

# భార్యపై అనుమానంతో.. నిద్రిస్తున్న కుమార్తె గొంతు కోసిన వ్యక్తి

**ముంబై (జనంసాక్షి) :** భార్యకు వివాహేతర సంబంధం ఉన్నదని ఒక వ్యక్తి అనుమానించాడు. అయితే నిద్రిస్తున్న కుమార్తె గొంతును బ్లేడ్‌తో కోశాడు. కూతుర్ని కాపాడేందుకు ప్రయత్నించిన భార్యపై కూడా బ్లేడ్‌తో దాడి చేశాడు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. హనుమంత్ సోనావాలే ఏ పని చేయకపోగా మద్యానికి బానిస అయ్యాడు. భార్య రాజశ్రీకి వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానించి తరచుగా ఆమెను కొట్టేవాడు.కాగా, భర్త హింసను భరించలేని భార్య రాజశ్రీ ఒక లాయర్ ద్వారా విడాకుల కోసం కోర్టులో పిటిషన్ వేసింది. ఇది తెలిసి హనుమంత్ సోనావాలే మరింత రెచ్చిపోయాడు. భార్యతో గొడవపడ్డాడు. గురువారం తెల్లవారుజామున నిద్రిస్తున్న 14 ఏళ్ల కుమార్తె గొంతును బ్లేడ్‌తో కోశాడు. మరోవైపు కూతురి అరుపులకు రాజశ్రీ మేల్కొన్నది. భర్తను అడ్డుకునేందుకు ఆమె ప్రయత్నించింది.

# అఖండ విడుదలపై ఆంక్షలు

**మద్రాస్ హైకోర్టు ఆదేశాలు**

**చెన్నై, డిసెంబర్4 (జనంసాక్షి) :** నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ' సినిమా సీక్వెల్ అయిన 'అఖండ 2' విడుదలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ సినిమా విడుదలపై తాత్కాలిక నిషేధం విధిస్తూ డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ 'అఖండ 2' సినిమా థియేట్రికల్, డిజిటల్ విడుదలలన్నింటినీ నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ సుబ్రమన్యం, జస్టిస్ అ. కుమారప్పన్ లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ ఆంక్షలను విధించింది. ఈ కేసులో పిటిషనర్‌గా ఉన్న ఎరోస్ ఇంటర్నేషనల్ మీడియా లిమిటెడ్ పక్షాన కోర్టు ఈ తీర్పును ఇచ్చింది. ఎరోస్ సంస్థ ప్రధానంగా 14 రీల్స్ ప్లస్ ఎల్ఎల్‌పిపై తీవ్ర ఆరోపణలు చేసింది. సినిమా నిర్మాతలు తమకు చెల్లించాల్సిన రూ.28 కోట్లు చెల్లించకుండానే సినిమాను విడుదల చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఎరోస్ ఆరోపించింది. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ కు అనుబంధ సంస్థ అయిన 14 రీల్స్ ప్లస్ ఎల్ఎల్‌పి సినిమా విడుదల ఎ÷-లాన్ చేసిందని ఎరోస్ వాదించింది. ఎరోస్ ఇంటర్నేషనల్ తరపున సీనియర్ కౌన్సిల్‌లు తమ వాదనలు వినిపించారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం, కోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు 'అఖండ 2' సినిమాను ఏ రూపంలోనూ విడుదల చేయడం అసాధ్యం అని అంటున్నారు.

# భారత్‌లో ప్రాథమిక విద్య

గత 11 ఏళ్లలో (సుమారు 2014 నుంచి) బీజేపీ ప్రభుత్వ పాలనలో భారతదేశ ప్రాథమిక విద్య రంగం అనేక మార్పులు, సవాళ్లు చూసింది. ఇక్కడ పరిస్థితిని వివిధ కోణాల్లో చూద్దాం.



**పాఠశాలలు, ఉపాధ్యాయుల సంఖ్య: పోలికలు:**
అనేక నివేదికలుప్రకారం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల సంఖ్య కొంత తగ్గినట్లు కనిపిస్తోంది. 2015-16 నాటి (యూ- డీఐఎస్‌ఈ) డేటా ప్రకారం దేశంలో 15 లక్షాల ప్రాథమిక పాఠశాలలు ఉండగా, 2021-22 నాటి నివేదికలు దాదాపు 14.9 లక్షాలని చూపిస్తున్నాయి. ఇది చిన్న తగ్గుదల. కారణాలు పాఠశాలల విలీనం, బదుల ఏకీకరణ ఉండొచ్చు. ఉపాధ్యాయుల సంఖ్యలో పెరుగుదల ఉంది. కానీ ఇది రాష్ట్రం నుంచి రాష్ట్రానికి తేడా ఉంటుంది. 2021-22 సంవత్సరంలో దేశంలో దాదాపు 97 లక్షాల మంది పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు. వారిలో చాలా మంది ప్రభుత్వ పాఠశాలలో ఉన్నారు. కానీ ఉపాధ్యాయులు ఖాళీలు, నియమాలు చేయకపోవడం ఇప్పటికీ పెద్ద సమస్యగా ఉంది.

**డ్రాప్-అవుట్లు, అడ్మిషన్లు-మిశ్రమ ఫలితాలు:**
ప్రాథమిక విద్య హక్కుచట్టం (ఆర్.టీ.ఈ.) అమలు తర్వాత, ప్రాథమిక స్థాయిలో చేరే విద్యార్థుల సంఖ్య పెరిగింది. చిన్న వయసులో పాఠశాలలో చేరని పిల్లల శాతం తగ్గింది. కానీ డ్రాప్-అవుట్ (విద్యను మధ్యలో వదిలివేయడం) సమస్య తీవ్రంగా ఉంది. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్.ఈ.పీ.) 2020 లో, 2025 నాటికి సెకండరీ స్థాయి వరకు 100 శాతం నమోదు సాధించాలని లక్ష్యం పెట్టింది. కానీ ప్రాక్టికల్ గా దీనికి ఇంకా చాలా దూరంలో ఉంది.

**బడ్జెట్ కేటాయింపులు - ఆశలు, నిరాశలు:**
గత 11 ఏళ్లలోవిద్యకు కేంద్ర బడ్జెట్ కేటాయింపులు పేరుతో పెరిగాయి. కానీ జిడిపి శాతంగా చూస్తే ఇది తగ్గింది. విద్యకు జిడిపిలో 6 శాతం కేటాయించాలన్న నిపుణుల, వివిధ కమిషన్ల సిఫారసును ప్రభుత్వం చేరుకోలేదు. 2023-24 బడ్జెట్ లో విద్యకు కేటాయింపు జిడిపిలో 2.9 శాతం మాత్రమే. ఇది కూడా తగ్గింది. కేంద్ర సరఫరా చేసే నిధులు రాష్ట్రాలు సక్రమంగా ఖర్చు చేయడం కూడా సమస్యగా ఉంది.

**ప్రభుత్వ పాఠశాలల స్థితి- మౌలిక సదుపాయాలు, నాణ్యత :**
(ఆర్.టీ.ఈ.)చట్టం వలన, మౌలిక సదుపాయాలు (శౌచాలయాలు, తాగునీరు, కంప్యూటర్లు) మొదలైన వాటిలో మెరుగు కనిపిస్తోంది. కానీ నాణ్యమైన విద్య అందించడం ఇప్పటికీ పెద్ద సవాలుగా ఉంది. నేషనల్ అచీవ్మెంట్ సర్వే (ఎన్.ఏ.ఎస్.) ఫలితాలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గణితం,మాతృ భాషలో ప్రాథమిక సామర్థ్యాలను కూడా సాధించలేకపోతున్నట్లు చూపిస్తున్నాయి.(కోవిడ్-19) పాండమిక్ వలన ఈ అంతరం మరింత పెరిగింది.

**ప్రైవేట్ రంగం, ఇంగ్లీష్ మీడియం ప్రభావం**
ప్రైవేట్పాఠశాలలు, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల ఆకర్షణ పెరిగింది. మధ్యతరగతి, ఉన్నత తరగతి కుటుంబాలు ప్రభుత్వ పాఠశాలల నుంచి దూరం అయ్యారు. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో “శిథిలావస్థ”కి దోహదం చేస్తుంది. రెసిడెన్షియల్ స్కూల్లు (గురుకులాలు) వంటి ప్రత్యేక పాఠశాలలు కూడా పెరుగుతున్నాయి. ఇది విద్యలో వర్గ విభజనను పెంచుతుంది.

**ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బాలికల విద్య:పురోగతి, అడ్డంకులు:**
బాలికల విద్యలో, ఎస్సీ, ఎస్టీల విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రత్యేకంగా బాలికల విద్యకు ప్రోత్సాహం ఇవ్వడం వలన, ప్రాథమిక స్థాయిలో లింగ వివక్షత తగ్గింది. కానీ ఉన్నత తరగతులకు వెళ్ళే కొద్దీ బాలికలు, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీల విద్యార్థుల డ్రాప్-అవుట్ రేటు ఎక్కువగా ఉంటుంది. రాజ్యసభ ఎడ్యుకేషన్ కమిటీ నివేదికలు ఈ వర్గాల విద్యార్థులకు సరైన వసతులు, ఉపాధ్యాయులు లేకపోవడాన్ని సూచిస్తాయి.

ప్రముఖ నివేదికలు, కమిషన్ల సిఫారసులు:

1. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్.ఈ.పీ.) 2020: ప్రాథమిక విద్యలో మౌలిక సామర్థ్యాలు (ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ) పెంపుదలపై దృష్టి పెట్టాలని సూచించింది. 5వ తరగతి వరకు మాతృభాషలో బోధనకు ప్రాధాన్యత ను ఇచ్చింది.
2. సామాజిక-ఆర్థిక, జాతి గణాంక లెక్కల (ఎస్.ఈ.సీ.సీ.) 2015 డేటా ఆధారంగా: ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు చాలా మంది సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల నుంచి వస్తున్నారని తెలిపింది.
3. రాజ్యసభ ఎడ్యుకేషన్ కమిటీ నివేదికలు (వివిధ సంవత్సరాలు): ఉపాధ్యాయుల ఖాళీలు, శిక్షణ లోపాలు, (ఆర్.టీ.ఈ.) నిబంధనల అమలు లోపాలను గుర్తించాయి. ప్రైవేట్ పాఠశాలలపై నియంత్రణ లేకపోవడం గురించి కూడా విమర్శించాయి.
4 (ఏన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్) రిపోర్టు (ఏ.ఎస్.ఈ.ఆర్.): ప్రాథమిక స్థాయిలో పిల్లల అభ్యసన సామర్థ్యంలో తీవ్ర లోపాలను స్థిరంగా ఎత్తి చూపుతాయి. నాణ్యత విషయంలో పెద్ద ఖాళీ ఉందని ఇది నిరూపిస్తుంది.

ప్రాథమిక విద్య హక్కు నుంచి నాణ్యత వరకు - దారి దూరం: గత 11 ఏళ్లలోప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా మార్చడం ఒక సైద్ధాంతిక విజయం. సంఖ్యాపరంగా (మౌలిక సదుపాయాలు, నమోదు) మెరుగుదల కనిపించినా, నాణ్యత విషయంలో పరిస్థితి ఇంకా బాగా లేదు. ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడిన వర్గాలకు మాత్రమే మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఇది సమాజంలో విభజనను పెంచుతుంది. విద్య బడ్జెట్ పెంపు, ఉపాధ్యాయుల నియామకం, వారి శిక్షణ, అభ్యసన ఫలితాలపై దృష్టి ....ఇవి ప్రధాన ప్రాధాన్యతలు కావాలి. ప్రాథమిక విద్య నాణ్యత లేకుండా, “నలుగురికీ విద్య” అనే హక్కు కేవలం కాగితంపై హక్కుగా మిగిలిపోతుంది. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 లో ఉన్న చక్కటి ఆలోచనలు నిజం కావాలంటే, వాటికి గట్టి ఆర్థిక, నిర్వహణాత్మక నిబద్ధత అవసరం.



**దండెబోయిన అశోక్ యాదవ్,**
గెజిటెడ్ హెడ్మాస్టర్, పెద్దమదూర్,
జనగాం. 9440521990.

# భారతదేశ నయా ఫాసిస్టు పాలకులు

ఈనాడు గతంలో ఎన్నడూ లేనంతగా ఫాసిజం పైన చర్చ సాగుతున్నది. అదేవిధంగా భారత రాజ్యాంగం భారత పౌరులకు ఇచ్చిన హక్కులపై చర్చ సాగుతున్నది. దానికి కారణం గత 11 సంవత్సరాల కు పైగా భారతదేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వం అనుసరిస్తున్న హిందుత్వ మత తత్వ, కార్పో రేటు కాషాయ విధానాలు కారణం.
డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ చైర్మన్ గా 1949 నవంబరు 26వ తేదీన భారత రాజ్యాంగ సభ ఆమోదించిన రాజ్యాం గాన్ని వ్యతిరేకించిన ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగమైన భారతీయ జనతా పార్టీ గత 11 సంవత్సరాలుగా నిరాడంఖంగా మూడోసారి అధికారంలోకి రావడం జరిగింది. రాజ్యాంగం ఆమోదించిన మరుసటి రోజే అంబేద్కర్ చే రూపొందించబడిన భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్నామని, త్రివర్ణ జాతీయపతాకాన్ని వ్యతిరేకిస్తున్నామని, కాషాయ జెండా జాతీయ జెండాగా ఉండాలని ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక ఆర్గనైజర్ లో అంతేకాకుండా భారత రాజ్యాంగంగా “మనుస్మృతి” ఉండాలని ఉంది అని రాసింది. స్వతంత్ర పోరాటంలో ఎటువంటి పాత్రలేని ఆర్ఎస్ఎస్ బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఏమీ అనలేదు. దాని నాయకుడు వీడి సర్కార్ ప్రభుత్వానికి అనేక లొంగుబాటు ఉత్తరాలు రాశాడు.లౌకిక విలువల కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీని హత్య చేసింది. త్రివర్ణజెండాను వాజ్ పాయ్ ప్రధానమంత్రిగా అయినంతవరకు ఎగురవేయలేదు. ప్రజల మత విశ్వాసాలను నిరంతరము రెచ్చగొట్టి అయోధ్యలో రామ జన్మభూమి రథయాత్రతో అమాంతం సీట్లు పెంచుకున్న బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే హిందుత్వం వైపు ప్రయాణం కట్టింది.
భారత రాజ్యాంగ పరిషత్ 1949 నవంబరు 26న ఆమోదించిన సందర్భంగా “భారత రాజ్యాంగం” భారత ప్రజలు తమకు తాము సమర్పించుకున్నారని ప్రవేశికలో రాసుకోవడం జరిగింది. భారత రాజ్యాంగం సార్వభౌమ, సామ్యవాద ,లౌకిక ,ప్రజాతంత్ర, గణతంత్ర రాజ్యమని పొందుపరచుకోవటం జరిగింది. లౌకిక , సామ్యవాద అనే పదాలు 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో చేర్చడం జరిగింది. పౌరులందరికీ సాంఘిక ,ఆర్థిక రాజకీయ న్యాయం, ఆలోచన, వ్యక్తీకరణ, నమ్మకం, విశ్వాసం పట్ల స్వేచ్ఛ, పౌరులందరికీ హోదా, అవకాశాలు అన్నిటిని కూడా అందరకు సమానంగా ఇవ్వబడతాయి. ప్రతి వ్యక్తికి హుందాతనానికి , జాతి ఐక్యతకు సౌభ్రాతృత్వానికి , రాజ్యాంగం హామీ ఇస్తున్నది.
భారత రాజ్యాంగం పౌరులందరికీ ప్రాథమిక హక్కులు ఇచ్చింది. భారత దేశ పాలన ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా ఉండాలని రాజ్యాంగంలో స్పష్టపరుచుకున్నాం.
కొన్ని ప్రాథమిక హక్కులు, జీవించే హక్కు, స్వేచ్ఛ, భావ స్వాతంత్రం, నమ్మకాలపట్ల విశ్వాసం, వాటికి సంబంధించి ఏపరిస్థితుల్లో ఉల్లంఘించ రాదని భారత అత్యున్నత న్యాయస్థానం ఏకే గోపాలన్ కేసులో (1950,27) స్పష్టపరిచింది. భారత రాజ్యాంగంలో ఆర్థికల్స్ 14 నుండి 18 వరకు పౌరుల సమానత్వ హక్కును వివరించాయి. అదేవిధంగా 19 నుండి 22 వరకు పౌరుల స్వేచ్ఛ గురించి సవివరంగా వివరించాయి. ఆర్టికల్ 14 రాజ్యాంగం ముందు అందరూ సమానమే అని , అందరికీ చట్టప్రకారంగా అందరకూ సమాన హక్కులు ఇవ్వబడతాయని , వ్యక్తి స్వేచ్ఛకు ,వ్యక్తి స్వాతంత్రానికి, వ్యక్తి రక్షణకు ఆర్టికల్ 21 రక్షణ నిచ్చింది. ఆర్టికల్ 22 ప్రకారం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహా ఏవ్యక్తిని అక్రమ నిర్బంధము, అరెస్టు చేయరాదని స్పష్టం చేసింది. వారి ఇష్టమైన టువంటి మత స్వేచ్ఛను, స్వాతంత్రాన్ని ఆర్టికల్స్ 25 నుండి 28 వరకు స్పష్టంగా రాజ్యాంగంలో పొందుపరిచారు. మాట్లాడే భావ వ్యక్తీకరణ హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, సభలను నిర్వహించుకునే హక్కు, ఉద్యమించే హక్కు, నివసించే హక్కు, ఇష్టమైన చట్టబద్ధమైన వృత్తి చేసుకునే హక్కు రాజ్యాంగంలోని ఆర్థికలు 19 స్పష్టపరిచింది. 19 78లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా లౌకిక , సామ్యవాద పదాలను రాజ్యాంగ ప్రవేశికలో చేర్చారు. అదేవిధంగా ప్రాథమిక హక్కుల నుండి ఆస్తి హక్కును ఆర్టికల్ 19 క్లాస్ 1 ,ఉప క్లాసు( యఫ్) నుండి తొలగించారు. ఆర్టికల్ 31 లో చెప్పినటువంటి ఆస్తి హక్కును పూర్తిగా తొలగించి కేవలం చట్టబద్ధమైన హక్కుగానే ఉంచారు.
మన రాజ్యాంగంలో ఇన్ని మంచి విషయాలు ఉండగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్లు రాజ్యాంగం అమలు చేసేవారు చెడ్డవారైతే రాజ్యాంగం చెడ్డగానే ఉంటుందని మనకు గత 11 సంవత్సరాల నుండి నరేంద్ర మోడీ పాలన వలన తెలుస్తున్నది.
అధికారంలోకి 2014లో రావటానికి నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ చేయని వాగ్ధానమంటూ లేదు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానన్నాడు. విదేశాల్లో ఉన్న నల్ల డబ్బును తీసుకొచ్చి ఒక్కొక్కరి బ్యాంకు ఎకౌంట్లో పది లక్షలు జమచేస్తానన్నాడు. అన్ని రకాల పంటలకు మద్దతు ధర ఇస్తానన్నాడు. తెలంగాణ నుండి విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పది సంవత్సరాల పాటు ప్రత్యేక హోదా ఇస్తానన్నాడు. ఒకటి ఏమిటి ఏ రాష్ట్రానికి వెళితే ఆ రాష్ట్రానికి సంబంధించిన సకల సమస్యలను పరిష్కరిస్తానని చేయని వాగ్దానం అంటూ లేదు.
కేంద్రంలోకి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండు దఫాలుగా అంచలంచలుగా రాజ్యాంగ స్వతంత్ర వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ వచ్చాడు. రాజకీయ ప్రత్యర్థులపై ఈడి ,ఇన్కమ్ టాక్స్, మొదలకు డిపార్ట్మెంట్లను ప్రయోగించి ప్రత్యర్థులను లొంగదీసుకుంటున్నారు. జీఎస్టీ( వస్తువుల సేవల పన్ను) పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజార్చాడు. కోటి ఉద్యోగాల మాటే లేదు. నల్ల డబ్బును వెలికి తీస్తానని నోట్ల డిమానిటైజేషన్ పేరుతో ధనికుల నల్ల డబ్బును తెల్ల డబ్బుగా మార్చుకోవటానికి అవకాశం ఇచ్చాడు.రెండవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత మరింతగా రెచ్చిపోయి పౌరసత్వ సవరణ చట్టం ( సి ఏ ఏ), జాతీయ ప్రజా పట్టిక(యన్ పి ఆర్), జాతీయ పౌర పట్టిక( ఎన్ సి ఆర్), జమ్మూ మరియు కాశ్మీరు స్వయం ప్రతిపత్తిని కల్పించే 370, 35ఎ ఆర్టికల్స్ ను సవరించటం, కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని అప్పజెప్పే మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకురావడం, వందల సంవత్సరాలుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులకు తీసుకొచ్చి అమలుకు పూనుకోవడం,స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(సర్), ఓట్ల చోరీ , ప్రశ్నించే వారిపై ఉపా (యుఏపిఏ)లాంటి నల్ల చట్టాలను ప్రయోగించడం, జాతీయ బ్యాంకులను ప్రైవేటు చేయడం, ఎల్ఐసిని ఆశ్రిత కార్పోరేట్ ఆదానికి అప్పజెప్పటం, రైల్వేలు, పెట్రోలు, ఇంధన వనరులు, విమానాలు, విమానాశ్రయాలు, విశాఖ ఉక్కులాంటి పరిశ్రమలు, ఒకటి ఏమిటి అన్ని రంగాలను అంబానీ, ఆదాని లాంటి ఆశ్రిత కార్పొరేట్ -పెట్టుబడిదారులకు భారత ఆర్థిక వ్యవస్థను అప్పు చెబుతున్నారు. భారత రాజ్యాంగంలో “ప్రవేశిక”లో చెప్పిన లౌకిక రాజ్యాంగ వ్యవస్థ అనే విషయాన్ని త్రోసిరాజి సాక్షాత్తు ప్రధానమంత్రి అయోధ్యలో రామాలయం నిర్మాణం ప్రారంభోత్సవములు అంతా తానే నిర్వహించాడు. 1937లో వినాయక దామోదర్ సావర్కార్‌కు హిందూ మహాసభ బాధ్యతలు అప్పజెప్పాడు. నాగపూర్ లో డైలీ మహారాష్ట్ర అనే మరాఠీ వార్తాపత్రికను కూడా నడిపాడు. ముస్లింలు మెజార్టీ ఉన్న ప్రాంతాల్ని ప్రోవిన్సులుగా ఏర్పాటు చేయడానికి వ్యతిరేకించాడు.డాక్టర్ బి.ఎస్.మూంజె 1930,1931 సంవత్సరాల్లో లండన్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాల్లో గాంధీ మహాత్ముడు ప్రబోధించిన లేదా వాదించిన లౌకికతత్వం మరియు అహింసా సిద్ధాంతాలను గట్టిగా వ్యతిరేకించాడు. 1931 లో ఇటలీ ఫాసిస్టు నియంత ముస్సోలిని ఏర్పాటుచేసిన అకాడిమియా ఫర్నెసి, ఇతర సైనిక స్కూళ్లను సందర్శించి వాటిని అధ్యయనం చేసి వచ్చాడు. ఇటలీ నుండి ఇండియాకు వచ్చి ప్రభుత్వాన్ని బలపరిచే పారా మిలిటరీ స్కూల్లను భోన్సాలోనూ, నాశిక్ లోను 1937 లో స్థాపించాడు.ఆర్ఎస్ఎస్ లక్ష్యం భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చాలని. అందుకు తన రాజకీయ సాధనమైన భారతీయ జనతా పార్టీ ద్వారా ఎన్నికల వ్యవస్థను ఉపయోగించుకొని ఫాసిస్టు తరహా పరిపాలన సాగిస్తున్నది. దీనినే మనం నయా ఫాసిజం అంటున్నాం.ఈ దేశంలో ఉన్న హిందువేతర మతాలు ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు వారి ప్రధాన రాజకీయ శత్రువులు. జైన ,బౌద్ధ , సిక్కు మతాలను వారు హిందూమతంలో అంతర్భాగంగా భావిస్తారు.భారతదేశం భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న జాతులు, భిన్న సంస్కృతులు, భిన్న భాషలు కలిగిన దేశం. ఈ దేశంలో మనం ఫాసిజం నుండి భారత రాజ్యాంగాన్ని, శ్రామిక వర్గాన్ని , రక్షించుకోవాల్సిన కర్తవ్యం, అవసరం మన భుజస్కందాల మీద ఉన్నది.

**మన్నవ హరిప్రసాద్,**
అడ్వొకేట్ (మార్క్సిస్టు లెనినిస్టు విశ్లేషకుడు)
82477 28296.

# ప్రజా సమస్యలు మాట్లాడని చట్టసభలెందుకు!



ప్రజాప్రయోజనాలు పట్టవా అన్న ప్రశ్న నేటి భారత పార్లమెంటు తీరు చూస్తే మరింత కఠినంగా మన ముందుకొస్తోంది. ప్రగతిపథంలో స్థిరంగా ముందుకు సాగాలన్న జాతీయ సంకల్పానికి పార్లమెంటు ప్రతీక. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునేప్పుడు కేవలం పార్టీ గెలుపు కోసం ఓటు వేయడం కాదు, తమ జీవన సమస్యలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు చూపుతారని, తమ తరఫున దేశ నడిపే బాధ్యతాయుత స్వరం అవుతారని నమ్మకం ఉంచుతారు. ఆ నమ్మకమే ప్రజాస్వామ్యానికి ప్రాణం.
స్వాతంత్ర్యానంతరం తొలి లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలు 1952 మే 13న ప్రారంభమయ్యాయి. ఆ కాలంలో చర్చల స్థాయి, సభల గౌరవం, నియమ నిబంధనలపట్ల నిబద్ధత గురించి నేటి పత్రికా పత్రాలలోనూ, 70 ఏళ్ల పార్లమెంటు గమనాన్ని విశ్లేషించిన నివేదికలలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ప్రారంభ దశల్లో ఎక్కువ రోజులు సమావేశాలు జరగటం, సభ్యులు విస్తృతంగా పాల్గొనటం, చట్టప్రతులపై గంటల తరబడి నిర్మాణాత్మక చర్చల సాగు వంటి లక్షణాలు భారత పార్లమెంటు ప్రత్యేకతగా నిలిచాయి.
అయితే కాలక్రమేణా రాజకీయ పోరు తీవ్రత పెరిగినకొద్దీ, ప్రజా ప్రయోజనాల దిశలో సాగాల్సిన చర్చల స్థానంలో నినాదాలు, స్లోగన్లు, వాయిదాలు, వాక్‌అవుట్లు స్థలాన్ని ఆక్రమించసాగాయి. ముఖ్యంగా తొలిదశల తర్వాతి దశ అయిన 1990ల నాటికి వచ్చిన కూటమి ప్రభుత్వాల కాలంలో సభల అజెండాపై కాదు, ఎవరు ఎవరిని ఇబ్బంది పెట్టాలి అన్న లెక్కలపై దృష్టి మళ్లిందనే విమర్శలు పెరిగాయి. తరువాతి సంవత్సరాల్లో పార్లమెంటు లోగ్‌జామ్ స్థాయి పెరుగుతూ వచ్చింది అన్న విశ్లేషణలు అనేక అధ్యయనాల్లో కనిపిస్తాయి.
15వ లోక్‌సభ (2009-2014) కాలం మరీ ప్రత్యేకంగా ఉదాహరణగా నిలిచింది. 2013 డిసెంబరు సమావేశంలో పరిశీలిస్తే మొత్తం 31 బిల్లులు ఆమోదానికి జాబితాలో ఉన్నప్పటికీ లోక్‌పాల్ బిల్లే ఒక్కటే ఆమోదించబడింది, మిగతా చట్టసభా కార్యక్రమం పెద్దగా ముందుకు సాగలేదు. ఆ కాలాన్ని భారత పార్లమెంటు చరిత్రలో అత్యల్ప పనితీరున్న దశగా పేర్కొన్న విశ్లేషణలు ఉన్నాయి.
మనకు దగ్గర కాలంలోనూ పరిస్థితి అంతగా మారలేదనే దృశ్యం కనిపిస్తోంది. 17వ లోక్‌సభ (2019%-%2024) గురించి విడుదలైన డేటాలో ఈ లోక్‌సభ పూర్తిస్థాయి పదవీకాలం పూర్తి చేసిన అన్ని లోక్‌సభలలోకెల్లా అత్యల్ప సమావేశాల రోజులు నిర్వహించిన సభగా గుర్తింపు పొందింది. మొత్తం సమయపరంగా చూస్తే లోక్‌సభ సుమారు 88 శాతం, రాజ్యసభ 73 శాతం సమయం పనిచేసినా, సంవత్సరానికి జరిగే సిట్టింగుల సంఖ్య తగ్గిపోవడం, అనేక బిల్లులు స్థిరసంఘాలకు పంపకుండా వేగంగా ఆమోదం పొందడం వంటి ధోరణులు పార్లమెంటు పరిశీలన పాత్ర బలహీనపడుతున్న సంకేతాలుగా చెప్పబడుతున్నాయి.
2024 శీతాకాల సమావేశాల్లో పరిస్థితి ఎంత సీరియస్‌గా ఉందో సంఖ్యలే చెబుతున్నాయి. ఆ సెషన్‌లో లోక్‌సభ మొత్తం షెడ్యూల్ చేసిన సమయం లో సుమారు 52 శాతం నే పనిచేసింది. రాజ్యసభ పరిస్థితి దీనికంటే దారుణంగా, 39 శాతం స్థాయికి పడిపోయింది. మొదటి వారం మొత్తాన్ని తీసుకుంటే రెండు సభలు కలిపి కూడా పదశాతం కంటే తక్కువ సమయం మాత్రమే నిజమైన వ్యాపారంపై పనిచేశాయి.
ఇదే ధోరణి ఈ మధ్య కాలంలోని మాన్సూన్ సెషన్‌లోనూ కనిపించింది. 2025 మాన్సూన్ సెషన్లో లోక్‌సభ 29 శాతం, రాజ్యసభ 34 శాతం సమయానికే పనిచేసిందని, ప్రశ్నోత్తరాల సమయం విషయానికి వస్తే లోక్‌సభలో 23 శాతం, రాజ్యసభలో 6 శాతం కంటే ఎక్కువ ముందుకుసాగలేదని విశ్లేషణలు చెబుతున్నాయి. ఇది 18వ లోక్‌సభ ప్రారంభమైనప్పటి నుండి ఉన్న సెషన్లలోకెల్లా అత్యల్ప పనితీరుగా నమోదైంది.
పార్లమెంటులో ఒక్క నిమిషం సమయం కూడా ఎంతో విలువైనదే. సెషన్ల నిర్వహణ కోసం నిమిషానికి సుమారు రెండు లక్షల యాభై వేల రూపాయల ఖర్చు వస్తుందని అంచనా. 2024 శీతాకాల సమావేశాల్లో లోక్‌సభలో జరిగిన నిరంతర అంతరాయాల కారణంగా సుమారు ఎనభైకి పైగా గంటలు వృథా కావడంతో 90 కోట్ల రూపాయలకు పైగా ప్రజా ధనం నీటిలో కలిసిపోయిందని కొంతమంది అధ్యయనాలు చూపిస్తున్నాయి. ప్రజాధనం ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన వేదికపై ప్రజాస్వామ్య సంభాషణ జరగకపోతే అది ప్రజాప్రయోజనాలపై ప్రత్యక్ష ద్రోహమే.
ఇప్పుడు ప్రశ్న వస్తుంది - ఈ సమస్తం మధ్యలో ప్రజాప్రయోజనాల స్వరం పూర్తిగా కనిపించడంలేదా. అంతకన్నా పెద్ద తప్పుడు నిర్ధారణ మరొకటి ఉండదు. దేశంలోని అనేక ప్రాంతాల నుంచి ఎన్నుకోబడ్డ ఎంపీలు తమ నియోజకవర్గ సమస్యలపై ప్రశ్నలు అడుగుతున్నారు, చర్చలలో పాల్గొంటున్నారు. ఉదాహరణగా తెలంగాణకు చెందిన ఎంపీల పనితీరు గురించి ఒక తాజా నివేదికలో 2024 జూన్ నుండి 2025 ఏప్రిల్ వరకు ఆ రాష్ట్ర ఎంపీలు కలిపి 678 ప్రశ్నలు అడిగారని, అనేక జాతీయ అంశాలపై 119 చర్చల్లో పాల్గొన్నారని చెప్పబడింది. అంటే సీరియస్‌గా పని చేసే శ్రమజీవి ప్రజాప్రతినిధులు ఉన్నారు. అయితే వారి స్వరం మీడియా దృష్టిని ఆకర్షించే గందరగోళ దృశ్యాల నేపథ్యంలో మందగించిపోతుంది, సభా సమయం పట్టణశబ్దంలా వృథా కావడం వల్ల ఆ కృషి ఫలాన్నివ్వడంలో కొంత పరిమితి ఏర్పడుతోంది.
ప్రజాప్రయోజనాల నుంచి చర్చల దృష్టి ఎందుకు తూలిపోతుందన్న ప్రశ్నకు సమాధానం కోసం చూస్తే కొన్ని ప్రధాన కారణాలు కనబడుతున్నాయి. తీవ్రమైన దళ రాజకీయ ధృవీకరణ, ప్రతి అంశాన్ని ఎన్నికల లాభనష్టాలతో కొలిచే అలవాటు, సభలో కాకుండా కెమెరా ముందు కఠినతచూపే పోటీ, పార్లమెంటు స్థిరసంఘాల పాత్ర తగ్గిపోవడం, కార్యనిర్వాహక విభాగం చేతిలో అధికాధికారం కేంద్రీకరణ వంటి అంశాలు ఇటీవల కాలంలో ఎక్కువగా ప్రస్తావించబడుతున్నాయి.
ఈ నేపథ్యంలో “ప్రజాప్రయోజనాలు పట్టవా” అన్న మీ ప్రశ్న నిజానికి ప్రజాస్వామ్యం ముందు నిలిచిన ఒక నైతిక అద్దం. పార్లమెంటు కొత్త భవనాలు నిర్మించుకోవచ్చు, సాంకేతిక సౌకర్యాలు పెంచుకోవచ్చు, వ్యవస్థలను డిజిటల్ చేయవచ్చు, కాని ఆ కట్టడాల గోడల మధ్య జరిగేదీ ప్రజాప్రయోజనాల చర్చే కాకపోతే ఆ బరువైన మౌలిక సదుపాయాలకు అర్థం తగ్గిపోతుంది.
కాబట్టి కనీసం ఇప్పటికైనా అన్ని రాజకీయ శక్తులు కొన్ని ప్రాథమిక అంగీకారాలపై నిలబడాలి. ప్రశ్నోత్తరాల సమయాన్ని పవిత్రంగా భావించి అంతరాయాలు లేకుండా సాగించాలనే సామూహిక ఒప్పందం అవసరం. ప్రతి బిల్లును స్థిరసంఘాలకు పంపి సమగ్ర పరిశీలన జరిపించాలనే నిబద్ధత కావాలి. నిరసనల కోసం సభ లోపల కూర్చోబెట్టిన సమయాన్నే వృథా చేయకుండా సభ వెలుపల ఉన్న వేదికలను ఉపయోగించుకోవాలనే రాజకీయ సంస్కారం పెరగాలి.
అన్ని పార్టీలకు ఒక సామూహిక గుర్తు - పార్లమెంటు ఇటుకలు సిమెంటుతో కాదు, ప్రజల విశ్వాసంతో నిలబడి ఉంది. ఆ విశ్వాసాన్ని కాపాడే దిశగా సభా ప్రవర్తన సాగితేనే భారత ప్రజాస్వామ్యం స్థిరంగా నిలుస్తుంది. ప్రజల నిత్యజీవితానికి సంబంధించిన సమస్యలే పార్లమెంటు అజెండాలో కేంద్రీభవిస్తేనే “ప్రజాప్రయోజనాలు పట్టవా” అన్న ప్రశ్నకు భవిష్యత్ తరాలు గర్వంగా “పట్టాయి” అనే సమాధానం చెప్పగలవు.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

### పోటీ పరీక్షలకు దిక్సూచి.. బోధనకు మార్గదర్శి

# డా. ఇడికోజు శ్రీనివాసాచారి

కోట్లాది మనుషుల భావప్రపంచానికి తెలుగు భాష శ్వాస లాంటిది. ఆ భాషను బోధించడం అనేది కేవలం ఉద్యోగం కోసమే కాదు ఆత్మీయత, అంకితభావం, బాధ్యత అనే మూడు మూలాలను కలిపి నడుపాల్సిన గురుతరమైన మహాయజ్ఞం. నిరంతర అంకితభావంతో ఈ యజ్ఞంలో నిమగ్నమై వేలాది మందికి జ్ఞానజ్యోతి వెలిగిస్తూ, తెలుగుతో మునుముందుకు సాగుతూ ఉద్యోగ యుద్ధానికి సన్నద్ధమవుతున్న పోటీ పరీక్షార్థులైన యువతలో కొత్త ఆశలు నింపుతూ, ఉపన్యాసకులకు విద్యా మార్గదర్శకుడిగా, విద్యార్థులకు ప్రత్యక్ష ప్రేరణగా డాక్టర్ ఇడికోజు శ్రీనివాసాచారి నిలుస్తున్నారు. తెలుగు భాషా సాహిత్యంలో విశిష్టతను సృష్టిస్తూ, బోధన రంగంలో వినూత్న మార్గాలను అందిస్తూ, నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపే వ్యక్తిగా ఆయన నిలదొక్కుకున్న తీరు నేటి తరానికి ఆలోచనాత్మకం, అనుసరణీయం.

నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రంలో మధ్య తరగతి విశ్వబ్రాహ్మణ (కమ్మరి) కుటుంబంలో జన్మించిన శ్రీనివాసాచారి గారి బాల్య జీవితం అత్యంత సాధారణమైంది. విలువలను పాటిస్తూ పెరిగే వాతావరణం చిన్ననాటి నుండే ఆయనకు తోడైంది. చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోవడం ఆయన ఆయన కుటుంబానికి పెద్ద దెబ్బ. అన్నయ్య వెంకటాచారి%-%వదిన సుధారాణిల ఆదరణతో విద్యాభ్యాసాన్ని ఆపకుండా శ్రీనివాస చారి మొక్కవోని ధైర్యంతో కొనసాగించారు. ప్రాథమిక విద్యను చండూరులోనే పూర్తి చేసి, నల్లగొండలోని ఎన్ జి కళాశాలలో కళాశాల విద్యను అభ్యసించారు.గణితశాస్త్రంలో ఆయన డిగ్రీ చదువుతున్నప్పటికీ, ఆయన మనసు మాత్రం తెలుగు భాషా సాహిత్యాల వైపు పూర్తిగా మళ్లిపోయింది. తెలుగు పట్ల ఆయనలో ఉన్న ఆసక్తి, కవిత్వం పట్ల పెరిగిన జిజ్ఞాస ఆయనను సాహిత్య శీలిగా తీర్చిదిద్దాయి. తెలుగు భాషపై శ్రీనివాసాచారికి ఉన్న ఆసక్తిని గుర్తించిన గురువులు ఏనుగు ఉన్నప్రదీప్ రెడ్డి, విజయరాములు, బొడ్డోజు మల్లాచారి అందించిన అపూర్వమైన ప్రోత్సాహం ఆయన విద్యా ప్రస్థానంలో కీలకమైన మలుపుకు దారితీసింది. గణితం డిగ్రీ తర్వాత పూర్తిగా తెలుగులోనే ఉన్నత విద్యకు వెళ్లాలని నిర్ణయించుకొని ఆ దిశగా ముందడుగు వేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2011లో ఎం.ఏ. తెలుగు పూర్తిచేశారు. యూజీసీ నెట్, జెఆర్ యఫ్ విద్యార్హతలను సాధించి తన ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుకుని తద్వారా తనకు ఎంతో ఆసక్తి కలిగిన
పరిశోధన రంగంలోకి అడుగుపెట్టారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పీహెచ్ డి లో ప్రవేశం లభించింది.“నల్లగొండ జిల్లా ప్రాచీన కవిత్వం - పరిశీలన” అనే వైవిధ్యవంత, ప్రామాణికమైన అంశంపై డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి పర్యవేక్షణలో ఆయన సప్రమాణికమైన పరిశోధన చేశారు.ఈ పరిశోధన కేవలం డాక్టరేట్ పట్టాదారునిగా ఆయనను నిలబెట్టడమే కాకుండా నల్లగొండ ప్రాంతీయ సాహిత్య చరిత్రకు విలువైన అధ్యయనాన్ని కూడా అందించిన ఘనతను దక్కించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థిగా ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా ఆయన చురుకైన పాత్ర పోషించారు. విద్యారంగం పట్ల ఉన్న ప్రత్యేక ఆసక్తి, సమాజం పట్ల బాధ్యతా భావాన్ని ఆయనను నిరంతర, నిత్య నూతన కృషి వైపు నడిపించాయి.
పోటీ పరీక్షల బోధకునిగా.. పోటీ పరీక్షల బోధనలోకి శ్రీనివాస చారిని సైకాలజీ లెక్చరర్ మధుబాబు తీసుకువచ్చారు. అభ్యాసం ఉన్నా అవకాశాలు లేని యువతకు విద్యారూపంలో వెలుగు అందించాలనే సంకల్పం ఆ దశలోనే ఆయనలో నాటుకుపోయింది.అత్యంత క్లిష్టమైన తెలుగు వ్యాకరణం, సాహిత్య అంశాలు, పురాణాలు, ప్రాచీన కవిత్వం వంటి విషయాలనుసులభమైన కోడ్లతో,వినూత్న విశ్లేషణతో,పరీక్షా దృక్కోణంలో,జ్ఞాపకశక్తికి అనువుగా, విద్యార్థులకు అందించడమే ఆయన బోధనలోని ప్రత్యేకతదేశంలో జరిగిన తెలుగు పోటీ పరీక్షలప్రశ్నాపత్రాలను సంపూర్ణంగావిశ్లేషించి,తెలుగులో మొదటిసారి సంపూర్ణ గత ప్రశ్నాపత్ర విశ్లేషణ చేసిన వ్యక్తిగా శ్రీనివాసాచారి గుర్తింపుపొందారు. టిఆర్ఈఐఆర్ బి గురుకుల నియామకాలలోడిఎల్,జేఎల్, పిజిటి, టిజిటి పోస్టుల్లో ఎంపికైన అభ్యర్థుల్లో గణనీయ శాతం విద్యార్థులు ఆయన శిష్యులే అవడం గమనార్హం. ఆ విజేతల విజయాల్లో ఆయన మార్గదర్శకత, నిర్వహణ, బోధన కీలక పాత్రను పోషించాయి. కేవలం బోధించడం మాత్రమే కాకుండానిరుద్యోగ యువత ఎదుర్కొనే ఆర్థిక, మానసిక కష్టాలను అర్థం చేసుకుంటూ, వారు తప్పనిసరిగా గెలవాలి అన్న నిబద్ధతతో ఆయన చేసే సేవకు అందివచ్చిన ఫలితాలే వారి ఆ విజయాలు. టిఆర్ఈఐఆర్ బి పోటీ పరీక్షల్లో మొదట పిజిటి తెలుగు,తర్వాత జేఎల్ (తెలుగు)లో రాష్ట్రంలో 3వ ర్యాంకు, మైనారిటీ గురుకులాల్లో ప్రథమ ర్యాంకు సాధించడం ఆయన కృషికి ప్రత్యక్ష నిదర్శనాలు. ప్రస్తుతం టిఎంఆర్ఇఐఎస్ హెచ్ఓ లో విషయ నిపుణుడిగా రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు బోధన ప్రమాణాలు పెంచడంలో ఆయన కీలక పాత్ర నిర్వహిస్తున్నారు.

**డా. తిరునగరి శ్రీనివాస్**
9441464764

## చిట్టీల పేరుతో రూ. 3 కోట్లు మోసం

**ఉప్పల్, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** ఉప్పల్ అద్దె ఇంట్లో ఉండే దంపతులు చుట్టుపక్కల వారితో పరిచయం పెంచుకున్నారు. చిట్టీలు, అధిక వడ్డీ ఎరచూపి నమ్మకంగా స్థానికుల నుంచి సుమారు రూ.3 కోట్లకు పైగా వసూలు చేశారు. అద్దె ఇంటికి తాళం పెట్టి ఉడాయించిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగినది ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ విషయం. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలుకానగర్‌లోని కుమ్మరికుంటలో జె.సురేష్, జె. శాంతి దంపతులు గత పదేళ్లుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. చుట్టుపక్కల వారి వద్ద నమ్మకంగా ఉంటూ చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేశారు. అత్యధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపించి చాలా మంది వద్ద డబ్బులు వసూలు చేశారు. ఈ విధంగా సుమారు రూ.3 కోట్లకు పైగా వసూలు చేశారు. రాత్రికి రాత్రే పత్తా లేకుండా పోయారు. ఇద్దరి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. మోసపోయినట్లు గుర్తించిన భాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నామినేటెడ్ పదవిలో నాకు అవకాశం ఇవ్వాలి



**కూకట్‌పల్లి, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** కాంగ్రెసు జెండా కింద పనిచేస్తూ, పార్టీ కష్టకాలంలోనూ తాను ముందువరుసలో నిలిచిన విషయం పార్టీ హైకమాండ్‌కు తెలుసు అనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు. నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ని కలసి తన బయోడేటా సమర్పించినట్లు తెలిపారు. పార్టీ బలహీనంగా ఉన్న సమయంలో కూడా నేను వెనుదిరగలేదు. బెదిరింపులు, ఒత్తిడులు, రాజకీయ వేధింపులు వచ్చినా పార్టీ కోసం పోరాటం ఆపలేదు. నేడు కాంగ్రెసు పునరుద్ధరణ దశలో నిలబడుతున్న ఈ సమయంలో, మా వంటి కట్టుబడిన సైనికులను గుర్తించి నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేయాలి," అని రాజు స్పష్టం చేశారు. కాంగ్రెస్ సిద్ధాంతాల పట్ల తన అంకితభావం వల్లే ప్రజల్లో విస్తృతంగా పని చేయగలిగానని ఆయన పేర్కొన్నారు. "15 ఏళ్లుగా పార్టీ కోసం అహర్నిషలు పనిచేశాను. ప్రతి కార్యక్రమంలో పాల్గొని, ప్రతి ఉద్యమంలో ముందున్నాను. ఇప్పుడు పార్టీ తిరిగి బలోపేతం అవుతున్న ఈ సందర్భంలో, సంవత్సరాలుగా న్యాయంగా ఎదురు చూస్తున్న నేతలకు అవకాశం ఇవ్వడం సమయం వచ్చింది," అని ఆయన పేర్కొన్నారు. చిరుమర్తి రాజు నేతృత్వం స్థానిక స్థాయిలో పార్టీకి బలం చేకూర్చిందని, నామినేటెడ్ పదవి తనకు లభిస్తే మరింత శక్తివంతంగా కాంగ్రెసు పాదయాత్ర, కార్యక్రమాల్లో పాలుపంచుకుని ప్రజలకు సేవ చేయగలనని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్వీకే సేవలు

- గచ్చిబౌలి ఎస్వీకే సందర్శనకు పిల్లలను ప్రోత్సహించండి
- డిఇఓ సుశీందర్ రావు






**శేరిలింగంపల్లి, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞానకేంద్రం సేవలను విరివిగా ఉపయోగించుకోనున్నట్టు రంగారెడ్డి జిల్లా విద్యాధికారి పి.సుశీందర్ రావు తెలిపారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం(గచ్చిబౌలి) ఆధ్వర్యంలో కార్యదర్శి పి.ప్రభాకర్ అధ్యక్షతన గురువారం హైదరాబాద్ లో నిర్వహించిన బాలోత్సవ్ సభ మొదటి రోజు ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు సుందరయ్య విజ్ఞానకేంద్రం అందిస్తున్న సేవలు బాగున్నాయని ఆయన అభినందించారు. ఇందులోని గ్రంథాలయాన్ని పేద విద్యార్థులకోసం పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఆయా మండలాల విద్యాధికారులను డిఇఓ ఆదేశించారు. వినడం కన్నా చదవడం ద్వారా నేర్చుకున్న విషయాలు ఎక్కువగా గుర్తుంటాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నిరంతరాయంగా తరగతి గదిలో చదువుకోమంటే పిల్లలు ఇష్టపడరనీ, బాలోత్సవ్ లాంటి కార్యక్రమాల్లో పాల్గొంటూ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం వంటి ప్రదేశాలకు విచ్చేసి బయటి ప్రపంచం చూస్తుంటే చదువు, విజ్ఞానంపట్ల ఆసక్తి పెరుగుతుందని వివరించారు. పిల్లల నుంచి ఎక్కువగా ఒక టీచర్ కొడుతుంది, తిడుతుంది లాంటి ఫిర్యాదులు రావడానికి ఆ టీచర్ ను పిల్లలు ఇష్టపడకపోవడమే కారణమని వివరించారు. సమాజం మంచి కోరేవారు, సమాజం చెడు కోరేవారు ఇద్దరూ తరగతి గది నుంచే తయారవుతారన్నారు. ఏ టీచర్ అయితే విద్యార్థిని సరిగ్గా తీర్చిదిద్దరో ఆ గది నుంచి వచ్చేవారు సమాజానికి పెద్దగా ఉపయోగపడాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా పరిధిలో 15 వందల స్కూళ్లు ఉన్నాయని, అవసరం మేరకు ఎస్వికె సేవలను ఉపయోగించుకుంటామన్నారు. సభకు అతిథిగా హాజరైన ఎ. రాంచంద్రయ్య మాట్లాడుతూ పిల్లలను తీర్చిదిద్దే దర్శకత్వ బాధ్యతను టీచర్లు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. మనిషి అని గుర్తించడానికి కళా దృక్పథం ఉండాలని సూచించారు. కళాత్మక దృష్టి ఉంటేనే మనిషి ఉత్తేజంగా ఉంటారనీ, ప్రముఖ శాస్త్రవేత్త వయోలిన్ వాయించే వాడని గుర్తు చేశారు. తాము నాలుగో తరగతి నుంచి పరిశోధన చేసేంత వరకు ప్రతి ఏడాది నాలుగైదు కళాత్మక కార్యక్రమాల్లో పాల్గొనే వారమని అన్నారు. ఏ విషయాన్ని గుడ్డి నమ్మొద్దని, సంశయాత్మకంగా ఉన్న విషయాలపట్ల ప్రశ్నించి తెలుసుకోవాలని సూచించారు. రాజ్యాంగం కూడా అదే విషయాన్ని చెబుతుందన్నారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో వస్తున్న చెకుముకి పిల్లల్లో శాస్త్రీయ అవగాహన పెంచుతుందని తెలిపారు. 1930లో సివి రామన్ కు సైన్సులో నోబుల్ బహుమతి వచ్చిన తర్వాత మళ్లీ ఇప్పటి వరకు భారతదేశం నుంచి ఎవరికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అలాంటి అత్యున్నత బహుమతిని అందుకునే దిశగా మన ఆలోచనలుండాలని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యదర్శి పి.ప్రభాకర్ మాట్లాడుతూ 26 స్కూళ్లలో బాలోత్సవ్ లో భాగంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పిల్లలు పాల్గొన్నారని తెలిపారు. ఆయా స్కూళ్లలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులతో తుది పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన సిబ్బంది, ఉపాధ్యాయులు, డ్యాన్సర్స్ తదితరులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం కూడా బాలోత్సవ్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎస్వికె సమీపంలోని 10 చోట్ల పేద విద్యార్థులకు ట్యూషన్స్ చెబుతున్నట్టు తెలిపారు. పేద విద్యార్థులతోపాటు బడ్జెట్ స్కూళ్ల విద్యార్థులు విద్యావసరాల కోసం ఎస్వికె ను సంప్రదిస్తే అవసరమైన సహకారం అందిస్తామన్నారు. గ్రంథాలయంలో తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో 3 లక్షల పుస్తకాలున్నాయనీ, వాటిలో 15 వేల పుస్తకాలు డిజిటల్ లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రతి నెల మొదటి ఆదివారం 10 మంది స్పెషలిస్టులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రధానంగా నిలిచి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపిన అగ్రగణ్యుల్లో ఒకరు, మొదటి పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా క్యాబినెట్ హోదా ఉన్న సైకిల్ పై ప్రయాణించి పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. సుందరయ్య ఆశయాల సాధనకు తమ కృషి కొనసాగుతుందనీ, ఏ సమస్య ఉన్న సంప్రదించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు చంద్రయ్య మ్యాజిక్ షో ద్వారా పిల్లల్లో శాస్త్రీయ అవగాహన పెంచే ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆహుతులతో కలిసి సుశీందర్ రావు విజేతలకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమాన్ని శ్రద్ధగా ఆలకించి నేర్చుకుంటున్న ఐదో తరగతి విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించిన డిఇఓ ఆమెకు వ్యక్తిగతంగా వెయ్యి రూపాయల నగదు పారితోషికాన్ని ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మండల విద్యాధికారి కె. వెంకటయ్య, గండిపేట మండల విద్యాధికారి సునీల్ కుమార్, ఎస్వికె ట్రస్ట్ సభ్యులు ఆర్. సాంబశివరావు, బాలోత్సవ్ కన్వీనర్ సి. విజయ్ కుమార్, కల్చరల్ బాధ్యులు శ్రీనివాసరావు, అనిల్, రవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్థంబాల మార్పునకు అధికారుల పరిశీలన

**బోడుప్పల్, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** బోడుప్పల్ బంగారు మైసమ్మ దేవాలయం నుండి చెంగిచెర్ల వెళ్లే మార్గంలో హెచ్ఎండీఏ నిధులతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో విద్యుత్ స్థంబాల మార్పు పై గురువారం విద్యుత్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ తోటకూర అజయ్ విజ్ఞప్తి మేరకు అధికారులు రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్థంబాల మార్పు కోసం అధికారులు చర్చించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాల మార్పు ఏలా చేయాలనేది పరిశీలించమని త్వరగా ఏలా చేయాలనేది విధివిధానాలు రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జోన్ సీఈ భాస్కర్, హబ్సిగూడా ఎస్ఈ వెంకన్న, హబ్సిగూడ డీఈ సుబ్బారావు, డీఈ



(కన్‌స్ట్రక్షన్) బాగయ్య,ఉప్పల్ ఏడీఈ రవీందర్,ఏఈ వేణుగోపాల్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ టోల్ గేట్ వద్ద 285 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

- లారీ సీజ్, డ్రైవర్ అరెస్ట్




**తూప్రాన్, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** తూప్రాన్ టోల్ గేట్ వద్ద భారీ స్థాయిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను సివిల్ సప్లై అధికారులు, పోలీసులు సంయుక్తంగా భగ్నం చేశారు. ఓ గుర్తు తెలియని వ్యక్తి అందించిన సమాచారం మేరకు ప్రత్యేక బృందాలు ఉదయం 7 గంటలకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, రంగురంగుల సంచుల్లో మొత్తం 285.70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలింపును గుర్తించి లారీని సీజ్ చేశాయి. తనిఖీ వివరాలు ఇలా ఈటిఎఫ్ టీం, హైద్రాబాద్, తూప్రాన్ ఎస్ ఐ శివానందం పోలీసులు, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ తాటి నర్సింలు తదితరులు పాల్గొన్న ఈ తనిఖీల్లో లారీ నంబర్ టీఎస్ 16 యు బి 2731 ను అడ్డుకొని పరిశీలించారు. లారీలో పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యం ఉందని గుర్తించిన అధికారులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ షేక్ మస్తాన్ (జిల్లపల్లి ఫారం, కోటగిరి, నిజామాబాద్ జిల్లా) తెలిపిన వివరాల ప్రకారం, ఈ బియ్యాన్ని శ్రీ మల్లిఖార్జున ట్రేడర్స్, ప్లాట్ నెం. 77, ఫేజ్, లాల్‌పేట్ ఇండస్ట్రియల్ పార్క్, పాషా మైలారం రోడ్, సంగారెడ్డి నుండి రంపూర్%–%నిజామాబాద్ కు లోడ్ చేశారన్నారు. అనంతరం మాన ట్రేడర్స్ అధీనంలోని సుబరెడ్డి వద్ద నుండి బియ్యం తీసుకొని ఇది వడవు కండల్ వాడీ, మక్కాష్ రోడ్, విలాటి, నాందేడ్ వైపు తరలిస్తున్నట్టు వెల్లడించాడు. అక్రమ రవాణాకు ఉపయోగించిన విధానం లారీలో మొత్తం 565 రంగురంగుల ప్లాస్టిక్ సంచులు, ప్యాకింగ్ మెటీరియల్, వైబ్రేటర్‌లతో పాటు మొత్తం 285.70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇది ప్రభుత్వ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి రవాణా చేస్తున్న స్పష్టమైన నేరమని పోలీసులు చెప్పారు. వాహనం సీజ్, కేసు నమోదు సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ తాటి నర్సింలు ఫిర్యాదు మేరకు తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. లారీ (టి.ఎస్ 16 యు.బి 2731)ని సీజ్ చేసి, కేసు పూర్తయ్యే వరకు సురక్షిత కస్టడీలో ఉంచినట్టు పేర్కొన్నారు. అక్రమంగా ప్రభుత్వ బియ్యాన్ని కొనుగోలు చేసి రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలి

- బాచుపల్లి సిఐటియు మండల కమిటీ కార్యదర్శి రాథోడ్ సంతోష్




**నిజాంపేట్, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** మెదక్ జిల్లాలో ఈనెల 7 వ తేదీ మొదలై 9 వరకు సిఐటియు ఐదవ మహాసభలు నిర్వహిస్తున్న నేపధ్యంలో మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు బాచుపల్లి మండల కమిటీ కార్యదర్శి సంతోష్ రాథోడ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సిఐటియు బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ ఆఫీస్ ప్రగతి నగర్ లో పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు బాచుపల్లి మండల కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ముఖ్యంగా కార్మికులకు ప్రమాదమైన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు, యాజమాన్యాలు కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరు మారాలని పనిగంటలు తగ్గించాలని కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రతి కార్మికునికి కనీస వేతనం 26,000 ఇవ్వాలని అసంఘటిత కార్మికులకు కనీస భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు,ఈ రాష్ట్ర మహాసభల్లో కార్మికులు,శ్రామికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి నిరంతరం పోరాట మార్గాలను రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను కార్మికులను అందర్నీ నూతనంగా ఏర్పడిన జిహెచ్ఎంసి కార్మికులుగా ఉద్యోగులుగా పరిగణించాలని ఎటువంటి ఇబ్బందులకు గురి చేయొద్దని తెలియజేశారు. జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం ఉద్యోగులకు కార్మికులకు జీతభత్యాలు చెల్లించాలని అన్నారు. రాబోయే రోజుల్లో బాచుపల్లి మండలంలో కార్మికులు కర్షకులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘటితంగా పోరాటాలు నిర్మిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చెన్నయ్య, లింగమ్మ, నాగలక్ష్మి, లక్ష్మి, బాలస్వామి, నరసింహ, మదిలేటి, నాగ శేషు, మనీ, లక్ష్మి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా జరగాలి

**కౌడిపల్లి, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో గురువారం రెండవ రోజు పంచాయతీ ఎన్నికల నామినేషన్లు జోరుగా కొనసాగాయి. నామినేషన్లు వేసేందుకు సర్పంచ్ అభ్యర్థులు,వార్డు మెంబర్ల నామినేషన్లు చాలా ఆసక్తికరంగా జరిగాయి. తునికి గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి స్వాతి,దేవేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నడుమ భారీ ర్యాలీతో వచ్చి మొదటి నామినేషన్ వేశారు. వెల్మకన్న గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కాయిత విజయలక్ష్మి,లక్ష్మణ్, రెండవ రోజు మొదటి నామినేషన్ వేశారు. దేవులతాండ నుండి బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కోల శ్రీనివాస్, రెండవ రోజు తొలి నామినేషన్ వేశారు. హరిచంద్ తండా నుండి లాకావత్ సాలిభాయ్, రవీందర్,నామినేషన్ వేశారు. ఏదేమైనా అటు పార్టీలకు, ఇటు స్వతగా ఇండిపెండెంట్ అభ్యర్థుల నామినేషన్ జోరుగా కొనసాగుతోంది. సాయంత్రం ఐదు దాటడంతో ఆగమాగం అవుతున్న అభ్యర్థులను అదుపు చేస్తున్న పోలీసు అధికారులు. నామినేషన్ల



ప్రక్రియ సజావుగా జరగాలని రాత్రింబగళ్లు డ్యూటీ చేస్తున్న పోలీస్ అధికారులు. మూడవ రోజు శుక్రవారం నామినేషన్ల గడువుకి చివరి రోజు కావడంతో అభ్యర్థుల,వార్డు మెంబర్ల నడుమ అలజడి అలజడిగా నామినేషన్లు కొనసాగాయి.

# మైక్రో అబ్జర్వర్లు నిబద్ధతతో పని చేయాలి

- జిల్లాలో 98 మంది మైక్రో అబ్జర్వర్లు
- ఎన్నికల విధివిధానాలపై శిక్షణ
- జిల్లా సాధారణ పరిశీలకులు యాస్మిన్ భాష


**వికారాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** జిల్లాలో పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్లు విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలని జిల్లా సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ భాష అన్నారు. గురువారం ఐ.డి.ఓ.సి సమావేశ హాలు నందు ఏర్పాటు చేసిన మైక్రో అబ్జర్వరులు పోలింగ్ రోజున చేపట్టే విధివిధానాల శిక్షణా కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు యాస్మిన్ బాష జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్బంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ జిల్లా లో594 గ్రామా పంచయతిలకు గాను 98 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించడం జరుగుతుందని ,ఎన్నికల నిర్వహణ మొత్తానికి కండ్లు, చెవులు మైక్రోఅబ్జర్వర్లె నని , ఎన్నికల నియమావళిని అనుసరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. వికారాబాద్, తాండూర్, కోడంగల్, పరిగి



నియోజకవర్గాలలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్ల విధులు కీలకమని అన్నారు. తప్పక చెక్ లిస్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్ల పోలింగ్ రోజున పోలింగ్ బూత్ లో జరిగే పోలింగ్ ప్రక్రియను పరిశీలన చేయడానికి నియమించడం జరుగుతుందని , వెబ్ క్యాస్టింగ్ ,పోలింగ్ బూత్ లో ప్రిసైడింగ్ అధికారికరెక్ట్ గా చేస్తున్నారా లేదా వారు చేసే ప్రతి అంశాన్ని పరిశీలన చేయాలని తెలిపారు. పోలింగ్ రోజున పోలింగ్ నిర్వహణ పరిశీలన చేయాలని సూచించారు. ఎంత మంది పోలింగ్ ఏజెంట్లు హాజరు అయినది లేనిది తప్పక చూడాలని అన్నారు. ముఖ్యంగా బ్యాలట్ బాక్సు ఖాళీ గా ఉన్నాయా లేదా చెక్ చేయాలనీ, సీలింగ్ చేస్తున్నారా, లేదా చెక్ చేసుకోవాలని,పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు పరిశీలన చేయాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ముగిసిన అనంతరం సాధారణ పరిశీలకులకు రిపోర్ట్ లు సబ్మిట్ చేయాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ లో ప్రశాంతంగా నిబద్ధతతో పనిచేయాలని పరిశీలనకు ప్రాధాన్యత ఉండాలని, విధుల పట్ల ఎలాంటి పొరపాట్లు జరుగకుండా విదులు నిర్వహించాలని మైక్రో అబ్జర్వర్లుకు ఆదేశించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్లు చేయాల్సిన విది విధానాలు మాస్టర్ ట్రైనర్స్ రామ్ రెడ్డి, కృష్ణా రెడ్డి పని చేయు విధానం గురించి వివరించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డి ఆర్ డి ఓ శ్రీనివాస్. ఎల్ డి ఎం యాదగిరి, బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, మైక్రో అబ్జర్వర్స్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత

- స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలి
- కాంగ్రెస్ పార్టీ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి



**మహేశ్వరం, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ యువతకు అధిక ప్రాధాన్యత కల్పించదాన్ని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అన్నారు.గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం చిన్నతూప్ర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గొల్లూరి రాజు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్,వార్డు అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించడానికి యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.సర్పంచ్ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్, సీనియర్ నాయకులు ఆవుల యాదయ్య, ఆదిల్, ఇమ్మడి ప్రవీణ్ పటేల్, శ్రీనివాస్, సతీష్, రాఘవేందర్, అంజయ్య, పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో సీఎం పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమి లేదు

**హుస్నాబాద్, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** హుస్నాబాద్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక మంత్రిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం శంకుస్థాపన చేసిన పనులు ఆరు నెలల్లో పూర్తి చేసే దమ్ము ప్రస్తుతం ప్రభుత్వానికి లేదని ఆయన ప్రశ్నించారు. హుస్నాబాద్‌లో సీఎం పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని పేర్కొన్నారు. గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని పదేళ్లలో 96% పూర్తి చేసి, ఒకటి ఎంసీ వరకు నీళ్లు నింపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, ఈ ప్రాజెక్టును అడుగడుగునా అడ్డుకోవడం కాంగ్రెస్ పార్టీ చేసిన పనని స్పష్టం చేశారు. రిజర్వాయర్ కాలువల భూసేకరణ, నిర్మాణానికి టీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే రూ.200 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం ప్రభుత్వం రూ.437 కోట్లు ప్రకటించుకున్నప్పటికీ ఇప్పటివరకు ఒక తట్టెడు మట్టి కూడా తీయలేకపోయిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో గండిపల్లిని సందర్శించి అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు ఒక మాట కూడా ప్రస్తావించలేదని వ్యాఖ్యానించారు. 2014కు ముందు హుస్నాబాద్ పరిస్థితి ఎలా ఉండేదో, అనంతరం ఏ అభివృద్ధి జరిగినదో ప్రజలందరికీ తెలుసునని, అభివృద్ధి జరగలేదని



చెప్పడం సీఎం, మంత్రుల అవగాహన లేకపోవడమేనని అన్నారు. అభివృద్ధి లేకుంటే హుస్నాబాద్ పలుమార్లు జాతీయ అవార్డులు ఎలా సాధించిందని ప్రశ్నించారు. చిన్న నీటి వనరుల అభివృద్ధి, మహాసముద్రం గండి, గాడుదులలోద్ది నిర్మాణం, శనిగరం ప్రాజెక్టు, చెరువుల మరమ్మత్తులు బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధేనని పేర్కొన్నారు. కేవలం ఒక కళాశాలకు అనుమతి తెచ్చి ప్రజలను మోసం చేస్తూ, కోట్ల రూపాయలు మంజూరు చేసామని చెప్పుకునేది తప్ప నిజానికి పనులు పూర్తి చేసి చూపించిన దాఖలాలు కనిపించడం లేదని అన్నారు. స్థానిక మంత్రిది మాటలు ఎక్కువ, పనులు తక్కువ అనే చందంగా ఉందని విమర్శించారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థంగా సేవలందించామని, ఎన్నడూ కమిషన్లకు ఆసక్తి చూపలేదని చెప్పారు. దమ్ముంటే సీఎం శంకుస్థాపన చేసిన పనులను ఆరు నెలల్లో పూర్తి చేసి చూపించాలని సవాలు విసిరారు. 6 గ్యారంటీలు అమలు చేయలేక, 420 హామీలు నెరవేర్చలేక గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే సీఎం జిల్లాలో పర్యటనలు, సభలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. సర్పంచ్ ఎన్నికల లబ్ధికోసమే సీఎం పర్యటనలు జరుగుతున్నాయని, ప్రజలకు అందులో ప్రయోజనం లేదని అన్నారు. కమిషన్ల కోసమే పక్కాగా ఉన్న దవాఖానను కూల్చివేశారని, చిత్తశుద్ధి ఉంటే మరొక విశాల ప్రదేశంలో కొత్త భవనం నిర్మించవచ్చని పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేళ్ల టీఆర్ఎస్ పాలనలో రూ.5649 కోట్ల అభివృద్ధి, రూ.3427 కోట్ల సంక్షేమం అందించామని తెలిపారు. గౌరవెల్లి భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.30 లక్షలు ఇస్తామని చెప్పిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పుడు రూ.15 లక్షలు మాత్రమే ఇస్తామనడం హాస్యాస్పదమని అన్నారు. స్థానిక మంత్రి ఉన్నం ప్రభాకర్ ఇప్పటికైనా తన తీరును మార్చుకొని సేవా దృక్పథంతో పనిచేయాలని సతీష్ కుమార్ హితవు పలికారు.

## సర్పంచ్ వార్డు సభ్యుల పదవులు వేలం వేస్తే చట్టరీత్యా క్రిమినల్ కేసులు



**కౌడిపల్లి, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** గురువారం కౌడిపల్లి మండల కేంద్రంలోనీ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ రాజ్, మాట్లాడుతూ... మూడవ నామినేషన్ శుక్రవారం పూర్తవుతుందన్నారు. అధికార్లు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నామినేషన్ స్వీకరించాలన్నారు. నామినేషన్ ప్రక్రియ ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులు అర్హత గల అన్ని పత్రాలు సమర్పించాలన్నారు. రిజర్వేషన్ అభ్యర్థులకు కుల సర్టిఫికెట్లు త్వరగా ఇవ్వాలని మండల స్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అభ్యర్థులందరూ నూతన బ్యాంక్ అకౌంట్ తీయాలని ఎన్నికల ఖర్చులన్నీ నూతన బ్యాంక్ అకౌంట్‌తోనే లావాదేవీలు జరగాలన్నారు. సర్పంచు, వార్డు పదవులకు ఎలాంటి వేలం పాటలు పెట్టరాదు అన్నారు. పోటీ చేసిన అభ్యర్థులను వత్తిడి తెచ్చి భయభ్రాంతులకు గురి చేస్తే క్రిమినల్ కేసులు బుక్ చేస్తామన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలో తూచా తప్పకుండా పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కృష్ణ,ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ వెంకటేశంతోపాటు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామానికి సేవ చేసే భాగ్యాన్ని కల్పించండి

- ప్రజలకు అందుబాటులో ఉంటా అభివృద్ధి చేస్తా..
- గ్రామ సర్పంచ్ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి



**మక్తల్, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** గ్రామానికి సేవ చేసే భాగ్యాన్ని కల్పించండని గ్రామ సర్పంచ్ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మక్తల్ మండలంలోని మధ్వార్ గ్రామానికి చెందిన వెంకట్ రెడ్డి తనయుడు గా సీనియర్ మోస్ట్ లీడర్ సంతోష్ రెడ్డి అల్లుడిగా డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఓ సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. డాక్టర్ వృత్తి నిర్వహిస్తూ ప్రజల్లో యువతతో దశాబ్ద కాలంలోనే బలమైన ప్రజాధరణం ఏర్పరచుకొని నిరంతరం గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తూ డాక్టర్ వృత్తిలో ఇప్పటిదాకా ఎంతో మంది నిరుపేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారు. గ్రామాల్లో ఏ ఆపద వచ్చినా నేనున్నా అంటూ ముందుకు వస్తున్న వ్యక్తి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి. పలు శుభకార్యాలు అశుభ కార్యాలకు అందుబాటులో ఉంటూ ప్రజల మన్ననలు పొందడంతో నిస్వార్థ సేవకు నిలువెత్తు రూపమైన మ కుటుంబాన్ని గెలిపించాలి నన్ను సర్పంచ్‌గా గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవకే పునరంకితమవుతానని ప్రజల ఆశీస్సులు గ్రామ పెద్దల సహకారంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తానని అన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన అందుబాటులో ఉంటూ పరిష్కరిస్తానని, గ్రామ సర్పంచ్ గా గెలిపించండి గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. గ్రామానికి సేవ చేసే అవకాశాన్ని ఇవ్వండి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని సర్పంచ్ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రజలను వేడుకుంటున్నారు.

## రిజర్వేషన్ల వివరాలు సరిచూసుకొని నామినేషన్లు స్వీకరించాలి

- జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి ఆయా పంచాయతీలకు ఖరారు చేసిన రిజర్వేషన్లను సరిచూసుకొని పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. గురువారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదవ బెటాలియన్‌లో ఉన్న జెడ్పిహెచ్ఎస్ భవనంలో క్లస్టర్ 1, క్లస్టర్ 2 నామినేషన్లను స్వీకరించు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఇక్కడ ఎర్రవల్లితో పాటు సాసనోలు,ఆర్. గార్లపాడు, తిమ్మాపూర్, షేక్‌పల్లె, బీచుపల్లి, జింకలపల్లి, కొండేరు, బి. వీరాపూర్ గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను కూడా స్వీకరిస్తుండడంతో ఆయా పంచాయతీల ఓటర్ లిస్టును పరిశీలించారు. పోటీ చేయు అభ్యర్థులు పూరించాల్సిన వివిధ దరఖాస్తులను, నామినేషన్ వేసేందుకు అవసరమైన ఇతర సామాగ్రిని రిటర్నింగ్ అధికారులు సిద్ధంగా ఉంచుకోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. నామినేషన్లు వేసేందుకు వచ్చే వారికి తగిన సహకారం అందించాలని హెల్ప్‌డెస్క్ సిబ్బందికి సూచించారు. సర్పంచు, వార్డు సభ్యులు పదవులకు పోటీ చేయు అభ్యర్థులు తమ దరఖాస్తుకు జతపరచాల్సిన వయసు, కుల, ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను నిబంధనల ప్రకారం స్వీకరించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. పోటీ చేయు అభ్యర్థులు గ్రామ పంచాయితీకి



చెల్లించాల్సిన పన్నులు పెండింగ్లో ఉండకుండా కట్టించుకోవాలన్నారు. నామినేషన్ల డిపాజిట్ స్వీకరించాక అభ్యర్థులకు రసీదును అందజేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పత్రాలను విధిగా నామినేషన్ వేసిన వారికి అందజేయాలన్నారు. నామినేషన్ వేసిన వారి వివరాలను ఎప్పటికప్పుడు టీ-పోల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. సాయంత్రం ఐదు గంటలలోగా నామినేషన్ కేంద్రం లోపల ఉన్న వారి నుంచి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని, నిర్దేశిత సమయం మించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో కేంద్రంలోకి అనుమతించరాదన్నారు. ఈ పర్యటనలో ఎర్రవల్లి మండల తహసిల్దార్ నరేష్, ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్, తదితరులున్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**తూప్రాన్, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ తెలిపారు మనోహరాబాదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్డాక్టర్ హరిప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్సీని అన్ని వార్డులను పరిశీలించారు. ల్యాబ్ ను మరియు థియేటర్ ను పరిశీలించారు. మందుల నిలువ గదులను స్టోర్ ను పరిశీలించారు వాటి ఎక్స్పైరీ డేట్లను కూడా పరిశీలించారు. తర్వాత సిబ్బందితో రివ్యూ మీటింగ్ కండక్ట్ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందాలని సూచించారు. గ్రామాల్లో ఆశ కార్యకర్తలు గర్భవతులకు అవసరమైన సేవలు అందించాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికార డాక్టర్ జోష్ణ దేవి కె బాల నర్సయ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సూపర్వైజర్లు ఏఎన్ఎం పిహెచ్సి సిబ్బంది తదితరులు హాజరైనారు.

## దారులన్నీమల్దకల్ జాతర వైపు..

- భారీగా తరలి వచ్చిన భక్తులు

**మల్దకల్, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** మండలకేంద్రంలో ప్రతి సంవత్సరం మార్గశిర మాసం డిసెంబర్ నెలలో వచ్చే పౌర్ణమి రోజు గురువారం శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం అత్యంత కన్నుల పండుగగా వైభవంగా జరుపుకుంటారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు గద్వాల జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడమే కాక ఇతర రాష్ట్రాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఈ రథోత్సవానికి తరలి వచ్చారు. మల్దకల్ జాతర తెలంగాణలో ఇతర జాతరలో అత్యంత ప్రసిద్ధి చెందిన జాతరగా పేరుపొందింది. ఈ తిర్నాల తిమ్మప్ప స్వామి భక్తులు భావిస్తారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అత్యంత పెద్ద జాతరగా మల్దకల్ జాతర కొనసాగుతుంది. కలియుగవైకుంఠం తలపించే తిరుమల తిరుపతిలో గెలిచిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఏడుకొండల పైన మాత్రమే కాకుండా ఇతర దేశంలో అనేక ప్రాంతాల్లో వెలసినట్లు అందులో భాగంగానే జోగులాంబ గద్వాల జిల్లాలోని మల్దకల్ మండల కేంద్రంలో స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వెలసినట్లు ఈ ప్రాంత ప్రజలు భక్తిశ్రద్ధలతో



వెంకటేశ్వర స్వామి మొక్కులు తీర్చుకుంటారు. రథోత్సవం సందర్భంగా పౌర్ణమి రోజు రాత్రి వేళలో రథోత్సవం నిర్వహిస్తారు. శ్రీలక్ష్మీ స్వయంభు వెంకటేశ్వర స్వామి కి దాసంగాలు నైవేద్యంగా సమర్పించే మొక్కులు తీర్చుకున్నారు. దాసంగాలు అంటే ఈ ప్రాంతంలో ఒక మట్టికుండకు అలంకరించి అందులో స్వామికి నైవిద్యాన్ని సమర్పించడం ఎక్కడ చూసినా దాసంగాలు కనిపించాయి. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవానికి తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తూ ప్రయాణికుల సౌకర్యార్థం వనపర్తి, గద్వాల, సమీప రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక, రాయచూర్ తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవదాయ శాఖ మరుగుదొడ్లు మూత్రశాలలు, రోడ్డు సౌకర్యం,భక్తులు అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది.

## క్రీడా పోటీల్లో విజేతలకు అభినందనలు

- ఎస్పీ శ్రీనివాస రావు



**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** రైసింగ్ డే వేడుకలలో భాగంగా రెండు రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీల తుది మ్యాచ్‌లు ఇవాళ జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు హాజరై రమాయంపేట్ సర్కిల్ మరియు మెదక్ సర్కిల్ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరిత వాలీబాల్ ఫైనల్‌ను వీక్షించారు. ఈ పోటీలో మెదక్ సర్కిల్ అద్భుత ప్రతిభ కనబరిచి మొదటి స్థానం, రామాయంపేట సర్కిల్ ద్వితీయ స్థానం సాధించాయి. కబడ్డి పోటీల్లో అల్లాదుర్గ్ సర్కిల్ మొదటి స్థానం, రామాయంపేట సర్కిల్ రెండవ స్థానం కైవసం చేసుకున్నాయి. మ్యూజికల్ చైర్ పోటీలో భూలి మొదటి స్థానం, లావణ్య ద్వితీయ స్థానం సాధించి మంచి ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రైసింగ్ డే సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో హోమ్ గార్డ్ సిబ్బంది చూపిన ప్రతిభ నిజంగా అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ఆసక్తి, క్రమశిక్షణతో భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొనే స్థాయికి ఎదగాలని సూచించారు. హోమ్ గార్డ్ సిబ్బందికి రైసింగ్ డే సందర్భంగా క్రీడాలు నిర్వహించడంపై సిబ్బంది ఆనందం వ్యక్తం చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డియస్పి రంగా నాయక్, ఆర్ఐ లు రామ కృష్ణ, శైలందర్, ఆర్ ఎస్సై లు సిబ్బంది ఉన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలి

- అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి

**రేగోడ్, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని అల్లాదుర్గం సర్కిల్ ఇన్స్పెక్టర్ రేణుక రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం రేగోడు మండల పరిధిలోని ఆర్ ఇటిక్యాల,దోసపల్లి, గజవాడ,రేగోడు గ్రామాలను సందర్శించారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలతో సీఐ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లకు ఎవ్వరైనా తనకు ఓటు వేయాలని బెదిరింపులకు గురిచేసిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఇతరులకు ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఓటర్లకు ఎవరైనా భయందోలనకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పోచయ్య పోలీస్,సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.



## సజావుగా నామినేషన్ల ప్రక్రియ

- ఆర్డీఓ మహిపాల్ రెడ్డి



**శివ్వంపేట, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** పంచాయతీ ఎన్నికలలో భాగంగా కొనసాగుతున్న అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగేలా చర్యలు చేపట్టినట్లు నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు కొనసాగిన నామినేషన్ల పక్రియను ఆర్డీఓ మహిపాల్ రెడ్డి పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పూర్తి చేశారా, లేదా అనేది హెల్ప్ డెస్క్ వద్ద పరిశీలన చేసిన తర్వాతే లోనికి అనుమతించాలన్నారు. నామినేషన్ కౌంటర్ల వద్ద ఎక్కువ సమయం కాకుండా త్వరతగతిన నామినేషన్ పత్రాలను తీసుకొని అధికారులు, అభ్యర్థులను పంపించాలని, ఏదైనా వివరాలు నమోదు చేయకుంటే హెల్ప్ డెస్క్ అధికారుల వద్దకు పంపించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ, ఉప తహసీల్దార్ షఫీయోద్దిన్, ఆర్ఐ నిరంజన్, ఎంపీఓ తిరుపతి రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ స్వామి లతో పాటుగా ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణం

- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్న హిందూ సమాజం
- బిజెపి రోడ్డుపై రాస్తారోకో, శివలింగానికి వినతిపత్రం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడెల్లి రవీంందర్

**సంగారెడ్డి, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** హిందూ దేవుళ్ళ పై కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ మండిపడ్డారు. హిందూ దేవుళ్లపై రేవంత్ రెడ్డి చేసిన వాక్యాలకు నిరసనగా యువమోర్చ అధ్యక్షులు ఆకాష్ ఆధ్వర్యంలో బీరంగూడ గుట్టకమాన్ దగ్గర రాస్తారోకో నిర్వహించి శివ లింగానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అడెల్లి రవీంందర్ మాట్లాడుతూ.... హిందువులు మూడు కోట్ల మంది దేవుళ్ళను పూజిస్తారని, ఇంత మంది దేవుళ్లు ఉన్నారా? అని రేవంత్ మాట్లాడుతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌కి మజ్లీస్ పార్టీ



దేవుళ్ళను విమర్శించే దమ్ముందా? ప్రశ్నించారు. హిందువులకు సంబంధించిన దేవీదేవతలను అవహేళన చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఒక హిందువుగా ఉంటూ, హిందువుల మీద, దేవీదేవతల మీద రేవంత్‌రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. ఎంఐఎం సహవాస దోషం వల్లే రేవంత్ రెడ్డి ఈ విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. తెలంగాణలో హిందువులంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ ముమ్మాటికీ మజ్లీస్ పార్టీకి కొమ్ముకాసే పార్టీ అని ఆరోపించారు. ముస్లిం అంటేనే కాంగ్రెస్..కాంగ్రెస్ అంటేనే ముస్లిం పార్టీ అని రేవంత్ రెడ్డి చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. బీజేపీ ఏనాడూ ఇతర మతాలను కించపర్చలేదని..కించపర్చే ఉద్దేశమూ బీజేపీకి లేదని స్పష్టం చేశారు. తమ పార్టీ అన్ని మతాలను గౌరవిస్తుందని.. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్" దిశగా పనిచేస్తోందని చెప్పారు. ఏ ఓట్లతో అయితే రేవంత్‌రెడ్డి అధికార పీఠమెక్కి మాట్లాడుతున్నారో..అదే ఓట్లతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలన్నారు. ఈ కార్య క్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆగరెడ్డి ,యువమోర్చ అధ్యక్షులు ఆకాష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు శ్రావణ్ , రమేశరెడ్డి, ప్రభాకర్, మహిళా మోర్చా అధ్యక్షులు స్వప్న, ప్రధాన కార్యదర్శి తులసి, రఘుపటేల్, రమాదేవి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంథని డివిజన్లో అక్రమ కేసుల రాజకీయం

- సపాయి కార్మికుడికున్న విలువ పోలీసులకు లేకుండా పోతాంది
- ప్రజల పక్షాన పోరాటం చేస్తే అక్రమ కేసులు పెడ్తరా
- కోర్టులు మందలించినా పోలీసుల్లో మార్పు రావట్లే
- దుద్దిళ్ల కుటుంబాన్ని అర్థం చేసుకుంటే బాగుపడుతరు
- కాటారం మండల ప్రజల బిక్షతోనే మంత్రి పదవని గ్రహించాలే
- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేదు లేదు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**కాటారం, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటాడ మండల పరిధిలోని గంగారం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాటం చేసే వాళ్లపై అక్రమ కేసులు పెట్టించే నీతిమాలిన పనులు దుద్దిళ్ల శ్రీధర్‌కు అలవాటేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ఇటీవల అక్రమకేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చల్లా శేఖర్‌రెడ్డిని ఆయన పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గంగారం గ్రామంలో చల్లా శేఖర్‌రెడ్డి ప్రజల పక్షాన గ్రామపంచాయతీలో ప్రజల డబ్బుల వసూళ్ల అన్యాక్రాంతం అయ్యాయని పోరాటం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దుద్దిళ్ల శ్రీధర్ నేతృత్వంలో అక్రమ కేసు పెట్టారని అన్నారు. కేసులు నిజమైనవి అయితే కనీసం 15రోజులు జైల్లో ఉండాలే కానీ మూడు రోజుల్లోనే బెయిల్ రావడంతో అక్రమకేసులు అని అర్థం అవుతుందన్నారు. ఎన్నిసార్లు దుద్దిళ్ల నైజాన్ని చెప్పినా పోలీసుల్లో మార్పు రావడం లేదని, మంత్రి పదవి ఎప్పుడు వస్తే అప్పుడు ఖాకీ దుస్తుల విలువ తీసేసుకుంటాండ్లని ఆయన అన్నారు. అందుకే సపాయి కార్మికుడికి ఉన్న విలువ ఖాకీలకు లేదని ఇప్పటికే చెప్పామని అన్నారు. అయినా మార్పు రావడం లేదని బారత రాజ్యాంగాన్ని అనుసరించి పోలీసు ఉద్యోగాలు పొందిన వారికి లాఠీ, తుపాకి ప్రజలను రక్షించడానికే ఇచ్చారని, కానీ నీచమైన పనులు చేస్తున్న పోలీసులకు ప్రాయశ్చిత్యం తప్పదన్నారు. అన్నం పెట్టి మంత్రి పదవి రావడానికి కాటారం మండల ప్రజలకే కారణమని, కాటారం ప్రజలు పెట్టిన బిక్షతోమంత్రి అయి ఈ ప్రాంత ప్రజలనే హింసిస్తూ అరిగోస పెడుతున్నాడని ఆయన వాపోయారు. అధికారంలో ఉంటే ఒక రకంగా అధికారంలో లేకపోతే ఒకరకంగా ఊసరవెల్లిలా ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ వ్యవహరిస్తారని అన్నారు. ఆనాడు మందుబస్తాల కోసం ధర్నా చేసి ప్రజల పక్షాన నిలబడితే తనపై రౌడీషీట్ పెట్టారని ఆయన గుర్తు చేశారు, అలాగే జోడు శ్రీను, శేఖర్‌రెడ్డి, పూదరి సత్యనారాయణగౌడ్‌లపై అక్రమ కేసులు పెట్టారని, కోర్టుకు పోతే ఏ కేసులో పస లేదని వెంటనే బెయిల్ మంజూరీ చేశారన్నారు. అంతేకాకుండా భూపాలపల్లి న్యాయమూర్తి ఇది ఫేక్ కేసు అని అర్డర్ ఇచ్చారని, ఉన్నత చదువులు చదివి ఎల్ఎల్‌బీ చేసిన దుద్దిళ్ల శ్రీధర్ తల ఎక్కడ పెట్టుకుంటాడని ప్రశ్నించారు. దేవెందర్ రెడ్డి ప్రజల సోమ్ము వాడుకుంటాండ్లని పోరాటం చేస్తే కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పదేండ్లు జెండా మోసిన దేవేందర్‌రెడ్డి ఆలోచన చేయాలని ... గుండ్రాత్‌పల్లిలో ప్రభాకర్‌రెడ్డి, గంగారంలో దేవెందర్‌రెడ్డిలు అనేక దందాలు చేసి ఆ కుటుంబానికి సేవ చేశారని, ఈనాడు కూడా ఇంకా కాంగ్రెస్ జెండాలు, దుద్దిళ్ల ఫోటోలు పెట్టుకోవడంపై ఆలోచన చేయాలన్నారు. మిమ్మల్ని వాడుకుని కరివేపాకులా తీసేస్తారని, ఇక్కడ మీకు పతార లేకపోవడంతోనే మీ ఇంటి ఆడవాళ్లతో పోలీస్‌స్టేషన్‌కు పోయి కేసు పెట్టే పరిస్థితి వచ్చిందనే విషయాన్ని గమనించాలన్నారు. ఇప్పటికి దుద్దిళ్ల కుటుంబం ఎక్కడా కన్పించరు కానీ మీ ఆడవాళ్లు మాత్రం రోడ్డెక్కి పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరుగాలా అనేది ఆలోచించాలన్నారు. దుద్దిల్ల కుటుంబం గురించి అర్థం చేసుకున్న కనుకనే ఈనాడు తాను ఎమ్మెల్యే అయ్యానని, ఈ సమాజం అర్థం చేసుకోవాలనే తపన పడుతున్నానని అన్నారు. ఊసరవెల్లి కంటే ఎక్కువ దుద్దిళ్ల శ్రీధర్ అనేది ప్రతి ఒక్కరు అర్థం చేసుకుంటేనే బాగుపడుతారని ఆయన హితవు పలికారు. అధికారంలో లేనప్పుడు ఓ ఐపీఎస్ అధికారిని అవమానపర్చిన దుర్మార్గుడు దుద్దిళ్ల శ్రీధర్ అని ఆయన వివరించారు. ఓటు వేసే యంత్రాలుగానే ప్రజలను చూస్తారని, ప్రేమ అభిమానం ఉండదన్నారు. అధికారంలోకి వచ్చి నేటికి 24 నెలలు గడిచిపోయిందని ఇప్పటి వరకు 24మందికి ఉద్యోగాలో ఉపాధి అవకాశాలో కల్పించాడా లేక ఓ పరిశ్రమనైనా తీసుకువచ్చాడని ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. దుద్దిల్ల శ్రీధర్ చెప్పితే అక్రమ కేసులు పెట్టే పోలీసుల్లో మార్పు రావాలని, మారని ప్రతి పోలీస్ పేరును పింక్ బుక్‌లో రాసుకుంటున్నామని అన్నారు. రాజ్యాంగం అనుసరించి ఉద్యోగాలు వచ్చాయని పోలీసులు గమనించాలని శేఖర్‌రెడ్డిని మూడు రోజులు జైల్లో పెడితే ఎం వచ్చిందని ప్రశ్నించారు. అక్రమకేసులు పెడితే భయపడేది లేదని, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గమని ఆయన హెచ్చరించారు.

## మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి


- పూలమాల వేసి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య, పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఎస్సి కార్పొరేషన్ ఈడీ బాలరాజు, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహ స్వామి, మెప్మా పీడీ జోనా, ఇతర అధికారులతో పాటు కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అంతా నా ఇష్టం

- నేటి వరకు కూడా సర్పంచి అభ్యర్థులను ప్రకటించని ఎమ్మెల్యే తీరే వేరు
- ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఆశావాహులు



**ఆత్మకూర్, డిసెంబర్ 4 (జనం సాక్షి):** ఆత్మకూరు మండలం మేజర్ గ్రామ పంచాయతీ, నీరుకుళ్ళ లో నేటి వరకు కూడా కాంగ్రెస్ సర్పంచి అభ్యర్థులను ప్రకటించేని ఎమ్మెల్యే పనితీరుపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు మండిపడుతున్నారు. బి ఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల జాబితా ముందస్తుగా ప్రకటించడంతో ఓటర్లను ఆకర్షిస్తున్నారు. నీరుకుళ్ళ గ్రామపంచాయతీ అభ్యర్థి జనరల్ మహిళా కావడంతో గౌడ సామాజిక వర్గానికి చెందిన మహిళ ఓటర్ల నాడిని పసిగడుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించకపోవడంతో బి ఆర్ఎస్ అభ్యర్థి ముందంజలో ఉన్నట్లు ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. నేడు చివరి రోజు నామినేషన్ పర్వం కావడంతో ఈ రోజైనా కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించాలని సీనియర్ నాయకులు ఎమ్మెల్యేను వేడుకుంటున్నారు.

# నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన సబ్ కలెక్టర్



**కాళేశ్వరం, డిసెంబర్ 04 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు మూడవ విడత నామినేషన్ ప్రక్రియ లో భాగంగా గురువారం కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ కాళేశ్వరం క్లస్టర్ ను ఆకస్మిక పర్యటన చేసి రిటర్నింగ్ ఆఫీసర్ కి తగు సూచనలు జారీ చేశారు. అనంతరం కాళేశ్వరం గ్రామపంచాయతీ లోని గుండం చెరువు మరియు మజీద్ పల్లి అంగన్వాడి సెంటర్లను పరిశీలించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంట ఆలయ ఈఓ మహేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఏఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేయాలి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**ఆత్మకూర్, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** ఆత్మకూర్ మండలం నీరుకుళ్ళ గ్రామం నుండి గౌడ సంఘం నాయకులు 50 కుటుంబలు కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్ ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని, పాత కొత్త తేడా లేకుండా అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పని చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. కష్టపడ్డా ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు.

## పోలీస్ సిబ్బందిచే దర్బార్ నిర్వహించిన ములుగు ఎస్పీ

- సిబ్బంది ఎదురుకుంటున్న సమస్యలపై స్పందించిన ఎస్పీ
- సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ
- ములుగు ఎస్పీ సుధీర్ రామనాధ్ కేకన్



**ములుగు బ్యూరో, డిసెంబర్ 4 (జనంసాక్షి):** ములుగు జిల్లా పోలీస్ అధికారి సుధీర్ రామనాథ్ కేకాన్ జిల్లా స్పెషల్ పార్టీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది సంక్షేమం,భద్రత,ఉద్యోగ కార్యాచరణ వంటి అంశాలపై సమావేశం జరిగింది. స్పెషల్ పార్టీ సిబ్బంది విధుల్లో ఎదుర్కొనే సవాళు ,, ఆపరేషనల్ అవసరాలు, ఫీల్డ్‌లో కలుగు ప్రతికూల పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎస్పి సిబ్బందితో వివరంగా చర్చించారు. అనంతరం సిబ్బంది ఆరోగ్యం, భద్రత, విశ్రాంతి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టినుంచారు. ఎస్పీ సిబ్బందితో మాట్లాడుతూ స్పెషల్ పార్టీ జిల్లా భద్రతలో అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఫీల్డ్ లెవెల్ లో అవసరమైన సహకారం, సౌకర్యాలు అందించడం జరుగుతుంది తగు శిక్షణ మరియు రక్షణ సామగ్రి కల్పించేందుకు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని జిల్లాలో ని సిబ్బంది అందరం ఒకే జట్టుగా పని చేయాలనీ అన్నారు. సిబ్బంది తెలియచేసిన సమస్యలు, అభ్యర్థనలు వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పి హామీ ఇచ్చారు.

## ఫీలింగ్ స్టేషన్ ప్రారంభించిన దుద్దిల్ల శ్రీను బాబు



**మహదేవపూర్, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో వెన్నపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేసినటువంటి ఇండియన్ ఫిల్లింగ్ స్టేషన్ ముడి సరుకు ఇండియన్ ఆయిల్ ను గురువారం రోజున కాంగ్రెస్ పార్టీ టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాబు. మాజీఎంపీపీ కుంభంబాపు రెడ్డి. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్బర్ ఖాన్. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల తల్లుల పట్ల

# రవ్వంత జాలి లేదా?



**నర్సంపేట, డిసెంబర్ 4 (జనం సాక్షి):** వరంగల్ జిల్లా నర్సంపేట కు చెందిన తెలంగాణ అమరవీరుడు తోగటి రాజుకుమార్ చారి తల్లి జయమ్మ. తన దీన పరిస్థితి ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించి తన దీనగాదునకు అండగా నిలవాలని ఆత్మీయ పలకరింపు కావాలని వేడుకుంటుంది. ఈనెల 5 నర్సంపేట పట్టణానికి విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ దీనగాధను తెలుసుకొని అండగా నిలవాలని కోరుతుంది. చెట్టంత కొడుకు ఉద్యమం లో పాల్గొని ఆత్మహుతికి పాల్పడి తమను అనాధలుగా చేయగా కొంత కాలానికి భర్త సదానందచారి కాలం చేశారని పేర్కొన్నారు. కొడుకు మరణంతో భర్త మృతితో బాదలను ఎదుర్కొంటున్నట్లు జయమ్మ తెలిపారు .మరో కోడుకు. అనారోగ్యంతో మంచాన పడిపోయాడని ..గత నలబై సంవత్సరాల నుండి అద్దె ఇంట్లో ఉంటూ కూలి చేసుకుంటూ పూటగడుపుకుంటున్నట్లు ఆమె తెలిపారు. నర్సంపేట కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంగా తనబాధలు వివరిస్తూ తనకు స్వంత భూమి గాని స్వంత జాగ గాని లేవని కనీసం పెన్షన్ కూడా లేక నానా కష్టాలు పడుతూ జీవచ్ఛవంలా బతుకీడుస్తున్నాని కన్నీటి పర్యంతం అయ్యారు. తననుకష్టాల నుండి గట్టెక్కించాలని ముఖ్యమంత్రి ని జయమ్మ వేడుకుంటున్నారు.

## ప్రధానమంత్రి నేషనల్ అప్రెసింటీస్ మేళా

**నస్పూర్ (జనంసాక్షి) :** ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ శ్రీరాంపూర్ ఐటీఐ లో డిసెంబర్8 న ప్రధానమంత్రి నేషనల్ అప్రెసింటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు.మేళ నందు మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటాయని,ఐటిఐ పాసైయిన విద్యార్థిని,విధార్థులు తమ యొక్క సర్టిఫికెట్స్ జిరాక్స్ పత్రాలతో,బయోడెటా ఫామ్ తో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ శ్రీరాంపూర్ నందు డిసెంబర్ 8న ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని,అర్హత కలిగిన వారు **www.apprenticeshipindia.gov.in**లో ముందుగా పేర్లు నమోదు చేసుకోవలని తెలిపారు.

# వెక్కిరిస్తున్న పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యం!

- సామూహిక మూత్రశాలలు నిర్మించారు కానీ నిర్వహణ మరిచారు
- లక్షలాది రూపాయల సొమ్ము వృధా పాలు
- నిర్లక్ష్యపు వైఖరిలో పంచాయతీరాజ్ అధికారులు
- నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా దర్శనమిస్తున్న మరుగుదొడ్లు






**మంగపేట డిసెంబర్ 04(జనంసాక్షి) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాటసారుల కోసం ఏర్పాటుచేసినటువంటి సామూహిక మూత్రశాలలు, మరుగుదొడ్లు పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యపు వైఖరితో నిరుపయోగంగా మారిన దృశ్యాలు మండల కేంద్రంలో దర్శనమిస్తున్నాయి. స్వచ్ఛభారత్ నిధులతో మంగపేట గ్రామపంచాయతీ పరిధిలోగల గంపోనిగూడెం శివారు ప్రాంతంలో అలాగే ఫారెస్ట్ కార్యాలయం ఎదురుగా ఇటీవల మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మించారు. వీటి నిర్మాణం కొరకు ఒక్కొక్క సామూహిక మూత్రశాల, మరుగుదొడ్లకు కలిపి సుమారు 3 నుండి 5 లక్షల రూపాయలు నిధులను కేటాయించడం జరిగిందని సమాచారం. రెండింటికి కలిపి సుమారు 6 నుండి 10 లక్షల రూపాయల నిధులను గ్రామపంచాయతీ అధికారులు కాంట్రాక్టర్ల కు కేటాయించి నిర్మించారు. వీటిని నిర్మించే క్రమంలో సంబంధిత అధికారులు గుత్తేదారులకు నిర్మాణ పనులను అప్పగించడంతో నిర్మాణ పనులను తూతు మంత్రంగానే సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకుండ పనులను పూర్తి చేసి గ్రామపంచాయతీకి అప్పగించినట్లు ప్రజలు ఆరోపించారు. అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణకు ఎటువంటి నీటి సౌకర్యం కల్పించకపోవడంతో నాటి నుండి నేటి వరకు వినియోగంలో లేకపోవడంతో అవి పూర్తిగా నిరుపయోగంగా మారిపోయాయి. ఇలా లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రజలకు మూత్రశాలలు, మరుగు దొడ్లు నిర్మించిన అధికారులకు నీటి సౌకర్యం కల్పించాలని కనీస అవగాహన లేకపోవడం విడ్డూరంగా ఉందంటూ ప్రజలు బహిర్గతంగానే చర్చించుకుంటున్నారు. ఇలా నిర్మించడం ఎందుకు లక్షలాది రూపాయల సొమ్ము వృధా పాలు చేయడం ఎందుకు అని పంచాయతీరాజ్ అధికార తీరుపై ప్రజలు తీవ్రంగా అసహనం వ్యక్తపరుస్తున్నారు.

**నీటి నిర్వహణ లేకపోవడం వాస్తవమే : మంగపేట పంచాయతీ కార్యదర్శి సురేష్...**

మండల కేంద్రంలో బాటసారులకు, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేందుకు గంపోనిగూడెం, ఫారెస్ట్ కార్యాలయం ఎదురుగా స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా సామూహిక మూత్రశాలలు, మరుగుదొడ్ల ను నిర్మించడం వాస్తవమే. కానీ వాటి నిర్వహణలో నీటి సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయని త్వరలోనే వాటి నిర్వహణ కొరకు నీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపడతామని వారు తెలిపారు. అలాగే వాటి శుభ్రత కొరకు సిబ్బందిని కూడా కేటాయిస్తామని వారు తెలిపారు.

## ముమ్మరంగా తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాట్లు

- 9న అన్ని జిల్లాల్లో ఆవిష్కరించేందుకు సన్నాహాలు
- చివరిదశకు చేరుకున్న పనులు
- విగ్రహాలతో కొత్త శోభను సంతరించుకోనున్న కలెక్టరేట్లు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రాష్ట్రంలో తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 9న అన్ని జిల్లాకేంద్రాల్లోని కలెక్టరేట్లలో సిద్ధంగా ఉన్న విగ్రహాలను ఆవిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. డిసెంబర్ 9 మాజీ ప్రధానమంత్రి సోనియాగాంధీ పుట్టిన రోజు కావడం, డిసెంబర్ 9, 2009న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కావడంతో ఈ డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఒకేసారి ఆవిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

33 జిల్లాల కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గత నెలలోనే టెండర్లు ఆహ్వానించింది. మాజీ ప్రధానమంత్రి సోనియా గాంధీ, పుట్టిన రోజు డిసెంబర్ 9న సచివాలయంలో ఏర్పాటు చేసిన విగ్రహం నమూనా లోనే ఈ విగ్రహాలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. 10 అడుగుల ఎత్తులో విగ్రహం, బేస్‌మెంట్ 4 అడుగులు, విగ్రహం కింద ఉండే 2 అడుగుల పీఠంతో కలిపి మొత్తం 16 అడుగుల ఎత్తు ఉండనుంది. ఒక్కో దానికి రూ. 17.5 లక్షల చొప్పున ఖర్చు కానుండగా, 33 జిల్లాలకు రూ. 5.77 కోట్లు అవుతుంది. తెలంగాణ తల్లి విగ్రహాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. గత ఐదారు నెలలుగా విగ్రహాల ప్రతిష్టాపన పనులు ముమ్మరంగా నడుస్తుండగా చివరి దశకు చేరాయి. రాష్ట్ర సంస్కృతిక చిహ్నమైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని గత ఏడాది డిసెంబర్ 9న రాజధాని హైదరాబాద్ లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలోనే 33 జిల్లాల్లోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలోను ఈ నెల 9న తెలంగాణ తల్లి దినోత్సవం సందర్భంగా ఈ విగ్రహాలను ఆవిష్కరించా లని నిర్ణయించినట్లు తెలుస్తుంది. అందుకోసం ప్రస్తుతం పనులు ఊపందుకున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
05 డిసెంబర్ 2025

# ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించకుంటే చర్యలు తప్పవు

- సూర్యాపేట జిల్లా డీఎస్పీ ప్రసన్న కుమార్

**తుంగతుర్తి డిసెంబర్ 4 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి ఎన్నికల ప్రవర్తన విధానాలు గుర్తిరిగి తప్పక పాటించాలని సూర్యాపేట జిల్లా డిఎస్పి ప్రసన్నకుమార్ అన్నారు, గురువారం మండల కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తన విధానాలు)పై పోటీ చేసే అభ్యర్థులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.ఎన్నికల సమయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. గ్రామాల్లో అనవసరంగా చిన్నచిన్న తగాదాలు జరిగిన ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పు అన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో రౌడీ షీటర్ లను గుర్తించామని వారిని బైండోవర్ చేశామని తెలిపారు,ఓటర్లను ప్రలోభపెట్టడం, డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ జరిపినా అందులకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారి అభ్యర్థిత్వాన్ని కూడా రద్దు చేస్తామని అన్నారు, .ప్రచారం సమయంలో అనుమతుల మేరకే మైక్ సెట్లు, వాహనాలు



ఉపయోగించాలని, సోషల్ మీడియాలో కూడా ఉద్రిక్తత కలిగించే పోస్టులు పెట్టరాదని హెచ్చరించారు. అర్హులందరూ నిబంధనలు పాటించి ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని సూచించారు. ఎవరైనా గ్రామంలో సమావేశాలు పెట్టాలన్న, పాదయాత్రలు చేయాలన్న ముందస్తుగా అధికారుల అనుమతి తప్పనిసరి అన్నారు, పర్మిషన్ కోసం స్థానికంగా ఉన్న తాసిల్దార్ సంప్రదించాలని అన్నారు, పర్మిషన్ లేకుండా ప్రచారం చేసిన ఫ్లెక్సీలు కట్టిన ప్రభుత్వ కార్యాలయాలపై అభ్యర్థికి సంబంధించిన వ్రాతలు రాసిన, అనుమతులు లేకుండా ప్రైవేటు గృహాల గోడల మీద రాతలు రాసిన చర్యలు తప్పమన్నారు, సోషల్ మీడియా పై పోలీసుల నిగా ఉంటుందని అసభ్యకరమైన విద్వేషకరమైన పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘ ఉంటుందన్నారు, జిల్లాలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉందని అన్నారు, ఓటింగ్ కేంద్రాల వద్ద టెంటులకు అనుమతి లేదని అన్నారు, ఎన్నికల సహాయ వ్యయ అధికారి ఇందిర మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ద్వారా నిర్ణయించిన ఖర్చులకు మించి పోటీ చేసే అభ్యర్థి ఎన్నికలలో ఖర్చు చేయరాదని అన్నారు, పోటీ చేసే అభ్యర్థి నిర్దిష్ట నమూనాలతో రోజువారి ఎన్నికల వ్యయాన్ని తెలిపే రికార్డును తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు, ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 45 రోజుల లోపల పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తన మొత్తం ఎన్నికల ఖర్చుల వివరాలను స్థానిక ఎంపీడీవోకి సమర్పించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి పై అభ్యర్థులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేషు కుమార్, సీఐ నరసింహారావు, ఎస్సై క్రాంతి కుమార్ తో పాటు వివిధ గ్రామాలలో పోటీచేసే సర్పంచ్ అభ్యర్థులు వార్డు సభ్యుల అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లి సర్పంచ్ అభ్యర్థిగా పసునూరి యుగేందర్ రెడ్డి నామినేషన్



**కొండమల్లేపల్లి, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ప్రజలందరూ ఊహించినట్లుగానే అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కొండమల్లేపల్లి సర్పంచ్ అభ్యర్థిగా పసునూరి యుగేందర్ రెడ్డి గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ ఆశీస్సులతో కొండమల్లేపల్లి గ్రామాన్ని మోడల్ సిటీగా మార్చుతానన్నారు. గ్రామంలోని రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఆధునీకరిస్తానన్నారు. కొండమల్లేపల్లి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రజలందరూ ఆశీర్వదించి మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటితో గెలిపించాలని కోరారు.

## సీఎం సభ మైదానాన్ని పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**దేవరకొండ, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** దేవరకొండలోని పలు అభివృద్ధి పనులలో శంకుస్థాపనలో నేపథ్యంలో ఈనెల 6న పట్టణంలోని మిషన్ కాంపౌండ్ మైదానంలో సీయం రేవంత్ రెడ్డి ప్రసంగించనున్న సభా స్థలాన్ని గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్ తో కలిసి సందర్శించి పరిశీలించారు.సభ నిర్వహణ స్థలం, హెలిప్యాడ్ ను పరిశీలించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రధాన వేదిక, జనం ప్రవేశించే మార్గాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. సభ విజయవంతమయ్యేలా ఇంఛార్జీలకు పలు సూచనలు చేశారు. సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన వారిలో దేవరకొండ నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దు
- గోల్డెన్ హావర్ పై అవగాహన
- ఇల్లందు డీఎస్పీ ఎన్. చంద్రబాను

**టేకులపల్లి, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని ఇల్లందు డిఎస్పి ఎన్ చంద్రబాను సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై విస్తృతంగా వివిధ గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఇల్లందు డిఎస్పి చంద్రభాను, టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ,ఎస్సై ఆలకుంట రాజేందర్ ఆధ్వర్యంలో గురువారం బొమ్మనపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డిఎస్పి మాట్లాడుతూ బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్ నెంబర్లు,ఓటీపీ వివరాలు చెప్పవద్ద న్నారు. ఆశచూపిస్తే వాటికి ఆకర్షితులు కావొద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్1930కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ గురైనట్లయితే ఒక గంట లోపల 1930కి కాల్ చేయడం వలన ఫ్రాడ్ చేసినటువంటి సొమ్ము తిరిగి అందించబడుతుందని దీన్నే గోల్డెన్ అవర్ అంటారు. పోలీసులమని ఫోన్ చేసాం మీ ఖాతా నెంబరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుంది పోలీస్ శాఖ పరంగా మీకు సహాయం చేస్తామని తెలిపిన అటువంటి వాటిని నమ్మవద్దని, మీకు అందుబాటులో ఉన్న బ్యాంకు కు వెళ్లాలని తెలిపారు.పోలీస్ శాఖకు బ్యాంకు ఖాతాల వివరాలు అవసరం లేదని తెలిపారు.మీకు పదేపదే ఫోన్ చేసి విసిగిస్తే మీ అందుబాటులో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఫిర్యాదు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్లకు అన్నోన్ నెంబర్ల నుంచి ఫోన్ చేసి బ్యాంకు లోన్లు



ఇస్తామని నమ్మించడానికి చూసి మన దగ్గర అమౌంట్ లాక్కుంటారని, అటువంటి వాటిని ఎవరూ నమ్మొద్దని తెలిపారు.ప్రతిదీ కూడా సెల్ ఫోన్ తోనే లింక్ ఉండడంతో మన సెల్ ఫోన్ నెంబర్ కూడా మన బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డ్, ఆధార్ కార్డు, పెన్షన్, పౌరసరఫరాల వినియోగానికి సంబంధించి అన్ని విధాలుగా మన సెల్ ఫోన్ నెంబర్ అవసరం ఉంటుందని అన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మనకు ఏదో లేనిపోని ఆశలు చూపించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై ఆలకుంట రాజేందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ యాక్ట్



**కోదాడ, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున కోదాడ పట్టణంలో అధికారుల అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగసభలు నిర్వహించ రాదు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఈనెల 31 వ తేది వరకు 30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదేశానుసారం పోలీసు అధికారుల అనుమతులు లేకుండా కోదాడ పట్టణంలో ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించ రాదని కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ కే. శివశంకర్ తెలిపారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించే విధముగా సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధము. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చర్యలు తప్పవు మరియు బాణాసంచా, డీజే లు ఉపయోగించినచో వారిపై కఠిన చర్యలు ఉంటాయని పట్టణ సీఐ శివశంకర్ పేర్కొన్నారు.

## నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**కొండమల్లేపల్లి, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మూడవ విడత నామినేషన్ల స్వీకరణను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. గుమ్మడవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రంలో నోటిఫికేషన్, నామినేషన్ వేసేందుకు వచ్చే వారికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు రూపొందించిన ఫ్లెక్సీ బ్యానర్, ఆ క్లస్టర్ పరిధిలో గ్రామ పంచాయతీల రిజర్వేషన్లు, డిజిటల్ క్లాక్, తదితర వివరాలను రిటర్నింగ్ అధికారి ద్వారా అడిగి తెలుసుకున్నారు. కుల ధ్రువీకరణ పత్రం డిక్లరేషన్ లో తీసుకున్న పక్షంలో నామినేషన్ల పరిశీలన సమయం వరకు ఒరిజినల్ కుల ధృవీకరణ పత్రం సమర్పించే విధంగా చెప్పాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఏవైనా సందేహాలు వస్తే ఆర్డీఓ లేదా పై అధికారులతో నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వారివెంట అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డిఓ రమణారెడ్డి, తహసిల్దార్ నరేందర్, ఎంపిడిఓ స్వర్ణలత, రిటర్నింగ్ అధికారి పి. సరిత, ఎఆర్వో అంజాచారి, పంచాయతీ సెక్రటరీలు కిరణ్, గిరిజ తదితరులు ఉన్నారు.

# జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక



**కోదాడ, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** తెలంగాణా రాష్ట్ర కబడ్డీ పోటీలకు జూనియర్స్ విభాగం సూర్యాపేట జిల్లా కబడ్డీ బాలుర జట్టు ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు. అల్లం ప్రభాకర్ రెడ్డి, నామా నరసింహ రావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 5నుండి 7 తేదివరకు మహబూబ్ నగర్ లో జరిగే తెలంగాణా రాష్ట్ర 51వ కబడ్డీ పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలు బి సైదులు కెప్టెన్ , బి నరసింహ కె. నరేందర్, బిసాయి, జె.యాకస్వామి, ఎస్.కె. యాసీన్ వై సాయిగౌతమ్ . జావీద్ బి తేజస్. . భరత్ చంద్ర . చంద్ర హరి . ఇమ్రాన్ . చందు దీరజ్, స్టాండ్ బైగాలుగా గౌతమ్,.కొటేష్ ఎంపికైనట్లు వారు తెలిపారు. క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి లో జిల్లా అసోసియేషన్ కు మంచి పేరు సాధించాలని వారు అన్నారు.

# పోస్టల్ బ్యాలెట్‌లను జాగ్రత్తగా జారీ చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** రిటర్నింగ్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ లను జాగ్రత్తగా జారీ చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు.గురువారం జాజిరెడ్డిగూడెం,నాగారం ఎంపిడిఓ కార్యాలయంలో స్టేజ్ 1,2 రిటర్నింగ్ అధికారులతో పంచాయతీ సర్పంచ్, వార్డ్ సభ్యుల ఎన్నికలకు సంబంధించి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మొదటి విడత ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు,సిబ్బంది కొరకు సంబంధిత ఎంపిడిఓ కార్యాలయంలో డిసెంబర్ 6 నుండి 9 వరకు ఫెసిలిటేషన్ సెంటర్ ను ఏర్పాటు చేసి అన్ని మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు.పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి స్టేజి 1 ఆర్ఓలు 37ఏ రిజిస్టర్ లో సర్వీస్ ఓటర్ల వివరాలు నమోదు చేయాలని అన్నారు.స్టేజి 2 ఆర్ఓలు 37సీ రిజిస్టర్ లో ఎన్నికలలో విధులు



నిర్వహించే వారి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు.ఫారం 14తో పాటు సరైన సర్టిఫికెట్స్ జతపరిస్తే మార్క్డ్ కాపీలో మార్క్ చేసి పోస్టల్ బ్యాలెట్ మొదటి నుండి వరస క్రమంలో జారీ చేయాలని సూచించారు.రిటర్నింగ్ అధికారులు సంబంధిత గ్రామపంచాయతీలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అన్ని మౌలిక వసతులు ఉన్నాయో లేవో పరిశీలించాలని అన్నారు.పోలింగ్ తరువాత ఓట్లను కౌంటింగ్ చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామ పంచాయతీలకు 64 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారని,152 వార్డులకు 343 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు.నాగారం మండలంలో 14 గ్రామ పంచాయతీలకు 48 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 132 వార్డులలో 4 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని, 128 వార్డులకు 314 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని కలెక్టర్ కు ఎంపిడిఓలు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీకాంత్, హరి కిషోర్ శర్మ, ఎంపిడిఓలు ఝాన్సీ, భీమ్ సింగ్, ఎంపిఓలు గోపి, సుమలత,రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 280 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- ఆంధ్ర నుండి చత్తీస్‌ఘడ్‌కు అక్రమ రవాణా



**చంద్రుగొండ, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** ఆంధ్రా నుంచి ఛత్తీస్గఢ్ కు గూడ్స్ క్యారియర్ లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని చంద్రుగొండ పోలీసులు పట్టుకున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ కు చెందిన సుమారు 280 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని లారీ డ్రైవర్ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టిన పోలీసులకు లారీ యజమానితో పాటు మరికొందరు వ్యక్తులు కూడా ఉన్నట్లుగా డ్రైవర్ అరుణ్ కుమార్ రాజ్ బార్ తెలిపాడు. రేషన్ బియ్యం తో పాటు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితుని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్కు తరలించినట్లు ఎస్సై శివరామకృష్ణ విలేకరులకు తెలిపారు. ఆపరేషన్ మొత్తం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మార్గదర్శకత్వంలో జూలూరుపాడు సిఐ శ్రీ లక్ష్మీ పర్యవేక్షణలో చంద్రుగొండ పోలీస్ శాఖ సమర్థవంతంగా నిర్వహించి అక్రమ రేషన్ బియ్యం రవాణాను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై శివరామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీస్ శాఖకు తెలియజేయాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి మద్యం అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేస్తాం



**తుంగతుర్తి, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** గ్రామాలలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి అక్రమ మద్యం వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామపంచాయతీ ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ డిప్యూటీ తాసిల్దార్ చిప్పలపల్లి యాదగిరి అన్నారు. గురువారం తుంగతుర్తిలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికలవేళ అక్రమ మద్యం సరఫరా చేస్తూ బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని వారిపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు, ఫ్లయింగ్ స్క్వాడ్ డ్యూటీ లో భాగంగా రావులపల్లి ఎక్స్ రోడ్డు తండ వద్ద బెల్ట్ షాప్ ను చెక్ చేయుచుండగా ఎలాంటి అనుమతులు లేకుండా ఎన్నికల నిబంధనలకు విరుద్దంగా మద్యం అమ్ముతున్న గుగులోతు గోపాల్ వద్ద 9.75 లీటర్ల బీర్లు, 1.08లీటర్ల లిక్కర్ సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు, వెలుగుపల్లి 365 బైపాస్ రోడ్డు లో ఎన్నికల వాహనాన్ని గుర్తించి బైక్ పై వెళ్లుచున్నా ముగ్గురు వ్యక్తులు రోడ్డు పక్కన 5.85 లీటర్ల బీర్లు, 2.73 లీటర్లు సుమారు 8090/-రూపాయల విలువ గల లిక్కరును స్వాదీనం చేసుకొని ఎక్సైజ్ అధికారులకు స్వాదీనం చేసినట్లు తెలిపారు దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గురుస్వామీ, కానిస్టేబుల్ మహేష్, సాయివర్మ, వీడియో గ్రాఫర్ మధు, మహేష్ పాల్గొన్నారు.

# మండలంలో రెండో రోజు ముమ్మరంగా నామినేషన్లు దాఖలు

**కల్లూరు, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** మండలంలో మూడో విడత ఈ నెల 17వ తేదీన జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ, బలపరిచిన అభ్యర్థులు రెండవ రోజు గురువారం ముమ్మరంగా నామినేషన్లు దాఖలు చేశారు. మండల పరిధిలోని పెద్ద కోరుకొండి సర్పంచ్ పదవికి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మాదిరాజు శైలజ టిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి మచ్చ పద్మావతి సర్పంచ్ పదవికి పెద్ద కోరుకొండి రైతు వేదికలో నామినేషన్ కేంద్రంలో నామినేషన్లు దాఖలు చేశారు , పోచవరం సర్పంచ్ గా మాజీ జడ్పిటిసి కట్టా అజయ్ కుమార్ భార్య కట్టా ధనమ్మ తొలిసారిగా రాజకీయాలలోఅడుగుపెట్టి భర్త అడుగుజాడల్లో నడిచేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు నామినేషన్ దాఖలు చేసేందుకు గాను తొలుత తన మామ మధిర మాజీ ఎమ్మెల్యే కట్టా వెంకట నరసయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి చేరుకొని పోచారం నామినేషన్ కేంద్రంలో నామినేషన్ దాఖలు చేశారు అదేవిధంగా మర్లపాడు సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన బండి వీరబాబు తన అనుచరులు 200 మందితో అట్టహాసంగా ర్యాలీగా తరలివచ్చి సర్పంచ్ పదవికి, తన అనుచరులు వార్డు సభ్యుల పదవులకు నామినేషన్ దాఖలు చేశారు.చిన్న కోరుకొండి పంచాయతీ సర్పంచ్ గా స్వర్గీయ యాస రామకృష్ణ సతీమణి యాస భాగ్యలక్ష్మి టిఆర్ఎస్ పార్టీ మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ముగ్గ వెంకటాపురం నామినేషన్ కేంద్రంలో పేరువంచ సర్పంచ్ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కీసర మోహన రెడ్డి, కీసర మధుసూదన్ రెడ్డి వేరు వేరుగా తమ యొక్క అనుచరులతో వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. తాళ్లూరు వెంకటాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ గా సిపిఎం బలపర్చిన టిఆర్ఎస్ అభ్యర్థి నాయుడు వెంకటకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు.చెన్నూరు లోని నామినేషన్ కేంద్రాన్ని కల్లూరు సబ్



కలెక్టర్ అజయ్ యాదవ్ మండలఎన్నికల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వేల్పుల విజేత ఎంపీడీవో చంద్రశేఖర్ తో కలసి పరిశీలించారు. అదే విధంగా హెల్ప్ డెస్క్ ను సందర్శించారు. ముగ్గ వెంకటాపురం నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్, స్థానిక ఎస్సై హరితతో కలిసి పరిశీలించారు. వయోవృద్ధులకు పోలింగ్ కేంద్రం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.




# ఆర్‌బీఐ వడ్డీ రేటు తగ్గేనా?

**ముంబై:**ఆర్‌బీఐ ఎంపీసీ సమీక్షలో రెపో రేటును పావు శాతం తగ్గించొచ్చని రేటింగ్ సంస్థ కేర్‌ఎడ్జ్ అంచనా వేసింది. ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గడంతోపాటు, జీడీపీ వృద్ధి బలంగా కొనసాగుతుండడం రేట్ల కోతకు అనుకూలించొచ్చని పేర్కొంది.ఈ నెల 5న ఆర్‌బీఐ ఎంపీసీ తన నిర్ణయాలను ప్రకటించనుండడం తెలిసిందే. ద్రవ్యోల్బణం దశా బ్ద కనిష్ట స్థాయి అయిన 0.3 శాతానికి అక్టోబర్‌లో తగ్గినట్టు కేర్ ఎడ్జ్ గుర్తు చేసింది.ఆర్‌బీఐ లక్ష్యం అయిన 4 శాతానికి ఇది ఎంతో దిగువన ఉందని, దీంతో పాలసీ రేట్ల తగ్గింపునకు వెసులుబాటు ఉన్నట్టు పేర్కొంది. ప్రస్తుతం రెపో రేటు 5.5 శాతంగా ఉంది. "బ్రెంట్ ముడి చమురు ధరలు స్థిరంగా ఉన్నాయి. రిజర్వాయర్లలో తగినంత నీటి నిల్వలు ఉండడం రబీ సాగుకు అనుకూలం. చైనాలో తయా రీ అధికంగా ఉండడంతో ధరలు పెరిగే ఒత్తిళ్లు



లేవు. ద్రవ్యోల్బణం ఇక్కడి నుంచి గణనీయంగా పెరగకుండా ఇవి సాయపడతాయి"అని తాజాగా విడుదల చేసిన నివేదికలో తెలిపింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 8.2 శాతానికి విస్తరించగా.. ద్వితీయ ఆరు నెలల్లో (క్యూ3, క్యూ4) వృద్ధి రేటు 7 శాతానికి నెమ్మదించొచ్చని కేర్ ఎడ్జ్ అంచనా వేసింది. అమెరికా టారిఫ్‌లు అమల్లోకి రావడానికి ముందుగా చేసిన అధిక ఎగుమతులు, పండుగల అనంతరం వినియోగం తగ్గడం వంటివి వృద్ధి రేటును నెమ్మదింపజేస్తాయని పేర్కొంది.కాకపోతే పూర్తి ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి 7.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం వచ్చే 12 నెలల్లో 3.7 శాతంలోపు ఉండొచ్చని పేర్కొంది. అమెరికాతో వాణిజ్య చర్చలు దీర్ఘకాలం పాటు కొనసాగుతుండడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ.. విదేశీ మారకం నిల్వలు బలంగానే కొనసాగుతున్నట్టు, నవంబర్ మధ్య నాటికి 27 బిలియన్ డాలర్లు పెరిగి 693 బిలియన్ డాలర్లకు చేరినట్టు తెలిపింది.



## మళ్లీ పడిపోయిన రూపాయి

**న్యూఢిల్లీ:**భారత కరెన్సీ రూపాయి పతనం కొనసాగుతోంది. అమెరికా డాలర్‌తో భారత రూపాయి మారక విలువ మళ్లీ పడిపోయింది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం చుట్టూ ఉన్న నిరంతర ఈక్విటీ అవుట్ ఫ్లోలు, అనిశ్చితి కారణంగా డిసెంబర్ 4న రూపాయి 22 పైసలు పడిపోయిం ది.కీలకమైన రూ.90 మార్కును అధిగమించి మునుపటి సెషన్ ను ముగించిన తర్వాత డాలర్‌తో రూపాయి విలువ గురువారం రూ.90.41 వద్ద ప్రారంభమైంది. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పరిమిత జోక్యం కూడా కరెన్సీని ఒత్తిడిలో ఉంచుతుందని నిపుణులు చెబుతున్నారు.

## ఆగ్రో కెమికల్స్‌కు డిమాండ్

ఆగ్రో కెమికల్స్‌కు (వ్యవసాయ సంబంధిత రసాయనాలు) డిమాండ్ అంతర్జాతీయంగా కోలుకుంటుండడంతో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీల ఆదాయం 6-7 శాతం పెరగొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది.అంతర్జాతీయంగా సాగుకు సంబంధించి నెలకొన్న సానుకూల సెంటిమెంట్‌తో ఎగుమతుల ఆదాయం 8-9 శాతం పెరుగుతుందని పేర్కొంది. అధిక వర్షాలతో పంటలు దెబ్బతినడం, ఉత్పత్తులు వెనక్కి రావడం, సాగు సన్నద్ధత వంటి అంశాలు దేశీయ డిమాండ్‌కు సమస్యలుగా ఉన్నట్టు తెలిపింది."రెండు సంవత్సరాల స్థిరీకరణ తర్వాత ఆగ్రో కెమికల్స్ రంగంలో ఆదాయం 2025-26లో 6-7 శాతం పెరగొచ్చు. ఇది కూడా ధరల పెంపు ద్వారా కాకుండా అధిక అమ్మకాల రూపంలో రానుంది"అని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనుజ్ సేతి తెలిపారు. ఇన్వెంటరీలు (స్టాక్ నిల్వలు) కూడా సాధారణ స్థాయికి చేరడం ఆదాయం వృద్ధికి అనుకూలిస్తుందని చెప్పారు.ఇక ఆగ్రోకెమికల్స్ పరిశ్రమ తన దీర్ఘకాల వృద్ధి అయిన 8-10 శాతానికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేరుకోవచ్చని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక అంచనా వేసింది. అయితే, ఎగుమతులు స్థిరంగా



కొనసాగడం, దేశీ డిమాండ్ పుంజుకోవడంపై ఈ వృద్ధి ఆధారపడి ఉంటుందని పేర్కొంది. పరిశ్రమ ఆదాయంలో దేశీ, విదేశీ మార్కెట్లో చెరో సగం వాటా కలిగి ఉన్నట్టు తెలిపింది. ముడి సరుకుల ధరలు స్థిరంగా ఉండడం, అమెరికా టారిఫ్‌ల ప్రభావంతో నిర్వహణ మార్జిన్లు ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఒక శ్రేణి పరిధిలోనే ఉంటాయని అంచనా వేసింది.తక్కువ మూలధన వ్యయాలు, స్థిరమన మూలధన నిధులతో ఆగ్రో కెమికల్ కంపెనీల రుణభారం నియంత్రణల్లోనే ఉంటుందని, దీంతో రుణ పరపతిని మెరుగ్గా కొనసాగొచ్చని క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది. లాక్‌డౌన్ అనంతరం పేరుకున్న నిల్వలు తగ్గిపోవడంతో దేశీయంగా ఆగ్రోకెమికల్స్ ధరలు స్థిరపడినట్టు తెలిపింది.చైనా నుంచి దిగుమతి చేసుకున్న ఆగ్రో కెమికల్స్‌పై కిలోకి 5 డాలర్ల ప్రయోజనం ఒనగూరుతోందని, గతేడాది స్థాయిలోనే ఉందని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ఇదే కొనసాగొచ్చని అంచనా అంచనా వ్యక్తం చేసింది. నిల్వలు తగ్గడం, పర్యావరణ నిబంధనలను కఠినంగా అమలు చేయడంతో సరఫరాలు స్థిరపడతాయని పేర్కొంది."ఆగ్రో కెమికల్స్ కంపెనీల నిర్వహణ మార్జిన్లు 12.5-13 శాతంగా ఉండొచ్చు. అయినప్పటికీ కరోనా ముందున్న 15 శాతం కంటే తక్కువే. 2024లో ప్రతికూలతల అనంతరం ఈ స్థిరత్వం నెలకొంది.



## బంగారం, వెండిపై గుడ్‌న్యూస్

దేశంలో బంగారం, వెండి ధరలు ఎట్టకేలకు దిగివచ్చాయి. క్రితం రోజున ఎగిసిన పసిడి ధరలు నేడు కాస్త ఉపశమనం ఇచ్చాయి. ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు మదుపరులు మొగ్గు చూపుతున్నారు.అందులో భాగంగా బంగారం ధరలలో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. బుధవారంతో పోలిస్తే గురువారం బంగారం ధరలు దిగొచ్చాయి. ఇక ఆగకుండా దూసుకెళ్తున్న వెండి ధరలు క్షీణించాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో కింద చూద్దాం..

## లక్ష చార్జింగ్ పాయింట్లు.. మారుతీ ఫోకస్

ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విభాగంలో అగ్రస్థానంపై కన్నేసిన ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇం డియా తమ చార్జింగ్ నెట్‌వర్క్‌ను పటిష్టం చేసుకుం టోంది.ఇందులో భాగంగా డీలర్ పార్ట్‌నర్లు, చార్జింగ్ పాయింట్ ఆపరేటర్లతో కలిసి 2030 నాటికి దేశవ్యా ప్తంగా లక్ష చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయ నుంది.ఈ-విటారా కారుకి 5 స్టార్ భారత్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్ లభించిన సందర్భంగా కంపెనీ ఎండీ హిసాషి తకెయుచి ఈ విషయాలు తెలిపారు. ఇప్పటికే 1,100 పైగా నగరాల్లోని తమ సేల్స్, సర్వీస్ టచ్‌పా యింట్స్‌వ్యాప్తంగా 2,000 పైగా ఎక్స్‌క్లూజివ్ చార్జింగ్ పాయింట్ల నెట్‌వర్క్‌ను నెలకొల్పినట్లు చెప్పారు.యాప్ తయారీ, దేశవ్యాప్తంగా డీలర్ నెట్‌వర్క్‌లో చార్జింగ్ మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రూ. 250 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు వివరించారు. తమ 'ఈ ఫర్ మి' యా ప్ ద్వారా చార్జింగ్ పాయింట్ల వివరాలను పొందవ చ్చున్నారు. చార్జింగ్ నెట్‌వర్క్ దన్నుతో 2026లో ఈ-వి టారా అమ్మకాలను ప్రారంభించనున్నట్లు వివరించారు.




## ఫ్లాట్‌గా స్టాక్ మార్కెట్లు

**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. రూపాయి బలహీనత, ఎఫ్ఐఐ అమ్మకాల ప్రభావం దలాల్ స్ట్రీట్ లో ఇంకా కొనసాగుతోంది. యూఎస్ డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ క్షీణించడంతో గత కొన్ని రోజులుగా స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి పెరిగింది.స్థిరమైన మూలధన ప్రవాహాలు, యూఎస్ తో వాణిజ్య చర్చలపై నిరంతర అనిశ్చితి, స్థిరమైన డాలర్ డిమాండ్ కారణంగా రూపాయి విలువ నిన్న డాలర్ మార్కుకు 90 వరకు జారిపోయింది.గురువారం ఉదయం 09:31 సమయానికి నిఫ్టీ 8 పాయింట్లు పెరిగి 25,994కు చేరింది. సెన్సెక్స్ 44 పాయింట్లు లాభపడి 85,151 వద్ద ట్రేడవుతోంది.విస్తృత మార్కెట్లలో ఎన్ఎస్ఈ నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ మిశ్రమంగా ఉన్నాయి.హెచ్‌యూఎల్, టైటాన్, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్, ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్సర్వ్, టాటా మోటార్స్ పీవీ, ఎన్టీపీసీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఈ రోజు సెన్సెక్స్ టాప్ లూజర్స్ గా నిలిచాయి. టీసీఎస్, హెచ్సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టెక్ ఎం, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్టెల్ మాత్రమే లాభపడ్డాయి




### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.51 | ₹ 6.53 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,19,500 (22 క్యారెట్లు) | ₹ 1,30,360 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,00,000

# గ్రీన్ ఎకానమీ @ 7 ట్రిలియన్ డాలర్లు

**న్యూఢిల్లీ:**అంతర్జాతీయ గ్రీన్ ఎకానమీ (పర్యావరణ అనుకూల రంగాలు) విలువ 2030 నాటికి వార్షికంగా 7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) అంచనా వేసింది.ఇప్పటికే ఇది 5 ట్రిలియన్ డాలర్లను అధిగమించినట్టు తెలిపింది. భారత్ పునరుత్పాదక విద్యుత్ పరంగా అధిక వృద్ధిని నమోదు చేస్తుందని పేర్కొంది. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్‌తో కలసి రూపొందించిన నివేదికను విడుదల చేసింది.పర్యావరణ అనుకూల ఆర్థిక వ్యవస్థతో ఎన్నో రంగాల్లోని వ్యాపారాలు ప్రయోజనం పొందుతున్నట్టు తెలిపింది. పర్యావరణ అనుకూల పరిష్కారాలను అనుసరిస్తున్న కంపెనీలు లబ్ది పొందుతున్నట్టు వివరించింది. ఆర్థిక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, వైవిధ్యమైన పర్యావరణ పరిస్థితుల్లోనూ గ్రీన్ టెక్నాలజీలపై పెట్టుబడులు గరిష్ట స్థాయిలో కొనసాగుతున్నట్టు పేర్కొంది. సంప్రదాయ వ్యాపార మార్గాల కంటే పర్యావరణ అనుకూల వ్యాపార ఆదాయాలు కలిగిన కంపెనీలు మెరుగైన పనితీరు చూపిస్తున్నట్టు డబ్ల్యూఈఎఫ్ నివేదిక వివరించింది.సంప్రదాయ కంపెనీల కంటే పర్యావరణ



అనుకూల వ్యాపారాల ఆదాయాలు రెండు రెట్లు అధికంగా వృద్ధి చెందుతున్నాయని, అలాగే నిధుల వ్యయాలు కూడా పర్యావరణ అనుకూల వ్యాపార కంపెనీలకు తక్కువగా ఉంటున్నట్టు పేర్కొంది. దీంతో ఈ కంపెనీలు 12-15 శాతం అధిక ప్రీమియాన్ని క్యాపిటల్ మార్కెట్లలో పొందుతున్నట్టు తెలిపింది. దీర్ఘకాలంలో ఈ కంపెనీల లాభాలు బలంగా కొనసాగుతాయన్న నమ్మకం ఇన్వెస్టర్లలో ఉండడమే దీనికి కారణమని వివరించింది.


**పునరుత్పాదక విద్యుత్‌లో భారత్ టాప్**

పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుదుత్పత్తి ప్రపంచ వ్యాప్తంగా ఏటా 9 శాతం పెరుగుతుంటే, 13 శాతం వృద్ధితో భారత్ అగ్రస్థానంలో ఉన్నట్టు డబ్ల్యూఈఎఫ్ నివేదిక వెల్లడించింది. చైనాలో వృద్ధి 12 శాతంగా ఉన్నట్టు తెలిపింది. చాలా ప్రాంతాల్లో ఏటా 10 శాతం వృద్ధి నమోదవుతుందంటూ.. 16 శాతం వృద్ధితో భారత్ ముందుంటుందని అంచనా వేసింది. 15 శాతం వృద్ధితో చైనా తర్వాతి స్థానంలో నిలుస్తుందని పేర్కొంది. 2019 నుంచి 2024 వరకు భారత్, చైనాలో పర్యావరణ అనుకూల ఇంధనాలపై ఏటా 12 శాతం చొ3ప్పున పెట్టుబడులు పెరిగినట్టు వెల్లడించింది. భారత్‌లో పునరుత్పాదక విద్యుదుత్పత్తి విభాగంలో 'రెన్యూ' కంపెనీని ప్రస్తావించింది. దేశవ్యాప్తంగా 28 గిగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని ఈ సంస్థ కలిగి ఉన్నట్టు తెలిపింది.

## భారత దివాలా చట్టం భేష్

**• ఎస్అండ్‌పీ కితాబు • రుణదాతలకు అనుకూలంగా ప్రక్రియ**
**• తగ్గిన పరిష్కార సమయం • పెరిగిన రుణాల రికవరీ రేటు**

**న్యూఢిల్లీ:** భారత్ దివాలా పరిష్కార చట్టానికి (ఐబీసీ) ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ కితాబిచ్చింది.అధికారిక ర్యాంకింగ్ మదింపును సవరించింది. దివాలా పరిష్కార కార్యాచరణ రుణదాతలకు స్నేహపూర్వకంగా ఉండడాన్ని గుర్తించింది. భారత్‌లో దివాలా అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) రుణ క్రమశిక్షణను బలోపేతం చేసిందని, పరిష్కార ప్రక్రియను రుణదాతలకు అనుకూలంగా మార్చిందని ఎస్అండ్‌పీ తన నివేదికలో పేర్కొంది. గతంలో దివాలా పరిష్కార విధానాలకు భిన్నంగా ఐబీసీ కింద సంక్షోభంలోని కంపె నీల ప్రమోటర్లు తమ వ్యాపారాలపై నియంత్రణ కోల్పోతున్నట్టు వివరిం చింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని భారత దివాలా పరిష్కార చట్టానికి అధికారిక ర్యాంకింగ్ మదింపును గ్రూప్-సి నుంచి గ్రూప్-బికి మారుస్తున్నట్టు ప్రకటించింది.రుణదాతలకు స్నేహపూర్వకంగా ఉన్న దివాలా పరిష్కార ప్రక్రియను బలహీనం నుంచి మధ్యస్థానికి మెరుగుపరిచిన నేపథ్యంలో ఈ మార్పు చోటుచేసుకున్నట్టు తెలిపింది. ఐబీసీ కింద రుణదాతల ఆధ్వర్యంలో విజయవంతమైన పరిష్కారాలను పరిగణనలోకి తీసుకున్నట్టు పేర్కొంది. రుణాల వసూళ్లు, రికవరీ రేటు మెరుగుపడ్డాయని.. సగటు రుణ వసూలు గత చట్టం కింద ఉన్న 15-20 శాతం నుంచి ఐబీసీ కింద 30 శాతానికి పెరిగినట్టు తెలిపింది. గతంలో ఒక్కో కేసు పరిష్కారానికి ఆరు నుంచి ఎనిమిదేళ్ల సమయం తీసుకోగా, ఐబీసీ కింద రెండేళ్లకు తగ్గినట్టు ఎస్అండ్‌పీ పేర్కొంది. అధికార ర్యాంకింగ్ మదింపు అన్నది.. ఒక దేశ దివాలా చట్టం కింద రుణదాతలకు ఉన్న భద్రతను సూచిస్తుంటుంది.




## చత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్

చంద్రన్న, బండి ప్రకాశ్ అనారోగ్య కారణాలతో సాయుధమార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవడం లాంటి ఘటనలు మావోయిస్టు పార్టీకి కోలు కోలేని దెబ్బగా మారింది.నాలుగున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన మావోయిస్టు (అప్పటి పీపుల్స్ వార్) ఉద్యమం నేడు తీవ్ర ఒడిదొడుకులకు గురవుతోంది. ఆపరేష్ కగార్ నేపథ్యంలో వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో సతమతమవుతోంది. అత్యంత క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో అనేకమంది పార్టీ అగ్రనేతలే ఉద్యమాన్ని వీడుతున్నారు. ఇన్నాళ్లు మావోయిస్టుల్ని అక్కున



చేర్చుకున్న దండకారణ్యంలో మనలేని పరిస్థితులు ఉండటంతో అగ్రనేతలు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు.పార్టీలో కీలకంగా ఉన్న మరికొందరు సైతం ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ప్రణాళికలను రూపొందించుకున్నట్లుగా తెలుస్తోంది. కొంతకాలంగా మావోయిస్టు పార్టీకి ఎదురవుతున్న గడ్డు పరిస్థితుల నేపథ్యంలో ఉద్యమంలో పురోగమించే అవకాశం లేదని గ్రహించిన నేపథ్యంలోనే ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ముఖ్యంగా అబూజ్‌మడ్ గుండెకోట్‌లో మే 21న పార్టీ ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ అలియాస్ నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన అనంతరం శ్రేణుల్లో తీవ్ర నిరాశ నెలకొంది.


# హైజాకర్‌కు పైలట్ ఝలక్

**జుబా:** అది దక్షిణ సూడాన్ రాజధాని జుబా.. ఉదయపు వేళ ఒక చిన్న విమానం మెల్లగా గాల్లోకి లేచింది. అది క్రైస్తవ సహాయక బృందానికి చెందిన చిన్న టర్బోప్రాప్ విమానం.సమారిటన్స్ పర్స్ అనే సంస్థకు చెందిన సెస్నా గ్రాండ్ కారవాన్. సుదూర ఈశాన్య ప్రాంతంలోని మైవుట్ కౌంటీకి అత్యవసర వైద్య సామగ్రిని చేరవేయడమే దాని లక్ష్యం. కానీ ఆ ప్రయాణం ఊహించని భయానక మలుపు తీసుకోబోతోందని ఎవరికీ తెలియదు.టేకాఫ్ కావడానికి ముందే, విమానంలోకి యాసిర్ మహ్మద్ యూసుఫ్ అనే దుండగుడు చొరబడ్డాడు. వెనుక క్యాబిన్‌లో రహస్యంగా దాక్కున్నాడు. గగనతలంలో విమానం ప్రయాణిస్తుండగా, ఒక్కసారిగా తుపాకీతో బెదిరించి, పైలట్‌ను అదుపులోకి తీసుకున్నాడు. ఆ విమానాన్ని దక్షిణ సూడాన్‌కు సరిహద్దు లేని మధ్య ఆఫ్రికా దేశం చాడ్‌కు పోనివ్వాలని డిమాండ్ చేశాడు.హైజాక్ తర్వాత, విమానం గంటల తరబడి గాల్లో చక్కర్లు కొట్టింది. విమానంలో ఇంధనం అయిపోయిందని, రీఫ్యూయలింగ్ తప్పనిసరి అని దుండగుడికి పైలట్ స్పష్టం చేశాడు. హైజాకర్‌ను నమ్మించి, విమానాన్ని ఉత్తర పట్టణమైన వాయు వైపు మళ్లించాడు.పైలట్ వ్యూహం ఫలించింది. విమానం వాయు పట్టణంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. వాయు పట్టణం ఉన్న వెస్టన్ బహర్ ఎల్ గజల్ రాష్ట్ర పోలీసు ప్రతినిధి అయిన సంతినో ఉడోల్ మయెన్ తెలిపిన వివరాల ప్రకారం, విమానం ల్యాండ్ అయిన వెంటనే దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. దుండగుడు దక్షిణ సూడాన్, సూడాన్ మధ్య వివాదాస్పదమైన, చమురు-సంపన్న ప్రాంతమైన అబ్యేయి అడ్మినిస్ట్రేటివ్ ఏరియా నివాసి.జుబా అంతర్జాతీయ విమానాశ్రయంలో పనిచేసే ఒక ఎయిర్ చార్టర్ కంపెనీ లోగో ఉన్న రిఫ్లెక్టివ్ వెస్ట్‌ను ధరించి ఉన్నాడు. అయితే, ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పాల్ ఆంట్రోబస్, ఆ పేరుతో తమ సంస్థలో ఎవరూ పని చేయడం లేదనడం గమనార్హం. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. తమను కాపాడిన భద్రతా దళాలకు సమారిటన్స్ పర్స్ ప్రతినిధి మెలిస్సా స్ట్రిక్‌ల్యాండ్ కృతజ్ఞతలు తెలిపారు.




# స్మార్ట్‌ఫోన్ ముట్టని పుతిన్..

న్యూఢిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రపంచంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత కలిగిన నాయకుల్లో ఒకరు. ఆయన ప్రతి కదలికలోనూ నిరంతర నిఘా ఉంటుంది.ఆయన చుట్టూ ఉండే 'భద్రతా వలయం' ఎప్పుడూ చర్చనీయాంశమే. డిసెంబర్ 4, 5 తేదీల్లో పుతిన్ భారతదేశ పర్యటనకు రానున్న నేపథ్యంలో, ఆయన భద్రతా ఏర్పాట్లు మరోసారి వార్తల్లో నిలిచాయి. ఇంతటి పటిష్టమైన భద్రత మధ్య, ఆధునిక సాంకేతికతకు దూరంగా ఉండే పుతిన్ నిజంగా స్మార్ట్‌ఫోన్ ఉపయోగిస్తారా? అనే ప్రశ్న ఆసక్తి కలిగిస్తుంది.పుతిన్ స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉంటారని ఏఎఫ్‌పీ న్యూస్ నివేదించింది. 2018లో శాస్త్రవేత్తలతో జరిగిన ఒక సమావేశంలో అందరి జేబుల్లో స్మార్ట్‌ఫోన్‌లు ఉన్నాయని ఒక ప్రతినిధి ప్రస్తావించగా పుతిన్ వెంటనే స్పందిస్తూ, 'నా దగ్గర స్మార్ట్‌ఫోన్ లేదు' అని స్పష్టంగా చెప్పారు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ కూడా ధృవీకరించారు. 'స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించడం అనేది ఆ వ్యక్తి గోప్యత, భద్రతను ప్రమాదంలో పడేస్తుంది. ఇది ముఖ్యంగా ఉన్నత స్థాయి నేతలకు గొప్ప ప్రమాదాన్ని కలిగిస్తుంది' అని పెస్కోవ్ స్పష్టం చేశారు. పుతిన్ తన అధికారిక నివాసమైన క్రెమ్లిన్ లోపల మొబైల్ ఫోన్‌లను పూర్తిగా నిషేధించారని కూడా చెబుతారు. ఆయన ఎవరితోనైనా సంభాషించాలంటే అధికారిక (సురక్షితమైన) ఫోన్ లైన్‌ను ఉపయోగిస్తారు.పుతిన్ ఆధునిక సాంకేతికతపై అనాసక్తిని చాలాసార్లు వ్యక్తం చేశారు. 2017లో పాఠశాల పిల్లలతో మాట్లాడినప్పుడు, తాను ఇంటర్నెట్‌ను చాలా అరుదుగా ఉపయోగిస్తానని తెలిపారు. అంతేకాదు ఆయన ఇంటర్నెట్‌ను విమర్శిస్తూ, అది 'సెంట్రల్ ఇంటెలిజెన్సీ ఏజెన్సీ (సీఐఏ)కి చెందిన ప్రత్యేక ప్రాజెక్ట్. అందులో సగం అశ్లీలత ఉంటుందని వ్యాఖ్యానించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఇంటర్నెట్‌కు అనుసంధానించే ఎలాంటి పరికరాలను లేదా గాడ్జెట్‌లను పుతిన్ విశ్వసించరు. మొబైల్ ఫోన్‌లకు ఆయన దూరంగా ఉండటమే కాకుండా, ఎప్పుడైనా అలాంటి పరికరాలు తనదగ్గరకు తీసుకువస్తే వాటిని దూరం పెట్టాలని ఆదేశిస్తారు. ఈ చర్యలన్నీ ఆయన తన భద్రత, సమాచార గోప్యతకు ఇచ్చే అత్యున్నత ప్రాధాన్యతను స్పష్టం చేస్తాయి.



# కాంగ్రెస్‌లో చేరిన ఉటూరు బీఆర్ఎస్ నేతలు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 04(జనంసాక్షి):** మానకొండూర్ మండలం ఉటూరు గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కుటుంబంలో సభ్యులవడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి తిరోగమన దిశగా సాగిందని, అవినీతి, అక్రమాలతో రాష్ట్ర ఖజానాకు తూట్లు పొడిచారని ఆరోపించారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పాలనను గాడీలో పెట్టిందన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడుపుతున్నదన్నారు. అన్ని రంగాలను అభివృద్ధి పర్చాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతూ పారదర్శక పాలన అందిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసేదే చెబుతుందని, చెప్పేదే చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతోపాటు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నదని, ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కొత్త రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేయడమే కాకుండా రేషన్ కార్డులపై దొడ్డు బియ్యానికి బదులుగా సన్న బియ్యం సరఫరా చేస్తున్నదని ఆయన చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గూడు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కలగా మారగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఇస్తూ వారి సొంతింటి కలను సాకారం చేస్తున్నదన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఆయన కోరారు. గ్రామ అభివృద్ధిలో పంచాయతీ ఎన్నికలు కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సర్పంచులుగా కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. మనోళ్లను గెలిపించుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి ఎక్కువ నిధులు మంజూరు చేయించుకోవడానికి అవకాశాలుంటాయన్నారు. అంతే కాకుండా ఎమ్మెల్యేగా తన సహకారం ఎలాగూ ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్న వారిలో ఎనగందుల మల్లయ్య, బక్కయ్య, శంకర్, రాజు, కల్వల అంజయ్య, బొల్లం సంధ్య, కె.అంజయ్య, జినుక అంజయ్య, అంతడ్పుల అనిల్,సాగర్, ఎనగందుల శ్రీకాంత్, విజయ్, మహేశ్, శివనాథ్, ఆర్.నరేష్, కె.నరేష్, రాజేశ్, హన్మంతు, రమేశ్, శ్రీనివాస్, అరవింద్, శ్రీనివాస్, చందు, సంపత్, వెంకటేష్ అంజి, రంగయ్య, రాజేందర్, వంశీ, దాసరి ఆదిత్య, కె.నర్సింహారెడ్డి, చంద్రయ్య, మఝు. నీరటి సంపత్, రామడుగు రమేశ్, పుట్ట తిరుపతి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఊటూరు గ్రామశాఖ అధ్యక్షుడు బొంగోని సునిల్ గౌడ్, పార్టీ నాయకులు గోపు శ్రీనివాస్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, ఆ గ్రామ సర్పంచ్ అభ్యర్థి వెలిశెట్టి కళ్యాణి-కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కరాటే పోటీల్లో మెరిపించిన కోటా కాలేజ్ విద్యార్థిని రిషిక

- కుమితేలో వెండి - కటాలో కాంస్యం
- అభినందించిన కోట జూనియర్ కళాశాలల చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి



**కరీంనగర్, డిసెంబర్ 04 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నవంబర్ 27 నుంచి 30 వరకు ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కరీంనగర్ కోటా కాలేజీ విద్యార్థిని కె.రిషిక ప్రతిభతో మెరిశారు. జూనియర్స్ 16%-%18 ఏళ్ల విభాగంలోని కుమితే (ఫైట్) స్పర్థలో రిషిక ద్వితీయ స్థానం సాధించి వెండి పతకం గెలుచుకోగా, కటా విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఉపాధ్యాయుల శిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఫలితంరిషిక ప్రదర్శన పై కాలేజ్ నిర్వాహకులు, అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ, కఠిన సాధన, కోచ్‌ల మార్గదర్శకాలు ఆమె విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. వరుసగా జాతీయ స్థాయిలో రాణించడం రిషిక భవిష్యత్తు క్రీడా ప్రస్థానానికి దోహదపడుతుందన్నారు. గురువారం నిర్వహిం చిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో కోటా జూనియర్ కళాశాలల చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి మాట్లాడుతూ... జాతీయ స్థాయి వేదికపై మా విద్యార్థిని రిషిక ఇంత కీలకమైన విజయాన్ని సాధించడం ఎంతో గర్వకారణమని, కోటా రెసొనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అకడెమిక్స్‌తో పాటు క్రీడల్లోనూ తమ సామర్థ్యాన్ని రుజువు చేస్తున్నారు. రిషికలాంటి ప్రతిభావంతుల కోసం అవసరమైన అన్ని సదుపాయాలు, శిక్షణ కాలేజ్ తరపున అందిస్తూనే ఉంటాం అన్నారు. రిషికను శాలువాతో సన్మానించి, తదుపరి పోటీలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, క్రీడా విభాగాధికారులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 4 (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలంలోని అనుపురం, బోయినపల్లి మండలంలోని మానువాడలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ 2389, సాధారణ రకానికి రూ 2369 గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి,మద్దతు ధర పొందాలన్నారు.తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు



### కరీంనగర్ జిల్లాలో పంచాయతీ

# ఎన్నికలకు పటిష్ట భద్రత

**సీపీ గౌష్ ఆలం స్వయంగా పర్యటన.. సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు బలగాలు**



**కరీంనగర్, డిసెంబర్ 4 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లాలో మూడు దశలుగా జరగబోతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను అత్యంత శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు కమిషనర్ గౌష్ ఆలం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో గురువారం స్వయంగా బయలుదేరి వీణవంక, జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, సైదాపూర్ మండలాల్లోని నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. చల్లూరు, మామిడాలపల్లి, జగ్గయ్యపేట, వల్భాపూర్, నాగంపేట, టేకుర్తి, పెద్దపాపయ్య పల్లి, చిన్నపాపయ్యపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఆయన సుదీర్ఘంగా తనిఖీ చేశారు. పోలింగ్ రోజున ఈ కేంద్రాలకు అదనపు బలగాలు మోహరించి, రౌండ్ ది క్లాక్ నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలను పూర్తిగా సీసీ కెమెరాలతో కవర్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో గతంలో నేర చరిత్ర ఉన్నవారిని బైండోవర్ చేస్తున్నట్టు సీపీ తెలిపారు. పలువురు రౌడీషీటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. "శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం కలిగిస్తే వెంటనే కేసులు పెట్టి జైలుకు పంపుతాం" అని స్పష్టంగా హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రజలు పోలీసులకు సంపూర్ణ సహకారం అందించాలని సీపీ గౌష్ ఆలం కోరారు. ఈ పర్యటనలో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, కరుణాకర్, రామకృష్ణ, ఎస్సైలు ఆవుల తిరుపతి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



**జమ్మికుంట, డిసెంబర్ 4 (జనం సాక్షి):** జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్- పోత్కపల్లి రైల్వే స్టేషన్ల మధ్య తనుగుల గ్రామ నివాసి జెక్కె రజనీకాంత్ వయసు 31 సంవత్సరాలు అనునతడు గురువారం ఉదయం ఎగువ రైలు పట్టాల మధ్య పడి మృతి చెందాడు. మృతుడి తల్లి జెక్కె రమ తెలిపిన వివరాల ప్రకారం ఇతడు కూలి పని చేస్తూ జీవనం కొనసాగించేవాడని,సుమారు ఒక సంవత్సరం నుండి అనారోగ్యంతో బాధపడుతుండగా అతనిని భూత వైద్యుని దగ్గరికి తీసుకెళ్లి చూపించిన ఆరోగ్యం బాగుపడకపోవడంతో మనస్థాపం చెంది గురువారం ఉదయం ఏదో ఒక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని చనిపోయి ఉంటాడని తెలిపారని రామగుండం ప్రభుత్వ రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపారు.ఇట్టి కేసును దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

### అటవీ భూముల ఆక్రమణ

# ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దు

- పోడు భూములలో 11 కేవి లైన్ ఇన్సులేషన్‌కు ప్రతిపాదనలు
- వైల్డ్ లైఫ్ సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి
- కోతుల సమస్య పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలి
- అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, డిసెంబర్ 4 (జనం సాక్షి) :** జిల్లాలోని అటవీ భూముల ఆక్రమణకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి కాల్వల నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల సేకరణ నిమిత్తం అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూ కేటాయింపు కోసం గిరిజన కార్పోరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న 100 ఎకరాలు బదిలీ చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. భూమిని గుర్తించి 15 రోజులు గడిచినప్పటికీ ఎటువంటి పురోగతి లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన కార్పొరేషన్ సొసైటీ భూములకు సంబంధించి ప్రత్యేకంగా సర్వేయర్ లను కేటాయించి భూముల సర్వే వెంటనే చేపట్టాలని, సోమవారం నాటికి 100 ఎకరాల భూమి సిఏ కోసం బదలాయింపు ప్రక్రియ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. పోడు భూముల పట్టా పొందిన కొంత మంది రైతులను మభ్యపెట్టి సమీపంలో ఉన్న అటవీ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందుతుందని, రెవెన్యూ శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఇంచు అటవీ భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.

వైల్డ్ లైఫ్ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ జంతువులను వేటాడితే 25 వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. పోడు భూముల పట్టా ఉన్నవారు ఎవరైనా అడవి జంతువుల వేటకు పాల్పడిన, అటవీ భూముల ఆక్రమణకు ప్రయత్నించిన గతంలో జారీ చేసిన పట్టా రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ ప్రాంతంలో పోడు భూములలో 11 కేవి లైన్ లలో ప్రాధాన్యత క్రమంలో ఇన్సులేట్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు.

నీలాద్రి అర్బన్ పార్క్ పక్కన ఉన్న సింగరేణి కాలరీస్ బ్లాస్టింగ్ సమయంలో జింకలు పార్క్ కాంపౌండ్ దూకి రోడ్డు పైకి వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయని, పార్క్ కాంపౌండ్ వాల్ ఎత్తును వీలైనంత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ఎఫ్.ఆర్.ఓ. దగ్గర ఉండి అవసరం మేరకు నిర్మాణ పనులు జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. నీలాద్రి, వెలుగుమట్ల, పులిగుండాల అర్బన్ పార్క్ లను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. యువత, పిల్లలను ఆకర్షించేలా అర్బన్ పార్క్ లో జంతువులను ఏర్పాటు చేయాలని అన్నారు. నైట్ సఫారీ ఏర్పాటు అవకాశాలు పరిశీలించాలని అన్నారు.

అటవీ ప్రాంతంలో జరిగే నిర్మాణాలలో తప్పని సరిగా డ్యూరబుల్ పరికరాలు వినియోగించాలని అన్నారు. గ్రామం నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు కోతుల సమస్య ఉందని అన్నారు. రోడ్డుపై ఎక్కడ కూడా కోతులకు ఆహార పదార్థాలు ఇవ్వవద్దని, దీనికి సంబంధించి అవగాహన కార్యక్రమాలు, బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ గిరిజనులు సాగుచేసే భూములకు ప్రభుత్వం అందించిన పోడు పట్టాలు ఎట్టి పరిస్థితుల్లో విస్తరించడానికి వీలు లేదని, పోడుపట్టాల్లో సమీపంలో ఉన్న అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్వోఎఫ్ఆర్ భూముల బండ్ లపై ఉపాధి హామీ క్రింద గచ్చకాయ ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లా నుంచి వెట్ ల్యాండ్ లను గుర్తించి వాటి సంరక్షణకు నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మొదటి విడత చింతకాని మండలంలో తుమ్మలమ్మ చెరువు వద్ద వెట్ ల్యాండ్ గుర్తించామని, దీని సంరక్షణకు నోటిఫికేషన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రెండవ విడతలో జిల్లాలో కనీసం 100 వెట్ ల్యాండ్ గుర్తించి నోటిఫికేషన్ జారీ చేయాలని, వెట్ ల్యాండ్ వద్ద ఎక్కడైనా పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటే 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ వస్తుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వెట్ లాండ్స్ లను ప్రభుత్వ శాఖలకు, అసైన్మెంట్ కు కేటాయించిన వివరాలను గ్రామాల వారీగా అందించాలని అన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, వ్యవసాయ, హార్టికల్చర్, అగ్నిమాపక, విద్యుత్, మైన్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పంచాయతీ రాజ్, గ్రౌండ్ వాటర్, సింగరేణి అధికారులు, తహసిల్దార్‌లు, ఎఫ్ఆర్ఓలు, అధికారులు, లు పాల్గొన్నారు.

**నిజామాబాద్ బ్యూరో :**
గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలు కలిగిన అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

# ఎన్నికల విధులను అప్రమత్తతతో నిర్వహించాలి

**కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్ బ్యూరో, డిసెంబర్ 4 జనంసాక్షి :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలు కలిగిన అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటి విడతలో ఈ మండలానికి ఈ నెల 11న పోలింగ్ ప్రక్రియ జరుగనుండగా, నామినేషన్ల స్వీకరణ నుండి మొదలుకుని ఇప్పటివరకు పూర్తి చేసిన ప్రక్రియలు నిబంధనలకు అనుగుణంగా జరిగాయా, పోలింగ్ నిర్వహణ కోసం చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ ఎం.పీ.డీ.ఓ, తహసిల్దార్ ఇతర అధికారులతో సమీక్ష జరిపారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఓటింగ్ కు అవసరమైన ఎన్నికల సామాగ్రి సిద్ధంగా ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్, ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం తదితర ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న వారితో పాటు, భద్రతా బలగాలలో కొనసాగుతున్న సర్వీస్ ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునేలా నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం మార్గదర్శకాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షలో ఎం.పీ.డీ.ఓ శంకర్, తహసిల్దార్ దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

# థాయ్‌లాండ్‌లో బందీలుగా భారతీయ యువత

- నకిలీ ఉద్యోగాల పేరుతో థాయ్‌లాండ్ మయన్మార్ సరిహద్దు ప్రాంతాల్లో మోసం
- అమాయకులతో సైబర్ నేరాలు చేయిస్తున్న ముఠాపై కఠిన చర్యలు చేపట్టండి
- నిబంధన 377 కింద అత్యవసరంగా పార్లమెంట్లో లేవనెత్తిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి



**నిజామాబాద్ , డిసెంబర్ 4 (జనం సాక్షి) :** నకిలీ ఉద్యోగాల ఆశ చూపి తెలుగు రాష్ట్రాల యువతను థాయ్‌లాండ్‌కు తరలించి, అక్కడి నుంచి మయన్మార్ సరిహద్దు ప్రాంతాల్లోని సైబర్ నేర శిబిరాలకు బందీలుగా అమ్మేస్తున్న దారుణాలపై నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ గురువారం లోక్‌సభలో నిబంధన 377 కింద అత్యవసరంగా ప్రస్తావించి కేంద్రాన్ని కదిలించారు.ఏజెంట్లు "థాయ్‌లాండ్‌లో భారీ జీతం ఉద్యోగాలు" అంటూ లక్షల రూపాయలు వసూలు చేసి యువకులను ఆ దేశానికి పంపుతున్నారని, అక్కడికి చేరగానే పాస్‌పోర్టులు లాగేసుకుని మయన్మార్‌లోని మయావడ్డి వంటి తిరుగుబాటు ప్రాంతాల్లోని చీకటి గదుల్లో బందీలుగా బంధిస్తున్నారని అర్వింద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ శిబిరాల్లో భారతీయ యువకులను కొరడాతో కొట్టి, ఆహారం లేకుండా చేసి, బెదిరించి సైబర్ మోసాలు చేయిస్తున్నారని, రక్షణకు వచ్చే స్థానిక మిలీషియా, సైనికులు లంచాలు తీసుకుని సహకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. నిజామాబాద్ నియోజకవర్గం నుంచే పలువురు యువకులు ఈ ముఠాకు బలై ప్రస్తుతం అక్కడ చిక్కుకుపోయి ఉన్నారని, వారి కుటుంబాలు తనకు రోజూ ఫిర్యాదు చేస్తున్నాయని అర్వింద్ పేర్కొన్నారు. వెంటనే చిక్కుకున్న భారతీయులను రక్షించి స్వదేశానికి తిరిగి రప్పించాలని, భారత్‌లోని ఏజెంట్లు, రిక్రూటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా వెనుకబడిన జిల్లాల్లో విదేశీ ఉద్యోగ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు.తెలుగు రాష్ట్రాల నుండి ముఖ్యంగా యువతను థాయ్‌లాండ్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి, ఏజెంట్లు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, అక్కడికి చేరిన వెంటనే వారి పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకుని, మయన్మార్‌లోని మయావడ్డి వంటి తిరుగుబాటు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న సైబర్ నేర శిబిరాలకు విక్రయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బాధితులకు తీవ్రమైన హింస, ఆహారం ఇవ్వకపోవడం, చీకటి గదుల్లో నిర్బంధం వంటి దారుణాలు ఎదురవుతున్నాయని కుటుంబాలు తమకు సమాచారం అందించాయని తెలిపారు.ఈ నేరాలకు స్థానిక మిలీషియా, సైన్యంలో కొందరు లంచాలు తీసుకుని సహకరిస్తున్నందున రక్షణ చర్యలు మరింత కష్టతరం అవుతున్నాయని శ్రీ అర్వింద్ ధర్మపురి ఆందోళన వ్యక్తం చేశారు. నిజామాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు కూడా ఈ ముఠాకు బలి అయ్యి ప్రస్తుతం అక్కడే చిక్కుకుపోయి ఉన్నారని చెప్పారు.

ఈ పరిస్థితిని అత్యవసరంగా పరిగణించి, చిక్కుకున్న భారతీయులను రక్షించి, తిరిగి స్వదేశానికి రప్పించే చర్యలు చేపట్టాలనిబీ ముఖ్యంగా వెనుకబడ్డ జిల్లాల్లో విదేశీ ఉద్యోగ మోసాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలనిబీ ఈ నేరాలకు సహకరిస్తున్న భారతీయ ఏజెంట్లు, రిక్రూటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



# కేంద్ర మంత్రి గడ్కరీతో ఎంపీ వద్దిరాజు భేటీ

**ఖమ్మం( జనం సాక్షి) :** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు.ఎంపీ రవిచంద్ర గురువారం సాయంత్రం పార్లమెంట్ ప్రాంగణంలోని గడ్కరీ ఛాంబరులో ఆయన్ను కలిసి తెలంగాణలో తెలంగాణలోని ప్రధానమైన రోడ్ల విస్తరణ, అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ వినతిపత్రం అందజేశారు.

### జాతీయస్థాయి జంబూరి క్యాంపు స్కౌట్స్ అండ్ గైడ్స్

# పారమిత విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్ ప్రధానం

- పారమిత పాఠశాలల అధినేత డా.ఇ. ప్రసాదరావు మెరిట్ సర్టిఫికెట్స్ ప్రధానం



**కరీంనగర్, డిసెంబర్ 04 (జనంసాక్షి) :** నవంబర్ 23 నుండి 29 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో నిర్వహించిన 19వ జాతీయ స్థాయి జంబూరి క్యాంపులో 10 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారని పారమిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. జాతీయ స్థాయి జంబూరి క్యాంపులో భాగంగా నవంబర్ మాసంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో "వికసిత్ యువ - వికసిత్ భారత్" అనే నినాదంతో నిర్వహించిన జంబూరి క్యాంపుకు కరీంనగర్ జిల్లా నుండి 18 మంది విద్యార్థులను ఎంపిక చేయగా అందులో పారమిత పాఠశాల నుండి 9 వ తరగతి చదువుతున్న పి.శ్రీనిక, పి. శ్రీజై 8వ తరగతి చదువుతున్న అర్ దివిజ, పి.వర్షిక, కె. శ్రీహిత, ఎమ్. సాన్విక, కె. కీర్తి చైతన్య, ఎమ్. తనుశ్రీ , సి.హెచ్. సమర్ధ్, కె. రాజేష్ లు గైడ్ కెప్టెన్ రజిత ఆద్వర్యంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరిగిన జంబూరి క్యాంపుకు ఎంపిక కావడం జరిగింది. క్యాంప్ లో భాగంగా వారం రోజులపాటు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్, జానపద నృత్యాలు, బి. పి. ఎక్సర్సయిజ్, క్యాంప్ క్రాఫ్ట్, రంగవల్లి, డ్రాయింగ్, శారీరక సామర్థ్య పరీక్షలు మొదలగు పోటీలలో పాల్గొన్నారు. ఇట్టి పోటీలలో పాల్గొని విజయాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు పాఠశాలలో జరిగిన అభినందన సభలో పాఠశాల అధినేత డా.ఇ. ప్రసాదరావు మెరిట్ సర్టిఫికెట్స్ ప్రధానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనుకర్ రావు, వినోద రావు, వి. యు.యం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజి, కవిత సమన్వయ కర్త శ్రీనాథ్, గైడ్ కెప్టెన్ రజిత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను అభినందించారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

తెలియజేయునది ఏమనగా నేను అనగా **మహమ్మద్ పాస్యుద్దీన్ తండ్రి పైముద్దీన్** అను నేను 17వ బెటాలియన్ పోలీస్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగరీత్యా కరీంనగర్ జిల్లా, రాజన్న సిరిసిల్ల మండలం, సిరిసిల్ల రెడ్డివాడలో వెంకటేశ్వర దేవాలయ రోడ్డు, ఇంటి నం. 4-4-50 నివాసం ఉంటూ, చంద్రం పేటకు ఇంటిని మారుస్తున్న సమయంలో నా పాస్‌పోర్ట్ **J8979439, issued Date 21.10.2011** నంబర్ గలది ఎక్కడో పడి పోయింది. ఎంత వెతికిన దొరకలేదు. పాస్ పోర్ట్ ఎవరికైనా దొరికి ఉంటే దయచేసి క్రింది చిరునామా లేదా మొబైల్ నంబర్‌కు సంప్రదించి తిరిగి ఇవ్వగలరని మనవి చేస్తున్నాను. **ఇంటి నం: 2-6-326/108, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, కరీంనగర్. మొబైల్ నంబర్: 94949 78601**



# సహకార సంఘాల్లో బహుళ ఆర్థిక సేవలు

- పైలట్ ప్రాజెక్టుగా మూడుచింతపల్లి సహకార శాఖ సంఘంలో ప్రాయోజిత సేవలు
- త్వరలో మరో 9 సహకార సంఘాల ద్వారా సేవలకు చర్యలు



**9 సహకార సంఘాలలోనూ సేవలు**

నగర శివారు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పది సహకార సంఘాలు (పీఏసీ/ ఎఫ్ఎస్సీఎస్) ఉండగా, ఇందులో 35,954 మంది సభ్యులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 311 సహకార సంఘాల్లో ప్రజలకు ప్రాయోజిత సేవలను అందుబాటులోకి తేచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మరో 9 సహకార సంఘాల ద్వారా ప్రాయోజిత సేవలను అందించే దిశగా ఏర్పాట్లు చేస్తోంది. మేడ్చల్ జిల్లాలో ఘట్కేసర్, కీసర, శామీర్పేట, అల్వాల్, పూడూరు, మేడ్చల్, డబుల్ పూర, బౌరంపేట, దూలపల్లి సహకార సంఘాల ద్వారా ప్రజలకు సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 04 (జనంసాక్షి):** సహకార సంఘాల ద్వారా ప్రజలకు ప్రాయోజిత సేవలు అందిం చేందుకు ప్రభుత్వం చర్యలుతీసుకుంటోంది. అర్బన్ ప్రాంతంగా అభివృద్ధి చెందిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మూడుచింతపల్లి సహకార సంఘాన్నీ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన జిల్లా సహకార శాఖ తద్వారా ప్రజలకు సంబంధిత ప్రాయోజిత సేవలను అందిస్తోంది . సహకార సంఘాల ద్వారా ప్రజలకు పలు రకాల సేవలు అందించడమే లక్ష్యంగా ఇటీవల డీసీసీబీ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహ కార పరపతి సంఘాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు కూడా శిక్షణ ఇచ్చారు

**మెరుగైన సాంకేతిక**

సేవలు పెంచితే సహకార సంఘాలకు ప్రస్తుత మున్న సాంకేతిక పరిజ్ఞానం సరిపోయేలా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రస్తుతం కోర్ బ్యాంకింగ్ ద్వారా రోజువారీ ఆన్లైన్ కార్య క్రమాలు నిర్వహిస్తు న్నారు. మోడెం ద్వారా ఇవి జరుగుతున్నా యి. గ్రామీణ ప్రాంతాల్లోని సంఘాల్లో కూడా ఆన్లైన్ సేవలు అందుబాటు లోకి తీసుకుచ్చేందుకు తగిన విధంగా సాంకేతిక చర్యలకు శ్రీకారం చుడుతున్నారు.

**సిబ్బంది, ఆపరేటర్లకు శిక్షణ**

ప్రాయోజిత సేవలపై సహకార సంఘాల్లో పని చేస్తున్న సిబ్బంది. కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. 54 సర్వీసుల ద్వారా ప్రజలకు 340 బహుళ ఆర్థిక సేవలను అందుబాటులోకి తేనున్నా రు. ప్రస్తుతం సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన పరికరాలు, ఎరువులు, విత్తనాలు మాత్రమే అందుతున్నాయి. రైతులతోపాటు ప్రజలకు మరింత చేరువ య్యేలా బహుళ ఆర్థిక సేవలను అందించేం దుకు సహకార సంఘాలకు లాగిన్ ఇచ్చారు.

**సంఘాల్లో అందించే సేవలు ఇలా..**

సహకార సంఘాల ద్వారా ఆదాయ పన్ను, ఇంటి పన్ను, విద్యుత్ బిల్లుల చెల్లింపు, రిజిస్ట్రేషన్లు, నగదు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం సహకార సంఘాల ద్వారా రైతులకు పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రాయోజిత సేవలలో భాగంగా నిత్యావసర సరకులు, దుస్తులు, అవసర మైన ప్రతి వస్తువు కొనుగోలు చేసేందుకు సహకార సంఘం లోనే ఆన్లైన్ నమోదు చేసుకునే అవకాశం కల్పి స్తారు. జనరిక్ మందులను అందుబాటులో ఉంచడం, ఆరోగ్యపరమైన సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేట్ వైద్యుల ద్వారా ఆన్లైన్లో సలహాలు, సూచనలు, రక్త నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణలు అందేలా చూస్తారు. విమాన, రైల్వే, బస్సు రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. లావాదేవీలు నిర్వహించేందుకు సహ కార సంఘం నుంచి కరెంట్ ఖాతాలను తెరిచారు.

**దశల వారీగా సేవల అమలుకు చర్యలు**

**టి. వెంకట్ రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి, మేడ్చల్ జిల్లా**

సహకార సంఘాల్లో అన్ని రకాల ఆన్లైన్ సేవలను ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. మేడ్చల్ జిల్లాలో తొమ్మిది సహకార సంఘాల ద్వారా ప్రజలకు ప్రాయోజిత సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా ముదుచింతలపల్లి సహకార సంఘంలో ప్రజలకు పలు రకాల సేవలను అందుబాటులో తెచ్చాం. దశల వారీగా మిగతా సేవలు అందిస్తాం.ఇటీవల సిబ్బందికి ఇచ్చిన శిక్షణలో ప్రజలకు అందించాల్సిన సేవలపై అవగాహన కల్పించాం. శిక్షణతో పాటు సందేహాలు నివృత్తి చేశాం. సేవలు అందుబాటులోకి వస్తే వ్యాపా రాలు పెరిగి సహకార సంఘాలు బలోపేతం అవుతాయి. ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భూములను దోచుకునే కుట్ర


- అనుముల రేవంత్ రెడ్డి కాదు అవినీతి అనకొండ
- రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఘాటు విమర్శలు




**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 4 (జనం సాక్షి) :** హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ ఫార్మేషన్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం భారీ భూ కుంభకోణానికి పాల్పడుతుందని బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గురువారం హెచ్ఐఎల్టిపి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న భూ సేకరణ ను వ్యతిరేకిస్తూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల పారిశ్రామిక వాడలో స్థానిక ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్ లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించవలసిన అవసరం ఉందన్నారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలకు ఉపయోగపడే విధంగా పరిశ్రమల కోసం కేటాయించిన స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తానడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని ప్రైవేటు వ్యక్తులకు ప్రజల కోసం, పరిశ్రమల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాలని గుర్తు చేశారు. మార్కెట్ విలువ లక్ష రూపాయలు ఉన్న స్థలాన్ని ప్రభుత్వం కేవలం 4000 రూపాయలకే ప్రైవేటు వ్యక్తులకు కేటాయించాలని చూస్తున్నట్లు ఆరోపించారు. హైదరాబాద్ మహానగరంలో పేద ప్రజలకు ఇండ్ల నిర్మాణానికి ,పాఠశాలల నిర్మాణాలకు ఆసుపత్రుల, స్మశాన వాటికలకు స్థలం లేదు. 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నగరంలోని కంపెనీలను తరలిస్తే వాటి పైనే ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి చూస్తున్న వివాహంపై నిజా నిజాలు నెగ్గ తేల్చాలని ఉద్దేశంతోనే పారిశ్రామిక వాడలలో పర్యటనలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేటు వ్యక్తులకు కేటాయించిన స్థలాలను తిరిగి తీసుకోవడానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో గజం స్థలం లక్ష రూపాయలు ఉన్నదని అలాంటి స్థలాన్ని కేవలం 4000 రూపాయలకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఫార్మసిటీ భూములలో రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమలలో పర్యటించి యాజమాన్యంతో , కార్మికులతో కార్మికులతో చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు .

# ఘనంగా ది ప్రీమియా అకాడమీ వార్షికోత్సవం-25

**స్థైర్యం, ఆత్మవిశ్వాసంతో విద్యార్థుల అద్భుత ప్రదర్శన**



**ఖైరతాబాద్, డిసెంబర్ 04 (జనం సాక్షి) :** ప్రముఖ అంతర్జాతీయ విద్యాసంస్థ ప్రీమియా అకాడమీ తన వార్షికోత్సవం–2025ను పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకకు కార్గిల్ యుద్ధ వీరురాలు కెప్టెన్ యషికా త్యాగి గౌరవ అతిథిగా విచ్చేసి, తన ప్రేరణాత్మక మాటలతో విద్యార్థుల్లో ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని నింపారు. సీనియర్ మేనేజ్మెంట్ ఆమెను స్వాగతిస్తూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధి పట్ల పాఠశాల కట్టుబాటును పునరుద్ఘాటించింది. ఈ సంవత్సరం సీనియర్ స్కూల్ థీమ్ 'ఉద్భవిని: రైజ్ ఆఫ్ ది లయనెస్' దీని ద్వారా ప్రతి విద్యార్థి తనలోని బలం, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసాన్ని గుర్తించి ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ థీమ్ ఆధారంగా విద్యార్థులు ధైర్యం, క్రమశిక్షణ, కరుణ, సహనశక్తి, జ్ఞానం వంటి విలువలను ప్రతిబింబించే తొమ్మిది మంది అసాధారణ మహిళల జీవితాలను వేదికపై ప్రదర్శించారు. జూనియర్ స్కూల్ విద్యార్థులు 'ది కలర్స్ ఆఫ్ జాయ్' థీమ్ ఆధారంగా తమ సాంస్కృతిక ప్రదర్శనలు అందించారు.



# సైబరాబాద్ పోలీసు అధికారిక వెబ్‌సైట్ పునరుద్ధరణ

శేరిలింగంపల్లి, డిసెంబర్ 04 (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి అధికారిక వెబ్సైట్ ప్రస్తుతం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందని సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్ మరియు ఇన్‌ఛార్జ్ సైబర్ మరియు క్రైమ్స్ విభాగం డిసిపి వై.వి.ఎస్. సుధీంద్ర తెలిపారు. నవంబర్ 15 నుండి వెబ్ సైట్ మెయింటెనెన్స్, అప్‌గ్రేడ్ పనుల కారణంగా వెబ్ సైట్ తాత్కాలికంగా అందుబాటులో లేదన్న విషయాన్ని గుర్తు చేసిన డిసిపి ప్రస్తుతం అన్నితరహా సేవలను వెబ్ సైట్ ద్వారా అందుబాటులో ఉంచామన్నారు. అత్యవసర సాంకేతిక నిర్వహణ, భద్రతను పెంచేందుకు చేపట్టిన పనుల కారణంగానే వెబ్ సైట్ డౌన్‌టైమ్ జరిగిందని ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుతానికి www.cyberabadpolice.gov.in అన్న పోలీస్ వెబ్ సైట్ పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.. ప్రజలు సమాచారం, వివిధ సేవల నిమిత్తం సైబరాబాద్ పోలీసుల అధికారిక వెబ్‌సైట్‌ను ఇకపై యథావిధిగా డిసిపి వినియోగించుకోవచ్చని డిసిపి సూచించారు.

# లైఫ్ లైన్ తులసి ఆసుపత్రిలో అరుదైన నోటి ద్వారా థైరాయిడ్ సర్జరీ విజయవంతం



**కాప్రా, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** ఈసిఐఎల్ లైఫ్ లైన్ తులసి హాస్పిటల్‌లో వైద్యులు మరో అరుదైన, అత్యాధునిక శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి వైద్య రంగంలో తమ ప్రతిభను మరోసారి చాటుకున్నారు. 60 ఏళ్ల వయస్సున్న ఒక వ్యక్తి గొంతులో థైరాయిడ్ సమస్యతో ఆసుపత్రికి రాగా, అన్ని విస్తృత పరీక్షలు నిర్వహించిన అనంతరం నోటిద్వారా ఎండోస్కోప్ సహాయంతో బయట ఎలాంటి కట్స్, సిజరింగ్ లేకుండా "ట్రాన్స్ ఓరల్ ఎండోస్కోపిక్ థైరాయిడ్ వెస్టిబ్యులర్ విధానం తోత్వ పద్ధతిలో థైరాయిడ్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు.సాధారణంగా ఈ తరహా ఆపరేషన్లు చేయాలంటే ఎంతో అను భవం, నైపుణ్యం కలిగిన వైద్యులు అవసరం. అలాంటి అరుదైన శస్త్రచికిత్స ను ఈస్ట్ హైదరాబాద్‌లో కేవలం లైఫ్ లైన్ తులసి హాస్పిటల్‌లో మాత్రమే నిర్వహించడం గర్వకారణం అని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ శస్త్రచికిత్స అనంతరం పేషెంట్ 24 గంటలలోనే లేచి నడవడం ప్రారంభించడం వైద్య బృందానికి మరింత ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా లైఫ్ లైన్ తులసి హాస్పిటల్ ఛైర్మన్, చీఫ్ సర్జన్ డా. జె.ఎస్. రాజ్ కుమార్ మాట్లాడుతూ,తోత్వ పద్ధతిలో నోటిద్వారా థైరాయిడ్ సర్జరీ చేసి పేషెంట్‌కు బయట ఎలాంటి మచ్చలు లేకుండా వేగంగా కోలుకునేలా చేయడం అత్యంత సంతోషకరం. ఇది మా ఆసుపత్రి వైద్య బృందం సమష్టి కృషికి ప్రతిఫలం. ఈ విజయంతో ఈస్ట్ హైదరాబాద్ ప్రజలకు మరింత మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించగలుగుతాం అన్నారు. ఈ ఆపరేషన్‌లో డా. జె.ఎస్. రాజ్ కుమార్‌తో పాటు డా. కల్నల్ కె.ఆర్. రావు, డా. కరుణాకర్, డా. ప్రఫుల్, డా. భార్గవ పాల్గొన్నారు.

# 2 లక్షలు దాటిన రేషన్ కార్డుదారులు

**ఉప్పల్ (జనం సాక్షి ):** ఉప్పల్ సర్కిల్-2 పరిధిలో రేషన్కార్డుల మంజూరు ప్రక్రియ జోరుగా సాగుతూనే ఉంది. సర్కిల్ పరిధిలో ఉప్పల్, కాప్రా, మల్కాజిగిరి, అల్వాల్ మున్సిపల్ సర్కిల్ ప్రాంతాలు ఉన్నాయి. ఆయా పరిధిలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 2.25 లక్షలకు చేరుకున్నట్లుగా పౌరసరఫరాల అధికారులు తెలిపారు. కేవలం 7 నెలల్లోనే కొత్తగా 45 వేల రేషన్కార్డులు మంజూరయ్యాయి.

# కారుకు రాయి తగిలిందని తోటి విద్యార్థులతో కొట్టించిన టీచర్

**సంఘటనను ఈజీగా తీసుకున్న ప్రధానోపాధ్యాయులు**



**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 4 (జనం సాక్షి):** విరామం సమయములో విద్యార్థులంతా ఆడుకుంటుండగా ఒక రాయి ఉపాధ్యాయుడు కారుకు తగలడంతో విద్యార్థిని దండించిన సంఘటన వికారాబాద్ జిల్లా యాలాల్ లో జరిగింది. వివరాల్లోకి వెళితే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాలాల బాలుర పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న శ్రీరామ్ ప్రసాద్ అనే విద్యార్థిని ఉపాధ్యాయుడు భాను చైతన్య కారు రాయితో కొట్టారని కారణంతో కొట్టినట్లు విద్యార్థి మీడియాకు తల్లిదండ్రులకు తెలియజేశాడు. కొందరు విద్యార్థులతో కలిసి విరామం సమయంలో పాఠశాల ఆవరణలోని మైదానంలో ఆడుకుంటుండగా ఒక రాయి ఉపాధ్యాయుడి కారుకు తగలడంతో బూతులు తిట్టి కొట్టినట్లు తెలియజేశాడు. అంతేకాకుండా పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు కొట్టించినట్లు తెలియజేశారు . ఈ విషయం విద్యార్థి తల్లిదండ్రులు ఉపాధ్యాయుని ప్రశ్నిస్తే ప్రధానోపాధ్యాయులు సిద్ధిరామేశ్వరులు సమర్థించినట్ల సమర్థించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు మల్కయ్య తీవ్రంగా ఖండించారు. విద్యార్థి పై దాడి చేయించిన ఉపాధ్యాయుడు పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయులు సంఘటనలు సమర్థిస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# శేరిలింగంపల్లి జెవి కాలనీలో బిల్డర్ల రాజ్యం

## ఇప్పటికైనా మేలుకొన్న అధికారులు?




- వందల కోట్ల అక్రమ నిర్మాణాలకు నోటీసులు.. కానీ చర్యలు శూన్యం
- ఒకే స్థలంలో రెండు వేర్వేరు రిజిస్ట్రేషన్లతో కోట్లు కొల్లగొట్టిన రియల్ మాఫియా
- నోటీసుల తర్వాత ఆగిపోయిన 'ఊపు'.. మళ్లీ నిర్మాణాలకు పైరవీలు?
- జెవి కాలనీలో పలు భవనాలకు తాకిదుల అందజేత...
- ముక్తాయింపుగా ముగిస్తారా... చర్యలతో ముందుకు వెళతారా!?

శేరిలింగంపల్లి, డిసెంబర్ 04 (జనంసాక్షి) : జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగంలో గత కొన్నేళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న కొత్తతరహా మోసంపై మీడియాలో వస్తున్న కథనాలకు తప్పనిసరి పరిస్థితులలో అధికారులు కదలాల్సి వచ్చింది. ఇందులో భాగంగానే శేరిలింగంపల్లి డివిజన్ పరిధి జెవి కాలనీ పరిధిలో ఎట్టకేలకు కొన్ని భవనాలకు తాఖీదులను అందజేశారు. నోటీసులు అందుకున్న భవన యజమానుదారులు అనుకున్న స్థాయిలో వెనక్కి తగ్గినట్టు కనిపించడం లేదు. దీనికి తోడు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వెళ్లి నాలుగైదు రోజుల క్రితమే అక్రమ కట్టడాలకు నోటీసులను అందజేసినా తదనంతరం వారి వైపునుండి పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించకపోవడం పట్ల పలువురు పెదవి విరుస్తున్నారు.

**ముక్తాయింపుగా ముగిస్తారా...**

**చిత్తశుద్ధితో చర్యలు చేపట్టి ముందుకు వెళతారా!?**

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని జెవి కాలనీలో గత కొన్నేళ్లుగా ఉమ్మడి స్థలానికి వేరువేరుగా రిజిస్ట్రేషన్లు, వాటి సహకారంతో మున్సిపల్ కార్యాలయం చీకటి వ్యాపారాన్ని కొనసాగిస్తూ వందల కోట్లు వెనకేసుకున్న పలువురు బిల్డర్ల బాగోతాన్ని బట్టబయలు చేస్తూ ఈ మధ్యకాలంలో మీడియాలో వరుస కథనాలు ప్రచరితమవడం, అందులో మున్సిపల్ అధికారుల తీరుతెన్నులనుసైతం కళ్లకు కట్టినట్లు చూపించడంతో గత్యంతరం లేనిస్థితిలో శేరిలింగంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కాస్త కదిలి శేరిలింగంపల్లి డివిజన్ పరిధి ఆయా కాలనీల అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు అందించడం జరిగింది. ముఖ్యంగా జెవి కాలనీలోని పలు భవనాలకు గత నాలుగైదు రోజుల క్రితం ప్రత్యక్షంగా వెళ్లి నోటీసులను అందజేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే నోటీసులు అందజేసేవరకు ఉన్న ఊపు ఉత్సాహం అధికారులలో కొరవడినట్లు గోచరిస్తుండడంతోపాటు మళ్లీ అటువైపు వెళ్లి కన్నెత్తి కూడా చూడలేదనే ఆరోపణలు స్థానికంగా వెల్లవెత్తుతున్నాయి. దీనికితోడు అక్రమ నిర్మాణాల యజమానులలో కనీస ఆదుర్దా కూడా కనిపించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందని జెవి కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. వార్తా కథనాలు వచ్చిన రెండు మూడు రోజులు హడావుడి చూపించే అధికారులు పరిస్థితులు సర్దుబాటు కాగానే వీటిని పూర్తిగా పక్కన పెట్టి సొంత కార్యక్రమాల వైపు దృష్టిని సారిస్తుంటారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో వందలకోట్ల అక్రమ భూదందా కొన్నేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతున్నా ఇంటి దొంగలు ఈశ్వరుడైన పట్టలేని సామెతను రూఢీ చేస్తూ పట్టణ ప్రణాళిక అవిభాగం అధికారులు సైతం చడిచప్పుడు లేకుండా ఆయా అక్రమ నిర్మాణాలకు తమ వంతు చేయూత, భరోసాను అందిస్తుండడంతో ప్రభుత్వ ఖజానాకు ఊహించనంత గండి పడినట్లు అధికారులు చెవులు కొరుక్కుంటున్నారు. ఒక్కొక్క అక్రమ నిర్మాణంలో స్టీల్ ప్లస్ సిక్స్(దాదాపు ఏడు అంతస్తులు) స్థాయిలో నిర్మాణాలు జరిగి ఎక్కడ చూసినా కోట్ల రూపాయల సొమ్ము చేతులు మారినట్లు స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు ఘోషిస్తున్నాయి. మంచి ఖరీదైన జెవి కాలనీలో ఇప్పటివరకు ఎన్ని భవనాలకు ఇలాంటి అక్రమ పద్ధతులలో నిర్మాణం జరిగిందో స్పష్టత లేదని, ఏది ఏమైనా వందలకోట్ల ఆర్థిక లావాదేవీలు తప్పుడు మార్గంలో జరిగిపోయినట్లు పలువురు అంచనా వేస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల దురాగతాలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు జవాబుదారీతనంతో నిరోధించి నిర్మూలిస్తారా లేక ముక్తాయింపుగా ముగిస్తారా అనేది ప్రస్తుతం లక్ష డాలర్ల ప్రశ్న.




# పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

**ఖమ్మం (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో నిశితంగా పర్యవేక్షించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ స్టేషన్ సెక్టర్ అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ తో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా గ్రామపంచాయతీ ఎన్నికల బందోబస్త్ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా.. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా వినియోగించుకునేలా పోలీస్ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గ్రామాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను బైండోవర్ చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అన్నారు. మద్యం విక్రయాలు జరిపే బెల్ట్ షాపులను కట్టడి చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా, ఆర్డర్ ప్రసాద్ రావు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మహేష్, ఇన్స్పెక్టర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
5 డిసెంబర్ 2025

# ఉడుంపట్టు పట్టిన రైతన్నలు

- సంబరాలు చేసుకున్న పెద్ద ధన్వాడ రైతులు
- పరిశ్రమను వ్యతిరేకించిన 12 గ్రామాలు
- ఏడాది పోరాటం ఎట్టకేలకు విజయవంతం
- పరిశ్రమను నిలిపివేస్తున్నట్టు తాజా ప్రకటన



**రాజోలి, డిసెంబర్ 4 (జనంసాక్షి) :** పోలీసులు నిర్బంధం విధించినా..నిరసన తెలుపుతున్నారని కేసులు పెట్టి వేధించినా రైతులు వెనక్కి తగ్గలేదు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ 12 గ్రామాల ప్రజలు కదం తొక్కారు. ఏడాది నుంచి ఉద్రిక్తంగా సాగిన పోరాటంలో చివరకు ప్రజలే గెలిచారు. ప్రజా ఉద్యమానికి దిగివచ్చిన ఫ్యాక్టరీ యాజమాన్యం తాజాగా ప్రకటనలో భాగంగా ఏపీలోని నెల్లూరు జిల్లాకు తరలిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు గురువారం పెద్ద ధన్వాడ గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, టపాకాయలు కాల్చి ఒకరికొకరు మిఠాయిలు పంచుకొని ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.

### రైతన్నల అలుపెరగని పోరాటం

తమ భూములను తాము కాపాడుకోవడానికి రైతులు గత ఏడాదిగా పోరాటాలు నిర్వహించారు. పోలీసు కేసుల కారణంగా ఇల్లు వాకిలి విడిచి తిండీతిప్పలు లేకుండా పోలీస్‌స్టేషన్, అధికారుల చుట్టూ తిరిగారు. భూములను కాపాడుకోవడానికి గల్లీ నుంచి ఢిల్లీ వరకు తమ డిమాండ్స్ వినిపించారు. తమ పక్షాన న్యాయం ఉన్నందుకే తమకు ఊరట లభించిందని రైతులు చెప్తున్నారు. మహమ్మారి ఫ్యాక్టరీ తరలిస్తుండడం పై రైతులు సంతోషం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రైతు పక్షాన న్యాయం ఉన్నదని అధికారులు గ్రహించి, భూముల జోలికి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### ఇథనాల్‌పై గెలుపులో మహిళలు

అభివృద్ధికి ఎవరు మాత్రం కాళ్లు అడ్డుతారు కానీ, అభివృద్ధి అనుకున్నది ఊరువాడకు చేటు చేసేలా ఉందని అనిపిస్తే ఆందోళన మొదలవుతుంది. మంచి అని చెబుతున్నది 'చెడు' చేయడానికి వస్తుంది అనుకుంటే ఆగ్రహం కట్టలు తెచ్చుకుంటుంది. ఆ ఆందోళన ఆగ్రహం ఉద్యమ రూపం దాల్చుతుంది. ఈ ఉద్యమ ప్రత్యేకత మహిళా శక్తి ఎంతో ప్రాధాన్యంగా నిలిచింది. అక్షరజ్ఞానం లేని మహిళల నుంచి చదువుకున్న మహిళల వరకు, కూలి పనులు చేసుకునే శ్రామిక మహిళల నుంచి ఇంటిపనుల్లో తలమునకలయ్యే గృహిణుల వరకు ఈ ఉద్యమంలో భాగం అయ్యారు. ఉద్యమానికి వెన్నెముకై ముందుకు నడిపించారు.



### ప్రభుత్వం సీరియస్

మరోవైపు..ఇథనాల్ పరిశ్రమ అనుమతులను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అనుమతులు పునఃసమీక్షించాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఇథనాల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

### అందరం సంతోషంగా ఉన్నాం



మొదట్లో ఫ్యాక్టరీ ఏర్పాడిస్తే కాలుష్యం పెరుగుతుందని, తమ జీవనోపాధికి నష్టం జరుగుతుందని మేం ఆందోళన చేశాం. మేం చేసిన పోరాట ఫలితంగా ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వేరే ప్రాంతానికి తరలిస్తుండడంతో మాకు ఎంతో గర్వకరణం ఉంది. మా భూమి కోసమే పోరాటం మా వెనుక ఎవరూ లేరు. మొత్తానికి ఫ్యాక్టరీ పనులను నిలిపివేయడంతో గ్రామస్తులందరం సంతోషం వ్యక్తం చేస్తున్నాం.

– సువేదా, పెద్ద ధన్వాడ

### మరోసారి సిద్ధంగా ఉన్నాం

క్షణం తీరిక లేకుండా పొలం పనులు, ఇంటి పనులు అయినంత మాత్రాన ఊరు ఎటుబోతే నాకేంది అనుకోలేము కదా. ఇది ఒక్కరి సమస్య కాదు. ఊరందరి సమస్య కాబట్టి ఎంత పని ఒత్తిడి ఉన్నా ఉద్యమంలో భాగం అయ్యాను. ఫ్యాక్టరీ తరలిస్తే అన్ని గ్రామాలు అందరం బాగుంటాం. మహిళలే ఉద్యమం అయితే ఆ శక్తి ఎలా ఉంటుందో మరోసారి నిరూపించడానికి సిద్ధంగా ఉన్నాం.

– ప్రేమిలమ్మ, చిన్న ధన్వాడ



## పాతబస్తీలో యువకుడి దారుణ హత్య

- రియల్ వ్యాపారి జునైద్‌గా గుర్తింపు

**హైదరాబాద్, డిసెంబరు 4 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. రెయిన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి కత్తి పోట్లతో పడి ఉన్నట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు బాధితుడిని హుటాహుటిన సంతోష్‌నగర్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు పాతబస్తీ రెయిన్ బజార్‌కు చెందిన మహమ్మద్ జునైద్ (30)గా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన జునైద్‌ను కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణారహితంగా కత్తులతో పొడిచారని.. తీవ్రంగా గాయపడిన జువైద్‌ను ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడని పోలీసులు తెలిపారు. అనంతరం జునైద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ హత్యకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ మొదలుపెట్టారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. అయితే నిందితులు, బాధితుడు ఇద్దరూ కూడా బంధువులే అని అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్ తెలిపారు. జువైద్‌ను ఎందుకు హత్య చేశారనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.

## వార్డు మెంబర్ గెలుపుకోసం నానా తంటాలు

- భార్యను గెలిపిస్తే ఫ్రీ కటింగ్ అంటూ ప్రచారం

**సిద్దిపేట, డిసెంబరు4 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఓట్ల పండగలో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు కోతులను తరిమిస్తామని హామీ ఇవ్వగా, కొందరు రకరకాల హామీలు ఇస్తున్నారు. పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని అన్ని పంచాయతీ, గ్రామ, వార్డు పరిధిలో ఎన్నికల హీట్ పెరిగిపోయింది. ప్రధాన పార్టీలు బలపరచిన సర్పంచ్, వార్డ్ మెంబర్ అభ్యర్థులు ప్రచారం హోరాహోరీగా సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్లను ఆకర్షించేందుకు వివిధ రకాల ఆఫర్లు ప్రకటిస్తున్నారు. డబ్బు పంచడం ఓ ఎత్తు అయితే.. కొందరు చీరలు, వివిధ రకాల వస్తువులను బహుమతిగా అందిస్తున్నారు. ఈ క్రమంలో ఓ వార్డ్ మెంబర్ ఎన్నికల ప్రచారం సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. తన భార్యను వార్డు మెంబర్‌గా గెలిపిస్తే.. ఐదేళ్ల పాటు ఫ్రీగా కటింగ్ చేస్తానని ఆమె భర్త ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ చక్కర్ల కొడుతోంది..నా భార్యని వార్డ్ మెంబర్‌గా గెలిపిస్తే మగవారందరికీ కంటింగ్, షేవింగ్ ఫ్రీగా చేస్తానని ఓ భర్త వినూత్న ప్రచారం చేస్తున్నాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రఘోత్తంపల్లిలో ఓ మహిళ వార్డ్ మెంబర్‌గా పోటీ చేస్తోంది. ప్రస్తుతం అన్ని పంచాయతీల్లో సర్పంచ్, వార్డు మెంబర్లు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో రఘోత్తంపల్లిలో వార్డ్ మెంబర్‌గా పోటీ చేస్తున్న మహిళ కూడా ప్రచారం మొదలెట్టింది. సదరు మహిళ భర్త క్షురకుడు కావడంతో ప్రచారం వినూత్నంగా మొదలెట్టాడు. తన భార్యను వార్డ్ మెంబర్‌గా గెలిపిస్తే.. వార్డులోని మగవారందరికీ ఐదేళ్ల పాటు కటింగ్ , షేవింగ్.. ఫ్రీగా చేస్తానని చెబుతున్నాడు. ఇంటింటికీ వెళ్లి ఈ ఆఫర్ చెబుతూ.. తన భార్యను గెలిపించాలని కోరుతున్నాడు.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- హైదరాబాద్ విమానం అహ్మదాబాద్‌కు మళ్లింపు

**హైదరాబాద్, డిసెంబరు4 (జనంసాక్షి) :** షార్జా నుండి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో విమానాన్ని అత్యవసరంగా అహ్మదాబాద్‌కు మళ్లించారు. ఈ సంఘటన ప్రయాణికులలో, విమానాశ్రయ అధికారులలో కలకలం సృష్టించింది. ఇండిగో విమానానికి సంబంధించిన అధికారులకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు అందింది. విమానంలో మానవ ఐఈడీ ఉన్నట్లుగా ఈ మెయిల్ ద్వారా బెదిరించినట్లు తెలిసింది. బెదిరింపు రాగానే అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, విమానాన్ని దాని గమ్యస్థానం హైదరాబాద్‌కు కాకుండా అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మళ్ళించారు. అహ్మదాబాద్‌లో విమానం ల్యాండ్ అయిన వెంటనే, ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. అనంతరం భద్రతా సిబ్బంది బాంబు స్క్వాడ్‌తో కలిసి విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు రావడం ఇది రెండవసారి. గతంలో, కువైట్ నుండి హైదరాబాద్‌కు రావాల్సిన మరో విమానానికి బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో, ఆ విమానం ఉదయం 7:45 గంటల ప్రాంతంలో ముంబై ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయింది. అప్పుడు కూడా ప్రయాణికులను దించి, బాంబు డిస్పోజల్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాయి.

## సుష్మాస్వరాజ్ భర్త కౌశల్ కన్నుమూత



**న్యూఢిల్లీ, డిసెంబరు4 (జనంసాక్షి) :** దివంగత సుష్మస్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్ కన్నుమూశారు. మిజోరం మాజీ గవర్నర్, భాజపా దివంగత నేత సుష్మా స్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్ (73).. అనారోగ్య కారణాలతో ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమార్తె బన్సూరీ స్వరాజ్ వెల్లడించారు. 1952 జులై 12న హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్‌లో జన్మించిన స్వరాజ్ కౌశల్.. 37 ఏళ్ల వయసులోనే (1990లో) మిజోరం గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆయన భార్య సుష్మా స్వరాజ్.. దిల్లీ ముఖ్యమంత్రిగా, భారత విదేశాంగమంత్రిగా సేవలందించారు. 2019 ఆగస్టు 6న ఆమె మరణించారు.

## కేరళలో భారీగా ఎక్సైజ్ తనిఖీలు

- రూ.72 లక్షల నగదు పట్టివేత
- ఎపికి చెందిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్



**తిరువనంతపురం, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** కొట్టాయంలో అంతర్రాష్ట్ర బస్సులో లెక్కల్లో చూపని సుమారు రూ.72 లక్షల నగదును ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ, కేరళ మధ్య నడిచే అంతరాష్ట్ర బస్సులో ఈ డబ్బును గుర్తించారు. వీటిని తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, కేరళలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సందర్భంగా మాదకద్రవ్యాల, నల్లధనం అక్రమ రవాణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. కొట్టాయంలోని కురవిలంగాడ్‌లో జరిగిన తనిఖీలలో, అధికారులు బస్సులోని ఒక బ్యాగ్‌లో దాచిన నగదు కట్టలను కనుగొన్నారు. మరింత అనుమానం రావడంతో ఇద్దరు ప్రయాణికులను తనిఖీ చేయగా, వారి వద్ద మరింత నగదు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.72 లక్షలు ఉందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ఏపీకి చెందిన షేక్ జాఫర్ (59), షాషాస్‌గా గుర్తించారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలను ఇద్దరూ సమర్పించలేక పోయారు. ఇద్దరు అనుమానితులను తదుపరి దర్యాప్తు కోసం ఆదాయపు పన్ను శాఖకు అప్పగించారు. భారీగా పట్టుబడిన ఈ నగదు వెనుక హవాలా రాకెట్ ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల ఫోన్‌లను కూడా జప్తు చేశారు. నిధులను ఉగ్రవాద కార్యకలాపాల వినియోగం కోసం తరలిస్తున్నారా? లేదా వేరే దేని కోసమా? అని తెలుసుకోవడానికి సైబర్ ఫోరెన్సిక్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు స్మగ్లర్లు అంతర్రాష్ట్ర బస్సులను ఎక్కువగా వినియోగిస్తుంటారు. చిన్న ప్రైవేట్ వాహనాల మాదిరిగా కాకుండా, బస్సులను తనిఖీల కోసం చాలా అరుదుగా ఆపివేస్తారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని చాలా అరుదుగా మాత్రమే బస్సులను తనిఖీ చేస్తుంటారు. ఈ అవకాశాన్ని కొన్ని ముఠాలు అక్రమాల కోసం వాడుకుంటున్నాయి.




## అఖండ ప్రీమియర్ షో క్యాన్సిల్

- యధావిధిగా నేడు సినిమా విడుదల

**హైదరాబాద్, డిసెంబర్4 (జనంసాక్షి) :** అఖండ 2 ప్రీమియర్స్ కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న బాలకృష్ణ అభిమానులకు సినిమా టీమ్ షాకింగ్ న్యూస్ చెప్పింది.ఒకరోజు ముందుగానే ప్రీమియర్స్‌తో సినిమా ప్రారంభించాలని అనుకున్నారు. కానీ, చివరి నిమిషంలో టెక్నికల్ ఇష్యూస్ కారణంగా సినిమా ప్రీమియర్స్ క్యాన్సిల్ చేసినట్లుగా సినిమా టీమ్ ప్రకటించింది. 'ఈరోజు వేయాల్సిన అఖండ ప్రీమియర్స్ టెక్నికల్ ఇష్యూస్ వల్ల క్యాన్సిల్ అయ్యాయి. మేము సినిమా షో వేయడానికి చాలా ప్రయత్నించాం, కానీ కొన్ని మా చేతుల్లో లేకుండా పోయాయి. సారీ ఫర్ ది ఇన్‌కన్వీనియన్స్' అంటూ సంస్థ 14 రీల్స్ ప్లస్ అధికారిక ట్విట్టర్ ఖాతా నుంచి పోస్ట్ పెట్టింది. నిజానికి, అమెరికా సహా ఇండియాలో కూడా ప్రీమియర్స్ పెద్ద ఎత్తున ప్రదర్శించాలని ప్లాన్ చేశారు. కానీ, టెక్నికల్ ఇష్యూస్ కారణంగా ఇప్పుడు ఆ ప్రీమియర్స్ ప్రదర్శన నిలిపివేస్తున్నట్లు సినిమా టీమ్ అధికారికంగా ప్రకటించింది. అయితే ఓవర్సీస్ రివ్యూస్ మాత్రం యధావిధిగా పడనున్నాయని ప్రకటించారు. సినిమా రేపు ఉదయం యధావిధిగా రిలీజ్ అవుతుందని పేర్కొంది.

## సేంద్రియ వ్యవసాయం శ్రేయస్కరం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి
- కన్హా శాంతి వనంలో జాతీయ మహా కిసాన్ మేళా
- దేశ వ్యాప్తంగా రైతులు, శాస్త్రవేత్తల హాజరు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రస్తుత కాలానుగుణంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్ని ఆచరించాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం హైదరాబాద్ శివారులోని కన్హా శాంతి వనంలో ఏషియన్ పి జి పి ఆర్ సొసైటీ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం సహకారంతో జాతీయ మహా కిసాన్ మేళా ముగింపు సభకు చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ గడచిన పలు దశాబ్దాలుగా భారత దేశ వ్యవసాయ పరిణామ క్రమాన్ని వివరించారు. మనుషులు ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలు ప్రధాన పాత్రను పోషిస్తాయని చిన్నారెడ్డి అన్నారు. అనంతరం ఏషియన్ పి జి పి ఆర్ సొసైటీ వారు ఎంపిక చేసిన ఉత్తమ రైతులకు అవార్డులు అందజేశారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 43 మంది రైతులకు తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అభ్యుదయ రైతులుగా ప్రశంస పత్రాలను డాక్టర్ జి చిన్నారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కిసాన్ మహా మేళాలో భాగంగా నేలలో ఉండే సూక్ష్మజీవులు, పోషకాల గురించి, ఆయిల్ పామ్ సాగు ఆవశ్యకత, ఉద్యాన, అధిక విలువ గల పంటల సాగు పద్ధతుల గురించి, డిజిటల్ వ్యవసాయం - వ్యవసాయంలో కృత్రిమ మేధ, డ్రోన్ల వినియోగం, ఐటి వినియోగం గురించి, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాల గురించి చర్చ కార్యక్రమాలలో శాస్త్రవేత్తలు, రైతులు మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో ఏషియన్ పి జి పి ఆర్ సొసైటీ అధ్యక్షులు ఎమ్మెస్ రెడ్డి, రైతుగా పద్మశ్రీ అందుకున్న చింతల వెంకట రెడ్డి, మార్క్ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ అజయ్ కల్లాం, వ్యవసాయ విశ్వ విద్యాలయం రిటైర్డ్ విస్తరణ సంచాలకులు డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, నార్మ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ గారు, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బీ. కృపాకర్ రెడ్డి, పి జి పి ఆర్ సొసైటీ కోశాధికారి సూదిని హరికిషన్, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘ ప్రధాన కార్యదర్శి జి కృపాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శశిధర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు నరసింహులు గారు, దేశ వ్యాప్తంగా రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు, ఔత్సాహికులు హాజరయ్యారు.

## సాధారణ స్థితికి చేరుకుంటున్నాం

- విమానాల అంతరాయాన్ని సరిదిద్దుతున్నాం
- ఇండిగో విమానయాన సంస్థ తాజా ప్రకటన

**న్యూఢిల్లీ, డిసెంబర్4 (జనంసాక్షి) :** దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో ప్రయాణ సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతున్నది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. నవంబర్‌లో ఏకంగా 1,232 సర్వీసులను రద్దు చేసినట్లు డీజీసీఏ ప్రకటించింది. అంతేకాదు, కేవలం గడిచిన రెండు రోజుల వ్యవధిలోనే వందలాది విమానాలను సంస్థ రద్దు చేసింది. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ సహా ఇతర పట్టణాలకు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో సంక్షోభం తలెత్తింది. మరోవైపు విమానాల రద్దు, ఆలస్యంపై ఇండిగో సంస్థ స్పందించింది. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపింది. క్రమంగా తమ విమానాలు పునరుద్ధరించ నున్నామని వెల్లడించింది. విమానాల రద్దు కారణంగా ప్రభావితమైన ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. 48 గంటల్లో తమ కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయని తెలిపింది. ఈ మేరకు గురువారం ఉదయం ప్రకటన విడుదల చేసింది. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టులలో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. గత రెండు రోజుల్లోనే ఏకంగా 250 నుంచి 300 విమానాలను సంస్థ రద్దు చేసింది. ఈ కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో సంక్షోభం ఏర్పడింది. విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయి దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఎయిర్‌పోర్ట్స్ వద్ద భారీ క్యూలు దర్శనమి స్తున్నాయి. విమానాలు రద్దు కావడంతో ప్రముఖ ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కోరింది. అదే సమయంలో తాజా పరిస్థితిపై ప్రయాణికులు నిరాశను వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో విమానాశ్రయాలలో ప్రయాణికులు ఆగ్రహంతో సిబ్బందిని నిలదీస్తున్న దఋశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ప్రధాని నరేంద్ర మోడీ, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును ట్యాగ్ చేస్తూ పలువురు నెటిజన్లు ఎక్స్ వేదికగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 7 గంటలకు పైగా చిక్కుకుపోయిన ఓ ప్రయాణికుడు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తీవ్ర గందరగోళం తలెత్తినట్లు ఎక్స్‌లో పేర్కొన్నాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు 12 గంటలకు పైగా ఎటువంటి కన్ఫర్మేషన్ లేకుండా పడిగాపులు పడుతున్నారని, ఇండిగో సిబ్బంది అబద్దాలు చెబుతూ జలగల్లా పీడిస్తున్నారని విమర్శించారు. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టులలో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో విమానాశ్రయాలలో ప్రయాణికులు ఆగ్రహంతో సిబ్బందిని నిలదీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ పనితీరును డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) బుధవారం ప్రశ్నించింది. నవంబర్‌లో 1,232 విమానాలు రద్దవడంతో పాటు విమానాల రాకపోకల సమయాల్లో జాప్యం జరిగింది. ఈ పరిస్థితిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీజీసీఏ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు జరుగుతున్న అసౌకర్యాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు చేపట్టవలసిన చర్యల గురించి ఇండిగోతో కలిసి మదింపు చేస్తున్నట్లు తెలిపింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370